www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 14-8-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 159 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం, తిథి: షష్ఠి రా.2:07 తదుపరి సప్తమి, నక్షత్రం: రేవతి ఉ.9:06 తదుపరి అశ్వని, వర్జ్యం: తె.3:51-5:21, దుర్ముహూర్తం: ఉ.10:13-11:04, మ.3:16-4:06, అమృతఘడియలు: ఉ.6:50-8:20, రా.12:51-2:21, రాహుకాలం: మ.1:30-3:00, సూర్యోదయం: 6:01, సూర్యాస్తమయం: 6:38 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నరకానికి పోతావ్..

ఇవే నీకు చివరి ఎన్నికలు కావొచ్చు

ఈ ముసలి వయసులో రామా కృష్ణా అనుకుంటే పుణ్యం అయినా దక్కుతుంది

సీఎం చంద్రబాబుకు జగన్ తిట్లు.. శాపనార్థాలు

పులివెందులలో ప్రజాస్వామ్యం మంటగలిపారని అవాకులు

14







విజయవాడ-గుంటూరు మధ్య కాజ టోల్‌గేట్ వద్ద బుధవారం రాత్రి నిలిచి ఉన్న నీరు.. బెజవాడలో గుణదల ఇనుప వంతెనపై నుంచి ప్రవహిస్తున్న బుడమేరు నీరు

కుంభవృష్టి



విజయవాడలో బుడమేరు పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

చిగురుటాకులా వణికిన కోస్తా జిల్లాలు

బెజవాడ, గుంటూరులో ఏకధాటిగా కుండపోత.. చుండూరులో అత్యధికంగా 27 సెంటీమీటర్ల వర్షం.. నదులను తలపించిన జాతీయ రహదారులు

కాజ టోల్‌ప్లాజా వద్ద మునిగిన ఎన్‌హెచ్-16.. రాకపోకలకు తీవ్ర అంతరాయం

పొంగిపొర్లుతున్న వాగులు, డ్రెయిన్లు.. ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద

నిండుగా ప్రవహిస్తున్న బుడమేరు.. పొలాల్లోనే మునిగిన రైతుల పంట కలలు

చెరువులకు గండి.. వేల ఎకరాలు మునక.. మరో 2 రోజులు భారీ వర్షాలు: ఐఎండీ



పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలంలో పూర్తిగా నీట మునిగిన పంట పొలాలు

నలుగురు మృతి

బెజవాడలో మ్యాన్‌హోల్‌లో పడి టీడీపీ నేత మృత్యువాత

వేర్వేరు చోట్ల నీటిలో కొట్టుకుపోయి మరో ఇద్దరు.. కూలిన చెట్టుకు ఢీకొని మరొకరు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

కుండపోత వర్షాలతో రాష్ట్రం తడిసిముద్దవుతోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో వానలు దంచికొడుతున్నాయి. మంగళవారం అర్ధరాత్రి, బుధవారం ఏకధాటిగా కొన్నిగంటలపాటు పడిన భారీవర్షాలతో కోస్తాంధ్ర చిగురుటాకులా వణికిపోయింది. విజయవాడ, గుంటూరు పరిధిలోని జాతీయ రహదారులు నదులను తలపించాయి. పంట కలలను మోస్తున్న పొలాలు

మిగతా 13వ పేజీలో...

నేడు కూడా అతి భారీ వర్షాలు!

తీవ్ర అల్పపీడనంగా బలపడే అవకాశం

వాయుగుండంగా మారుతుందని అంచనాలు

బెజవాడ, గుంటూరు జలమయం

కొండవీటి వాగులో కొట్టుకుపోయిన కారు

గుంటూరు వ్యవసాయ కమిషనరేట్, తాడేపల్లిలోని పలు కాలనీల్లో ఇళ్లలోకి నీరు

బాపట్ల, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో 44 వేల హెక్టార్లలో పంటల మునక

జిల్లాల్లో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

మంత్రులు, అధికారులతో సీఎం సమీక్ష

గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో నేడు స్కూళ్లకు సెలవు

వ్యవసాయానికి స్మార్ట్ మీటర్లు వద్దు

భవిష్యత్తు అంతా గ్రీన్ ఎనర్జీదే

ఏపీని గ్రీన్ ఎనర్జీ కారిడార్‌గా తీర్చిదిద్దాలి

ఇంధన రంగంపై స్వల్ప, మధ్య, దీర్ఘకాల ప్రణాళికలు

పునరుత్పాదక ఎనర్జీలో ఖర్చు తగ్గించడం కీలకం

విద్యుత్ చార్జీల భారం వేయడానికి వీల్లేదు

విద్యుత్ శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు



గ్రీన్ ఎనర్జీపై సీఎం క్యాంపు కార్యాలయంలో సమీక్షిస్తున్న చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యవసాయ పంప్ సెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు డిస్కమ్‌లను ఆదేశించారు. ఏపీని గ్రీన్ ఎనర్జీ కారిడార్‌గా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంధన శాఖకు సూచించారు. బుధవారం ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో విద్యుత్ సరఫరా, విద్యుత్ ప్రాజెక్టులు, పెట్టుబడులు, వినియోగదారులపై విద్యుత్ చార్జీల భారం తగ్గింపు.. తదితర అంశాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రస్తుతం పునరుత్పాదక విద్యుత్ వేగంగా విస్తరించి జనజీవనంలోకి వచ్చేసిందని, భవిష్యత్ అంతా గ్రీన్ ఎనర్జీదేనని

మిగతా 12వ పేజీలో...

40 రోజుల్లో 1.20 కోట్ల ఇళ్లకు!

దేశంలో ఏ అధికార పార్టీ ఈ స్థాయిలో జనంలోకి వెళ్లలేదు: సీఎం

'సుపరిపాలనలో తొలి అడుగు'తో రికార్డు సాధించాం.. చాలా చోట్ల బాగా జరిగింది

13 నియోజకవర్గాల్లో వెనుకబాటు.. అక్కడి ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులను సంజాయిషీ కోరాలి

'స్త్రీ శక్తి'తో 90% హామీలు నెరవేర్చినట్లే.. దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత పార్టీ శ్రేణులదే

'సూపర్ సిక్స్ సూపర్ హిట్' పేరుతో 25న అనంతలో భారీ సభ: చంద్రబాబు

టీడీపీ కేంద్ర కార్యాలయానికి రాక.. పల్లా, లోకేశ్‌లతో సమావేశం

పార్టీ కార్యక్రమాలపై సుదీర్ఘ సమీక్ష.. కార్యకర్తల సంక్షేమంపై ఆరా

12

హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా

నలుగురు జడ్జీల ప్రమాణ స్వీకారం

జస్టిస్ హరినాథ్, జస్టిస్ న్యాపతి విజయ్, జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ సుమతితో ప్రమాణం చేయించిన చీఫ్ జస్టిస్ ఠాకూర్

14



ఇ.కొత్తపల్లెలో ఓట్లు వేసేందుకు వెళ్తున్న మహిళలు

14

పులివెందులలో 2చోట్ల రీపోలింగ్ ప్రశాంతం

కడప స్ట్రాంగ్‌రూంకు బ్యాలెట్ బాక్సుల తరలింపు

నేడు ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన



12

ఓఎంసీ కేసులో సబిత, కృపానందంను

నిర్దోషులుగా ప్రకటించడం చెల్లదు

సీబీఐ కోర్టు తీర్పుపై హైకోర్టులో కేంద్ర దర్యాప్తు సంస్థ అప్పీల్ దాఖలు



2

కనీస నిల్వపై ఐసీఐసీఐ బ్యాంక్ యూటర్న్

రూ.50 వేలు ఉండాలన్న నిబంధనపై వెనక్కి

ప్రోత్సాహకాలివ్వకుంటే ఏ కంపెనీ వస్తుంది?

బెంగళూరో, హైదరాబాదో తరలిపోతాయి: హైకోర్టు

విశాఖను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దాలనేది ప్రభుత్వ ఆలోచన

పెట్టుబడులను ఆకర్షించేందుకే ప్రోత్సాహకాలు

కంపెనీల ఏర్పాటుతో ఉద్యోగాలు వస్తాయి

రాష్ట్ర ప్రభుత్వానికి రెవెన్యూ పెరుగుతుంది

నామమాత్రపు రేటుతో భూకేటాయింపును సంకుచిత దృష్టితో చూడకండి

తద్వారా వచ్చే ప్రయోజనాలనూ పరిగణనలోకి తీసుకోవాలి

పెట్టుబడులు రాకుంటే వ్యవసాయాధారిత రాష్ట్రంగా మిగిలిపోతుంది

కాగ్నిజెంట్‌కు భూకేటాయింపుపై ధర్మాసనం కీలక వ్యాఖ్యలు

కౌంటర్ దాఖలుకు ప్రభుత్వానికి ఆదేశం



అమరావతి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత కంపెనీలను ఆకర్షించి విశాఖపట్నాన్ని ఐటీ హబ్‌గా మార్చే ఆలోచనతోనే రాష్ట్రప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తోందని హైకోర్టు అభిప్రాయపడింది. ప్రోత్సాహకాలు ఇవ్వకుంటే పెట్టుబడులు పెట్టేందుకు ఏ కంపెనీలు ముందుకొస్తాయని ప్రశ్నించింది. సంస్థలన్నీ

మిగతా 14వ పేజీలో...

డిసెంబరుకల్లా తేల్చేద్దాం

జిల్లాల సమస్యలపై జిల్లాలకే.. పర్యటనకు ఉపసంఘం నిర్ణయం

ఈ నెల 29, 30 తేదీల్లో కలెక్టర్లతో భేటీ.. ప్రజలు, ప్రజాప్రతినిధులతో కూడా

జిల్లాలు, డివిజన్లు, మండలాల సరిహద్దులపై సెప్టెంబరు 2 వరకు వినతుల స్వీకరణ

గిరిజన ప్రాంతాల సమస్యలపై ప్రత్యేక దృష్టి.. ఉపసంఘం ఏర్పాటైన నాటి నుంచి భారీగా వినతులు.. ప్రతి సూచననూ పరిశీలిస్తాం: రెవెన్యూ మంత్రి అనగాని



జిల్లాల పునర్విభజనపై చర్చిస్తున్న మంత్రి వర్గ ఉపసంఘం సభ్యులు సత్యకుమార్, నారాయణ, మనోహర్, అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్దన్‌రెడ్డి, అనిత

అమరావతి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాల విభజనలో గత ప్రభుత్వం సృష్టించిన సమస్యలను డిసెంబరుకల్లా పరిష్కరించాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. జిల్లాలు, డివిజన్లు, మండలాల సరిహద్దులు, ప్రధాన కేంద్రాలపై ప్రజల నుంచి సెప్టెంబరు 2 వరకు వినతులు స్వీకరించాలని, గిరిజన ప్రాంతాల సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించాలని నిశ్చయించింది. జిల్లాల్లో పర్యటించనుంది. బుధవారం సచివాలయంలో

మిగతా 3వ పేజీలో...

అర్ధరాత్రి వరకూ బార్లు

ఉదయం 10 నుంచి రాత్రి 12 వరకూ.. ఉదయం, రాత్రి గంట చొప్పున పెంపు

నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ.. గీత కులాలకు 84 బార్లు

బార్లకు రూ.99 మద్యం లేదు.. బార్ పాలసీ విడుదల చేసిన ఎక్సైజ్

3

ఢిల్లీ వీధి కుక్కల కేసు త్రిసభ్య బెంచ్‌కి



న్యూఢిల్లీ, ఆగస్టు 13: ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లోని వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలంటూ ఇచ్చిన ఆదేశాలను సుప్రీంకోర్టు పునఃసమీక్షించనుంది. ఆ కేసును త్రిసభ్య ధర్మాసనానికి బదిలీ చేశారు. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్‌వీ అంజరియాల ధర్మాసనం గురువారం దీన్ని విచారించనుంది. ఢిల్లీలోని వీధి కుక్కల బెడదపై సుమోటో కేసు తీసుకున్న జస్టిస్ జేబీ పార్థివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ద్విసభ్య బెంచ్.. వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలంటూ ఈ నెల 11న ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. దీనిపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ కేసు విషయం బుధవారం భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్ ముందర రెండు సార్లు ప్రస్తావనకు కూడా వచ్చింది. వీధి కుక్కల సమస్యపై వచ్చిన అన్ని పిటిషన్లను గతేడాది మేలోనే జస్టిస్ జేకే మహేశ్వరి నేతృత్వంలోని ధర్మాసనం సంబంధిత హైకోర్టులకు బదిలీ చేసిందని ఓ న్యాయవాది తెలిపారు. తాజా ఉత్తర్వులు అందుకు విరుద్ధమన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను అప్‌లోడ్ చేయకముందే వీధి కుక్కలను తరలించడం ప్రారంభించారని మరో న్యాయవాది చెప్పారు. దీనిపై సీజేఐ స్పందిస్తూ.. 'ఆ విషయాన్ని పరిశీలిస్తాను' అని పేర్కొన్నారు. అనంతరం ఆ కేసును త్రిసభ్య ధర్మాసనానికి బదిలీ చేశారు.


పాత ఈ-మెయిల్స్ డిలీట్ చేసి నీటిని పొదుపు చెయ్యండి

కరువు నేపథ్యంలో యూకే ప్రజలకు అధికారుల పిలుపు



బ్రిటన్, ఆగస్టు 13 : పాత ఈ-మెయిల్‌లు, ఫొటోలు డిలీట్ చేసి నీటిని పొదుపు చెయ్యండి.. బ్రిటన్ పౌరులకు ఆ దేశ అధికారులు ఇచ్చిన పిలుపు ఇది. ఈ-మెయిల్‌లు, ఫొటోలకు నీళ్లకు ఏం సంబంధం అని ఆలోచిస్తున్నారా ?. సాధారణంగా ఈ-మెయిల్‌లు, ఫొటోలు, వీడియోలన్నీ ఉండే క్లౌడ్ స్టోరేజీలను పెద్ద పెద్ద డేటా సెంటర్లు నిర్వహిస్తుంటాయి. పెద్ద ఎత్తున విద్యుత్‌ను వినియోగించుకునే ఈ డేటా సెంటర్లలోని పరికరాలు వెలువరిచే ఉష్ణోగ్రతను నియంత్రించి వాటిని చల్లబరిచేందుకు భారీ ఎత్తున నీటి వనరులు అవసరం అవుతాయి. అయితే, నీటి కొరతతో ఇప్పటికే తీవ్రమైన కరువు ఎదుర్కొంటున్న బ్రిటన్.. నీటి నిల్వల పొదుపుపై దృష్టి సారించింది. బ్రిటన్ పర్యావరణ విభాగం సూచనల మేరకు డేటా సెంటర్లలో నీటి వినియోగంపై దృష్టి పెట్టింది. డేటా సెంటర్లపై ఒత్తిడి తగ్గిస్తే పెద్ద ఎత్తున నీటి నిల్వలు మిగులుతాయనే ఆలోచనతో.. క్లౌడ్‌లో ఉన్న పాత ఈ-మెయిల్‌లు, ఫొటోలను డిలీట్ చేయాలని ప్రజలకు పిలుపునిచ్చింది. ఇదేకాక, నీటి పొదుపు కోసం స్నానం చేసే సమయాన్ని తగ్గించుకోవడం వంటి మరిన్ని సూచనలు కూడా చేసింది.

లోకం తీరు



నదులకు 100 మీటర్ల వరకు

నో డెవలప్‌మెంట్ జోన్

» మూడు జోన్లుగా నదీతీరాలు..కేంద్రం మార్గదర్శకాలు

» రక్షిత, నియంత్రిత, హెచ్చరిక జోన్లుగా ఏర్పాటు

న్యూఢిల్లీ, ఆగస్టు 13: వరద ప్రవాహ ప్రాంతాల జోనింగ్‌ను కేంద్ర ప్రభుత్వం మూడుగా విభజించింది. అవి.. రక్షిత(ప్రొటెక్టెడ్), నియంత్రిత(రెగ్యులేటరీ), హెచ్చరిక(వార్నింగ్) జోన్‌లు. ప్రవహించే నదుల నుంచి 100 మీటర్ల వరకు 'నో డెవలప్‌మెంట్ జోన్'గా ప్రకటించింది. అంతేకాదు.. 500 మీటర్ల దూరం వరకు నిషేధాజ్ఞలు అమలవుతాయి. ఈ మేరకు కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ 'ఫ్లడ్ ప్లెయిన్ జోనింగ్' పేరుతో వరద ప్రవాహ ప్రాంతాల్లో సాంకేతిక మార్గదర్శకాలను విడుదల చేసింది. గత ఏడాది బడ్జెట్‌లో ప్రకటించిన వరద ప్రవాహ మ్యాపింగ్ పూర్తయ్యే వరకు ఈ మార్గదర్శకాలు అమలవుతాయి. ఈ మార్గదర్శకాలను కేంద్రం గత నెల సూత్రప్రాయంగా ఆమోదించగా.. తాజాగా వాటి వివరాలను రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు పంపింది. ఉపగ్రహ డాటా, హైడ్రాలజికల్ మోడలింగ్, వాతావరణ మార్పులు, ప్రవాహ ప్రాంతాల మ్యాపింగ్ పూర్తిచేయాలని, భూ వినియోగ ప్రణాళికను రెవెన్యూ రికార్డుల్లో పొందుపర్చాలని సూచించింది. పైన పేర్కొన్న మూడు జోన్లతోపాటు.. సున్నిత ప్రాంతాల్లో కార్యకలాపాల నిషేధం, పర్యావరణ పరిరక్షణకు ఏకరీతి ప్రమాణాల ఏర్పాటు వంటి అంశాలున్నాయి. నదీతీరాల నుంచి 500 మీటర్ల దూరం వరకు ల్యాండ్‌ఫిల్ సైట్లు, మునిసిపల్, పరిశ్రమల వ్యర్థాల పారవేతపై నిషేధం ఉంటుంది.

- ప్రతి ఐదేళ్లకు ఒకసారి వరదలు పునరావృతమయ్యే ప్రాంతాన్ని కేంద్రం ప్రొటెక్టెడ్ జోన్‌గా ప్రకటించింది. తాజా మార్గదర్శకాల ప్రకారం ఈ జోన్‌లో శాశ్వత నిర్మాణాలు, వ్యర్థాలను పారవేయడం, ప్రమాదకర పదార్థాల నిల్వ నిషేధం.
- ప్రతి ఐదేళ్లకోసారి.. అదేవిధంగా పాతికేళ్లకు ఒకసారి వరదలు వచ్చే ప్రాంతాన్ని రెగ్యులేటరీ జోన్‌గా ప్రకటించారు. ఈ జోన్‌లో కార్యకలాపాలను కఠినంగా నియంత్రిస్తారు.
- ప్రతి పాతికేళ్లకు ఒకసారి.. అదేవిధంగా ప్రతి 100 ఏళ్లకు ఒకసారి వరదలు వచ్చే ప్రాంతాన్ని వార్నింగ్ జోన్‌గా కేంద్రం మార్గదర్శకాలు పేర్కొంటున్నాయి. ఇక్కడ తక్కువ ప్రమాదకర కార్యకలాపాలకు అనుమతి ఉన్నా.. ముప్పు అంచనాకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటారు.

'డ్రాప్‌బాక్స్' వీసా రెన్యువల్‌కు అమెరికా స్వస్తి

న్యూఢిల్లీ, ఆగస్టు 13: ఇంటర్వ్యూ లేకుండా వీసా రెన్యువల్స్ కోసం తీసుకొచ్చిన 'డ్రాప్‌బాక్స్' సదుపాయానికి అమెరికా స్వస్తి చెప్పింది. వీసా దరఖాస్తుదారులు వ్యక్తిగతంగా ఇంటర్వ్యూలకు హాజరవ్వాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. వర్క్, స్టూడెంట్ కేటగిరీలతో పాటు నాన్ ఇమ్మిగ్రెంట్ వీసాల కోసం ప్రస్తుతం డ్రాప్‌బాక్స్ సదుపాయం అందుబాటులో ఉంది. క్లీన్ వీసా హిస్టరీ ఉన్నా కూడా ఇకపై చాలా కేటగిరీల్లోని వీసా దరఖాస్తుదారులు వ్యక్తిగతంగా ఇంటర్వ్యూకు హాజరవ్వాల్సి ఉంటుంది. ఈ కొత్త మార్పు వచ్చే నెల 2 నుంచి అమల్లోకి రానుంది. ఈ డ్రాప్‌బాక్స్‌ను ఎక్కువగా వినియోగించుకుంటున్న భారతీయులపై ఈ నిర్ణయం తీవ్ర ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇకపై కేవలం దౌత్య, అధికారిక వీసాలైన ఏ, జీ, నాటో, టెక్రో వీసాలకు మాత్రమే డ్రాప్‌బాక్స్ సదుపాయం అందుబాటులో ఉంటుంది. కఠినమైన రూల్స్‌తో కొద్ది సంఖ్యలో బీ1, బీ2 పర్యాటక, బిజినెస్ వీసాల రెన్యువల్‌కు డ్రాప్‌బాక్స్‌ను కొనసాగిస్తారు.



గవర్నర్ సమక్షంలోనే వీసీ నుంచి పట్టా అందుకుంటున్న జీన్ రాజన్

గవర్నర్ ఆర్‌ఎన్ రవి.. తమిళనాడు వ్యతిరేకి

» ఆయన నుంచి డిగ్రీ పట్టా స్వీకరణకు ఓ విద్యార్థిని విముఖత

చెన్నై, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా, ప్రజలు ఎన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇరుకునబెట్టేలా వ్యవహరిస్తున్నారంటూ తమిళనాడులో ఓ విద్యార్థిని గవర్నర్ నుంచి డిగ్రీ స్వీకరించేందుకు నిరాకరించింది. పక్కనే ఉన్న యూనివర్సిటీ వీసీ చంద్రశేఖర్ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకుంది. తిరునల్వేలిలో బుధవారం జరిగిన మనోన్మణియం సుందరనార్ విశ్వవిద్యాలయం 32వ స్నాతకోత్సవానికి చాన్స్‌లర్ హోదాలో హాజరైన గవర్నర్ ఆర్‌ఎన్ రవి విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేస్తుండగా, విద్యార్థులు వరుసగా సర్టిఫికెట్లు అందుకుంటున్నారు. ఈ క్రమంలో నాగర్‌కోయిల్‌కు చెందిన ఎంబీఏ విద్యార్థిని జీన్ రాజన్ మాత్రం గవర్నర్ నుంచి కాకుండా వీసీ నుంచి సర్టిఫికెట్ స్వీకరించింది. జీన్ రాజన్ తరువాత విలేకరులతో మాట్లాడుతూ.. గవర్నర్ ఆర్‌ఎన్ రవి తమిళనాడుకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని ఆరోపించింది. ఈ వ్యవహారంపై అధికార డీఎంకే స్పందించింది. గవర్నర్ తీరు పట్ల ప్రజలు ఎంత ఆగ్రహంతో ఉన్నారో తెలుసుకోవాలని సూచించింది.

కనీస నిల్వపై ఐసీఐసీఐ బ్యాంక్ యూటర్న్

» రూ.50 వేలు ఉండాలన్న నిబంధనపై వెనక్కి

న్యూఢిల్లీ, ఆగస్టు 13: పొదుపు ఖాతాల్లో కనీస నిల్వ రూ.50 వేలు ఉండాలన్న నిబంధనపై ఐసీఐసీఐ బ్యాంక్ యూటర్న్ తీసుకుంది. వినియోగదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో కనీస నిల్వ మొత్తాలను సవరిస్తూ నిర్ణయం తీసుకుంది. అర్బన్ ప్రాంతాల్లో కనీస నిల్వ రూ.15 వేలు, సెమీ అర్బన్ ప్రాంతాల్లో రూ.7,500 ఉంటే చాలని తెలిపింది. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో మినిమమ్ బ్యాలెన్స్ గతంలో మాదిరిగా 2,500 ఉంటే చాలని స్పష్టం చేసింది. పొదుపు ఖాతాల్లో మినిమమ్ బ్యాలెన్స్ లేకపోతే అపరాధ రుసుం విధించే నిబంధనను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహా పలు ప్రభుత్వ రంగ బ్యాంకులు గతంలోనే తొలగించాయి. కనీస నిల్వ రూ.50 వేలు ఉండాలంటూ ఈనెల 9న ఐసీఐసీఐ బ్యాంక్ చేసిన ప్రకటన కలకలం రేపడంతో పాటు విమర్శలకు తావిచ్చింది.

అమెరికా అప్పులు రూ.3.25 కోట్ల కోట్లు!

వాషింగ్టన్, ఆగస్టు 13: అమెరికా రోజురోజుకూ అప్పుల ఊబిలో కూరుకుపోతోంది. అంచనాలకు మించి భారీగా రుణభారం పెరిగిపోతోంది. మొత్తం అప్పులు 37 ట్రిలియన్ డాలర్ల(రూ.3.25 కోట్ల కోట్లు)కు చేరాయి. అమెరికా ఆర్థిక శాఖ తాజాగా విడుదల చేసిన నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. అమెరికా రుణ భారం 2030 నాటికి 37 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని 2020లో అంచనా వేశారు. కానీ, రుణ భారం చాలా వేగంగా పెరిగింది. ఈ ఏడాదే 37 ట్రిలియన్ డాలర్లకు చేరింది. కరోనా సమయంలో అమెరికా ఆర్థిక వ్యవస్థను కాపాడేందుకు భారీగా రుణాలు సేకరించారు. మాజీ అధ్యక్షుడు జో బైడెన్, ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌లు పెద్ద మొత్తంలో అప్పులు చేశారు. రాబోయే దశాబ్ద కాలంలో మరో 4.1 ట్రిలియన్ డాలర్లు రుణాలుగా సేకరించేందుకు అవకాశం కల్పించే బిల్లుకు ఇటీవల ట్రంప్ ఆమోదముద్ర వేశారు.

ట్రంప్ సుంకాలతో నష్టం..

రూ.7 లక్షల కోట్లు!

దుస్తులు, పాదరక్షలు, ముత్యాలు, ఆభరణాల ఎగుమతులపై తీవ్ర ప్రభావం

» చైనా ఉత్పత్తులు వరదలా వచ్చి పడే పరిస్థితి

» కొత్త మార్కెట్ల అన్వేషణే దీనికి పరిష్కారం

» ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు



న్యూఢిల్లీ, ఆగస్టు 13: అమెరికా సుంకాలు ఓవైపు, భారత మార్కెట్లలోకి వరదలా వచ్చి పడే చైనా ఉత్పత్తులు మరోవైపు.. ఈ రెండింటి ప్రభావంతో భారత్ భారీగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు హెచ్చరించారు. భారతీయ దిగుమతులపై ట్రంప్ తాజాగా విధించిన 50% సుంకాల ప్రభావం దుస్తులు, పాదరక్షలు, ముత్యాలు, ఆభరణాలు వంటి పరిశ్రమల ఎగుమతులపై తీవ్రంగా ఉండవచ్చని, ఫలితంగా దాదాపు రూ.7 లక్షల కోట్ల మేర (జీడీపీలో 2%) నష్టం వాటిల్లవచ్చని అంచనా వేశారు. 'లాభాలు తగ్గుతాయి. కొనుగోళ్లు మందగిస్తాయి. ఉద్యోగాలు పోతాయి. పరిశ్రమలు పూర్తిస్థాయిలో పని చేయక పోవచ్చు' అని పేర్కొన్నారు. మరోవైపు, అమెరికా సుంకాలతో ఆ దేశంలో మార్కెట్ వాటాను కోల్పోయే చైనా.. నష్టాన్ని పూడ్చుకోవటానికి తమ ఉత్పత్తులను భారత్‌కు పెద్ద ఎత్తున తరలించే అవకాశం ఉందన్నారు. ఒక ఇంగ్లిష్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సుబ్బారావు.. దేశ ఆర్థికవ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి మాట్లాడారు. ట్రంప్ సుంకాలతో జరిగే నష్టాన్ని తగ్గించుకోవటానికి.. ఇతర మార్కెట్లకు ఉత్పత్తులను ఎగుమతి చేయటం, ధరలపై కొత్తగా సంప్రదింపులు జరపటం వంటి చర్యలు చేపట్టాలని భారతీయ ఎగుమతిదారులకు ఆయన సూచించారు. ఈ విధంగా కొత్తగా ఎదురైన సవాళ్లను అవకాశంగా మల్చుకోవాలని పిలుపునిచ్చారు. వ్యవసాయం, పాడిపరిశ్రమ రంగాల్లోకి అమెరికాతోపాటు ఏ దేశానికీ పూర్తిగా ద్వారాలు తెరవకూడదని, ఇది గ్రామీణప్రాంతాల్లో ఉపాధికి, ఆహారభద్రతకు సంబంధించిన కీలకమైన విషయమని సుబ్బారావు తెలిపారు. వాణిజ్య సంబంధాల కోసం అవసరమైతే.. ఉభయ ప్రయోజనకారిగా ఉండేలా, ఏవైనా కొన్ని ఉత్పత్తుల్లో పరిమితంగానే విదేశీ పెట్టుబడులను అనుమతించాలన్నారు. 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థగా ఎదగాలన్న భారత్ లక్ష్యం ముందు మూడు అడ్డంకులు ఉన్నాయని సుబ్బారావు పేర్కొన్నారు. అవి 1. విద్య, వైద్యరంగాల్లో తగినన్ని పెట్టుబడులు పెట్టకపోవటం 2. సంస్కరణల్లో మందగమనం, నైపుణ్యలేమి, అసమగ్ర సరఫరా చెయిన్లు 3. పెరుగుతున్న ఆర్థిక అంతరాలు, తగ్గుతున్న డిమాండ్ అని వివరించారు.

వచ్చే నెలలో ట్రంప్-మోదీ ముఖాముఖీ?

ట్రంప్ సుంకాల బాదుడుతో అమెరికాతో వాణిజ్య సంబంధాల విషయంలో ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ప్రధాని మోదీ సెప్టెంబరులో న్యూయార్క్‌లో పర్యటించే అవకాశం ఉంది. న్యూయార్క్ వేదికగా సెప్టెంబరులో జరిగే ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ(యూఎన్‌జీఏ) వార్షిక ఉన్నతస్థాయి సదస్సులో మోదీ పాల్గొని, ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా ట్రంప్‌తో మోదీ ముఖాముఖీ అయ్యే అవకాశం కూడా ఉంది. మరోవైపు, భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ఈ నెల 20, 21 తేదీల్లో రష్యాలో పర్యటించనున్నారు. ఆ దేశ విదేశాంగ మంత్రి సెర్గి లావ్రోవ్‌తో జైశంకర్ చర్చలు జరుపుతారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు ఆపాలంటూ భారత వస్తువులపై అమెరికా 50% సుంకాలు విధించిన ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఇదిలా ఉండగా, భారత్-అమెరికా సంయుక్తంగా సెప్టెంబరు 1 నుంచి 14వ తేదీ వరకు సైనిక విన్యాసాలను నిర్వహించనున్నాయి. సుమారు 400 మంది వరకు ఇండియన్ ఆర్మీ సిబ్బంది ఈ విన్యాసాల్లో పాల్గొననున్నారు. యుద్ధ అభ్యాస్ పేరిట అమెరికాలోని అలస్కాలో ఈ విన్యాసాలు జరుగనున్నాయి. 2004 నుంచి ఏటా ఈ విన్యాసాలను నిర్వహిస్తున్నారు.

ఎఫ్-16ల గురించి

పాక్‌నే అడగండి

న్యూఢిల్లీ/వాషింగ్టన్, ఆగస్టు 13: "భారత్-పాక్ ఉద్రిక్తతల సమయంలో కనీసం ఆరు ఫైటర్ జెట్లు కూలిపోయినట్లు మాకు సమాచారం ఉంది" అని ట్రంప్ గతంలో ప్రకటించారు. "ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్‌కు చెందిన ఐదు ఫైటర్ జెట్‌లు, ఒక పెద్ద విమానాన్ని కూల్చేసాం" అని భారత ఎయిర్ ఫోర్స్ చీఫ్ ఏపీ సింగ్ ఇటీవల వెల్లడించారు. ఈ నేపథ్యంలో.. ట్రంప్ ప్రకటనపై స్పష్టత కోసం ఎన్డీటీవీ అమెరికా స్వేచ్ఛ సమాచార హక్కు చట్టం(ఎఫ్‌వోఐఏ) కింద దరఖాస్తు చేసింది. అయితే, అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ దీనికి సమాధానం ఇవ్వడానికి విముఖత వ్యక్తం చేసింది. పాకిస్థాన్ వాయుసేన వాడే ఎఫ్-16 ఫైటర్ జెట్ల గురించి సమాధానం ఇవ్వబోమని స్పష్టం చేసింది. ఆ వివరాలను పాకిస్థాన్‌నే అడగాలను సూచించింది. అయితే.. 2019 బాలాకోట్ ఉదంతం తర్వాత కూడా పాకిస్థాన్‌కు చెందిన ఎఫ్-16 యుద్ధ విమానం ఒకటి కూలిపోయిందని వార్తలు రావడంతో అమెరికా వెంటనే స్పందించి.. "అలాంటిదేమి లేదు" అని సమాధానమివ్వడం తెలిసిందే..!

యుద్ధం ఆపకుంటే.. తీవ్ర పరిణామాలు తప్పవు

» రష్యాకు ట్రంప్ హెచ్చరిక



వాషింగ్టన్, ఆగస్టు 13: ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ఆపకపోతే రష్యా తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఉక్రెయిన్ యుద్ధం, పుతిన్‌తో శుక్రవారం జరగనున్న భేటీ నేపథ్యంలో.. బుధవారం యూరోపియన్ దేశాల నేతలు, జెలెన్‌స్కీతో ట్రంప్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చలు జరిపారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. పుతిన్‌తో మీ భేటీ తర్వాత కూడా ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ఆపేందుకు అంగీకరించకపోతే రష్యాపై ఏమైనా చర్యలు తీసుకుంటారా? అని ప్రశ్నించగా.. "అవును. ఈ విషయం నేను చెప్పకూడదు. కానీ రష్యా చాలా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని ట్రంప్ పేర్కొన్నారు. ఒకవేళ పుతిన్‌తో తన సమావేశం సఫలమైతే.. వెంటనే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని కూడా కలుపుకొని మరో సమావేశం నిర్వహిస్తానని చెప్పారు. అదీ వాళ్లిద్దరి మధ్య తాను ఉండాలని వారు కోరుకుంటే ఉంటానని వ్యాఖ్యానించారు. అంతకుముందు వీడియో కాన్ఫరెన్స్‌లో జెలెన్‌స్కీ మాట్లాడుతూ.. "ఉక్రెయిన్ మొత్తాన్ని రష్యా ఆక్రమించగలదన్నట్టుగా పుతిన్ బుకాయిస్తున్నారు. ట్రంప్‌తో భేటీకానున్న నేపథ్యంలో ఉక్రెయిన్‌కు మద్దతుగా ఉన్న వారందరి మీదా ముందుగానే ఒత్తిడి పెంచే ప్రయత్నం చేస్తున్నారు. అమెరికా, యూరప్ దేశాలు విధించిన ఆంక్షలు రష్యాపై పెద్దగా ప్రభావం చూపడం లేదన్నట్టుగా పుతిన్ వ్యవహరిస్తున్నారు. కానీ ఆంక్షలతో రష్యా ఆర్థిక వ్యవస్థకు గట్టి దెబ్బ తగిలింది" అని పేర్కొన్నారు.

ఓటర్ల జాబితాను సవరించకపోతే ఎలా: సుప్రీం

న్యూఢిల్లీ, ఆగస్టు 13: ఓటర్ల జాబితాను మార్చకుండా స్థిరంగా ఉంచడానికి వీలుపడదని, ఎప్పటికప్పుడు సవరించాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. లేకపోతే చనిపోయినవారి పేర్లను, వలసదారులు, ఇతర నియోజకవర్గాలకు వెళ్లిన వారి పేర్లను ఎన్నికల కమిషన్ ఎలా తొలగించగలుగుతుందని ప్రశ్నించింది. బిహార్లో ఓటర్ల జాబితాల సవరణ(ఎస్ఐఆర్) ఓటర్లకు అనుకూలంగా, ప్రయోజనకరంగా ఉందని వ్యాఖ్యానించింది. నివాస గుర్తింపు కోసం ఆధార్ కార్డును మినహాయించి.. 11 గుర్తింపు కార్డులు చూపించేందుకు ఈసీ వెసులుబాటు కల్పించడంపై హర్షం వ్యక్తంచేసింది. గతంలో ఏడు డాక్యుమెంట్లనే సూచించిందని గుర్తుచేసింది. బిహార్లో ప్రత్యేక సవరణ.. చట్టానికి లోబడి లేదని, దానిని కొట్టివేయాలన్న వినతితో విభేదించింది. ఆ రాష్ట్రంలో ఎస్ఐఆర్ చేపట్టడాన్ని సవాల్ చేస్తూ ఏడీఆర్, ఆర్జేడీ, కాంగ్రెస్ దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం విచారణ కొనసాగించింది. ఓటర్ల జాబితాను సవరించే విచక్షణాధికారాన్ని రాజ్యాంగంలోని 324వ అధికరణ ఎన్నికల కమిషన్‌కు కట్టబెట్టిందని తెలిపింది. "బిహార్‌లో ఈసీ 'విస్తృత' అనే పదాన్ని మాత్రమే అదనంగా చేర్చింది' అని జస్టిస్ బాగ్చీ చెప్పారు. ప్రస్తుత వ్యవహారం రాజ్యాంగ హక్కు, రాజ్యాంగ అధికారానికి మధ్య పోరాటమని అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా, బెంగాల్లో ఎస్ఐఆర్ చేపట్టడంపై ప్రస్తుతం విచారణ జరపబోమని.. ఆ తర్వాత చేపడతామని ధర్మాసనం స్పష్టంచేసింది. 2026 వరకు సమయం ఉందని, ఇప్పుడు అక్కడ ఏమీ జరుగబోవడం లేదని తెలిపింది. బెంగాల్ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్, టీఎంసీ ఎంపీ-న్యాయవాది అయిన కల్యాణ్ బెనర్జీ ఈ అంశాన్ని లేవనెత్తినపుడు ఈ వ్యాఖ్యలు చేసింది.

'ఓటు'పై ఇక పోరుబాటే

'ఓటు చోరీ' ఆందోళనలు మరింత ఉధృతం

» నేడు ప్రతి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ర్యాలీలు



బుధవారం రాహుల్‌ను కలిసిన ఈ ఏడుగురి పేర్లను ఎన్నికల సంఘం బిహార్ ఓటర్ల జాబితా నుంచి తొలగించింది. వారు చనిపోయినందువల్లే పేర్లను డిలీట్ చేసినట్లు ప్రకటించింది.

న్యూఢిల్లీ, ఆగస్టు 13 : 'ఓటు చోరీ' ఆందోళనను కాంగ్రెస్ పార్టీ దాని మిత్రపక్షాలతో కలిసి దేశవ్యాప్తంగా మరింత ఉధృతం చేసేందుకు సిద్ధమవుతోంది. దొంగ ఓట్లను ఈసీ అనుమతిస్తుందంటూ ఒక నిమిషం నిడివి గల వీడియోను బుధవారం కాంగ్రెస్ పార్టీ విడుదల చేసింది. ఆ వీడియోలో ఓ భార్యభర్త ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రానికి వస్తారు. ఓ ఇద్దరు వ్యక్తులు అక్కడ వారికి ఎదురుబడి 'మీ ఓట్లు మేం వేసేశాం.. వెళ్లండి.. వెళ్లండి..' అంటూ వారిని పంపించివేస్తారు. వారి వెనుక పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఎన్నికల అధికారి టేబుల్‌పై 'ఎలక్షన్ చోరీ ఆయోగ్' అని రాసి ఉంటుంది. ఈ వీడియోను రాహుల్, ఖర్గే, ప్రియాంక షేర్ చేశారు. "మన ఓటును కొల్లగొట్టడం అంటే.. మన అధికారాన్ని కొల్లగొట్టడం.. మన అస్థిత్వాన్ని కొల్లగొట్టడమే..'నని ఈ సందర్భంగా రాహుల్, ప్రియాంక అన్నారు. దేశంలోని ప్రతి ఒక్కరూ 'ఓటు చోరీ'కి వ్యతిరేకంగా గళం విప్పాలని ఖర్గే 'ఎక్స్'లో పిలుపునిచ్చారు. మరోవైపు, ఈ ఏడాది చివర్లో ఎన్నికలు జరిగే బిహార్‌లో ఈనెల 17న 'ఓట్ అధికార్' పేరిట ఇండియా కూటమి పార్టీలు నిరసన ప్రదర్శన జరపనున్నాయి. కాగా, 'ఓటు చోరీ'పై పెద్ద ఎత్తున ప్రచార, అవగాహన, ఉద్యమ కార్యక్రమాలకు కాంగ్రెస్ పార్టీ రూపకల్పన చేసింది. ఖర్గే, రాహుల్ గాంధీ నేతృత్వంలో జరిగిన ఏఐసీసీ ముఖ్యుల భేటీలో దీనిపై నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 14వ తేదీన ప్రతి జిల్లా కేంద్రంలో 'ప్రజాస్వామ్య పరిరక్షణ ఆందోళనా యాత్ర', ఈ నెల 22 నుంచి సెప్టెంబరు 7వరకు ప్రతి రాష్ట్ర రాజధానిలో 'ఓటు దొంగలారా.. గద్దె దిగండి' పేరిట ప్రదర్శనలు, సెప్టెంబరు 15 నుంచి అక్టోబరు 15 వరకు సంతకాల సేకరణ చేపట్టాలని నిర్ణయించారు.

దొంగే.. దొంగ అన్నట్లుగా!

కాంగ్రెస్ వైఖరి 'దొంగే.. దొంగా అని అరచినట్లుగా' ఉందని బీజేపీ ధ్వజమెత్తింది. కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్(రాయ్‌బరేలీ), ప్రియాంక(వయనాడ్), సమాజ్‌వాదీ అధినేత అఖిలేశ్ యాదవ్ (కనౌజ్), టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ (డైమండ్ హార్బర్) నియోజకవర్గాల్లో సైతం ఓటర్ల నమోదులో పెద్దఎత్తున అవకతవకలు జరిగాయంటూ ఎదురుదాడికి దిగింది. అంతేగాక కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ భారతీయ పౌరసత్వం పొందకముందే ఆమె ఓటు సాధించారని బీజేపీ నేత అనురాగ్ ఠాకూర్ విమర్శించారు. బంగ్లాదేశీ, ఇతర చొరబాటుదారులను ఓటుబ్యాంకుగా చేసుకున్నారని.. దానిని కాపాడుకోవడానికే ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్)పై గగ్గోలు పెడుతున్నారని అన్నారు. ఇటలీలో జన్మించిన సోనియాగాంధీ పేరు 1980లో తొలిసారి ఓటర్ల జాబితాలో నమోదైందని.. కానీ అప్పటికి ఆమె భారతీయురాలు కాదని.. 1983లో ఆమెకు భారతీయ పౌరసత్వం లభించిందని ఠాకూర్ తెలిపారు. 'ప్రజల నుంచి పెద్దఎత్తున విమర్శలు రావడంతో 1982లో ఆమె పేరు తొలగించారు. తిరిగి 1983లో ఓటర్ల జాబితాలో నమోదుచేశారు. అప్పుడు కూడా తప్పుడు నమోదు జరిగింది. ఆ ఏడాది జనవరి 1లోపు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా.. ఏప్రిల్ 30న ఆమెకు భారతీయ పౌరసత్వం లభించింది. ఆమె ఓటు నమోదు అత్యంత ఎన్నికల అక్రమమా కాదా' అని ప్రశ్నించారు.

రాహుల్‌తో టీ తాగిన 'మృత ఓటర్లు'!

న్యూఢిల్లీ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): 'నాకు జీవితంలో ఎన్నో ఆసక్తికర అనుభవాలు ఉన్నాయి. కానీ.. ఎప్పుడూ 'మరణించినవారి'తో కలిసి టీ తాగలేదు. ఇప్పుడు ఈ ప్రత్యేక అనుభవానికి కారణమైన ఎన్నికల కమిషన్‌కు కృతజ్ఞతలు' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ చనిపోయారని ప్రకటించి ఓటర్ల జాబితా నుంచి తొలగించిన ఏడుగురు వ్యక్తులతో కలిసి టీ తాగుతూ ముచ్చటించిన వీడియోను రాహుల్ 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. తాము ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ రాఘోపూర్ నియోజకవర్గానికి చెందినవారమని వారు రాహుల్‌కు తెలిపారు. తమలాంటి ఓటర్లు ఇంకా చాలామంది ఉన్నారని చెప్పారు. ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 65లక్షల పేర్ల ముసాయిదా జాబితాను చూసి అవాక్కయ్యామని, తాము చనిపోయామంటూ పేర్లు తీసేసినట్లు గుర్తించామని తెలిపారు.

క్రోమ్‌ను అమ్మేయండి.. కొంటాం!

» గూగుల్‌కు పర్‌ప్లెక్సిటీ ఏఐ సంస్థ ఆఫర్

» భారత సంతతికి చెందిన అరవింద్ శ్రీనివాస్ స్థాపించిన కంపెనీ పర్‌ప్లెక్సిటీ

» మూడేళ్లలోనే రూ.1.57 లక్షల కోట్ల విలువైన కంపెనీగా ఎదుగుదల

» ఇప్పుడు క్రోమ్‌ను రూ.3లక్షల కోట్లతో కొంటామని ప్రతిపాదన

న్యూయార్క్, ఆగస్టు 13: ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నెట్ వినియోగాన్ని ఏలుతున్న క్రోమ్ బ్రౌజర్‌ను తమకు అమ్మేయాలని గూగుల్‌కు పర్‌ప్లెక్సిటీ కృత్రిమ మేధ సంస్థ ప్రతిపాదన చేసింది. భారత సంతతికి చెందిన అరవింద్ శ్రీనివాస్ స్థాపించిన పర్‌ప్లెక్సిటీ విలువ సుమారు రూ.1.57 లక్షల కోట్లు (18 బిలియన్ డాలర్లు)కాగా.. క్రోమ్‌ను రూ.3 లక్షల కోట్ల (34.5 బిలియన్ డాలర్లు)కు కొంటామని ఆఫర్ చేసింది. ప్రపంచంలోని పెద్ద ఆర్థిక, పెట్టుబడి సంస్థలు ఈ మేరకు తమకు నిధులు సమకూర్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేశాయని పర్‌ప్లెక్సిటీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ దిమిత్రి షెవెలెంకో వెల్లడించారు. అక్రమ పద్ధతుల్లో సెర్చింజన్ మార్కెట్‌పై గూగుల్ ఏకచ్ఛత్రాధిపత్యం సాధించిందని గతంలోనే అమెరికాలోని డిస్ట్రిక్ట్ కోర్టు నిర్ధారించింది. గూగుల్ సంస్థలోని సెర్చింజన్, బ్రౌజర్ ఇతర విభాగాలను వేర్వేరు కంపెనీలుగా విడదీయడంతోపాటు భారీ జరిమానాలు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. తుది తీర్పు ఇంకా వెల్లడించాల్సి ఉంది. అయితే ఈ సమస్యకు పరిష్కారంగా క్రోమ్‌ను పూర్తిగా విక్రయించాలని గూగుల్‌కు అమెరికా న్యాయశాఖ స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే పర్‌ప్లెక్సిటీ ప్రతిపాదన ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ అంశంలో నెలకొన్న తీవ్ర పోటీ నేపథ్యంలో క్రోమ్‌ను కొనుగోలు చేస్తే.. వందల కోట్ల మందికి దగ్గరై, ఒక్కసారిగా ముందుకు దూసుకొచ్చేందుకు పర్‌ప్లెక్సిటీ సంస్థకు అవకాశం చిక్కుతుంది. కృత్రిమ మేధ రంగంలో సంచలనం సృష్టించిన చాట్‌జీపీటీ ఏఐని రూపొందించిన ఓపెన్ ఏఐ సంస్థ కూడా గతంలో క్రోమ్ కొనుగోలు దిశగా ప్రయత్నం చేశాయి.

300 కోట్ల మందికిపైగా క్రోమ్ యూజర్లు..

ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నెట్ బ్రౌజర్లలో క్రోమ్‌దే ఆధిపత్యం. మొత్తంగా 300 కోట్ల మందికిపైనే క్రోమ్‌ను వినియోగిస్తారు. ప్రపంచ ఇంటర్నెట్ వినియోగదారుల్లో ఇది 65 శాతం. వాస్తవంగా చెప్పాలంటే చైనాలో మొత్తంగా ఆ దేశానికి చెందిన బైదు బ్రౌజర్, సెర్చింజన్‌లను వినియోగిస్తారు. అంటే చైనాను మినహాయించి చూస్తే.. ప్రపంచంలో 80 శాతం మంది వరకు క్రోమ్‌ను వాడుతున్నట్టే. ఇక ప్రపంచ సెర్చింజన్ మార్కెట్లో 90శాతాన్ని గుప్పిట పట్టిన గూగుల్ సంస్థకు ఒక రకంగా క్రోమ్ ప్రాణం లాంటిది. వినియోగదారులు సందర్శించే వెబ్‌సైట్లు, వెతికే అంశాలు, వారి ధోరణి, అవసరాలను క్రోమ్ బ్రౌజర్ ట్రాక్ చేస్తుంది. ఈ డేటా ఆధారంగానే వెబ్‌సైట్లలో గూగుల్ ప్రకటనలు (యాడ్స్), సెర్చింజన్‌లో ఫలితాలు కనిపిస్తుంటాయి. గూగుల్ ఆ ప్రకటనల ద్వారా ఏటా సుమారు రూ.26లక్షల కోట్లు (300 బిలియన్ డాలర్లు) ఆర్జిస్తుంది.



అరవింద్ శ్రీనివాస్

మూడేళ్లలోనే

తమిళనాడులోని చెన్నైకి చెందిన అరవింద్ శ్రీనివాస్.. 2017లో మద్రాస్ ఐఐటీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పూర్తిచేశారు. కానీ మెషీన్ లెర్నింగ్, కృత్రిమ మేధ (ఏఐ)పై ఇష్టంతో కంప్యూటర్ సైన్స్ కోర్సులో భాగమైన పైథాన్, ఇతర సాఫ్ట్‌వేర్లపై పట్టు సాధించారు. 2022లో మరో ముగ్గురితో కలసి పర్‌ప్లెక్సిటీ ఏఐ సంస్థను స్థాపించారు. ఈ సంస్థ అభివృద్ధి చేసిన కృత్రిమ మేధ ప్రోగ్రామ్ సంచలనాలు సృష్టించి.. చాట్‌జీపీటీకి పోటీగా నిలిచింది. మూడేళ్లలోనే పర్‌ప్లెక్సిటీ ఏఐ కంపెనీ విలువ రూ.1.57 లక్షల కోట్ల (18 బిలియన్ డాలర్ల)కు చేరింది.

అర్ధరాత్రి వరకూ బార్లు

ఉదయం 10 నుంచి రాత్రి 12 వరకూ
ఉదయం, రాత్రి గంట చొప్పున పెంపు

అమరావతి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): నూతన బార్ పాలసీని ఎక్సైజ్ శాఖ ప్రకటించింది. సెప్టెంబరు 1 నుంచి కొత్త బార్ పాలసీ అమల్లోకి వస్తుందని తెలిపింది. మూడేళ్ల పాటు ఈ పాలసీ అమల్లో ఉంటుందని స్పష్టం చేసింది. బుధవారం రాత్రి ఎక్సైజ్ శాఖ పాలసీ, రూల్స్‌పై వేర్వేరు ఉత్తర్వులు జారీ చేసింది. గత పాలసీలో వేలం విధానంలో బార్లు కేటాయించగా, ఇప్పుడు లాటరీ విధానంలో కేటాయించనుంది. 840 బార్లకు ప్రస్తుతం నోటిఫికేషన్ జారీ చేస్తుంది. గీత కులాల వారికి మరో 10 శాతం అంటే.. 84 బార్లకు తర్వాత విడిగా నోటిఫికేషన్ ఇస్తుంది. దీంతో రాష్ట్రంలో కొత్తగా 84 బార్లు పెరగనున్నాయి. అలాగే బార్ల పనివేళలను రెండు గంటలు పెంచింది. ప్రస్తుతం ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటల వరకు బార్లు పనిచేస్తున్నాయి. కొత్త పాలసీలో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకూ పనిచేస్తాయి. అయితే లాటరీ విధానంలో దరఖాస్తుల పరిమితిపై నిబంధన పెట్టింది. ఒక్కో బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ తీస్తారు. ఒక దరఖాస్తుకు రూ.5 లక్షలు నాన్ రిఫండబుల్ ఫీజుగా నిర్ణయించింది. అదనంగా మరో రూ.10 వేలు చెల్లించాలి. లైసెన్స్ ఫీజును మూడు కేటగిరీల్లో నిర్ణయించింది. నగర పంచాయతీలు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, పర్యాటక శాఖ గుర్తించిన పర్యాటక ప్రాంతాల్లో మాత్రమే లైసెన్సీలు బార్లు ఏర్పాటు చేయాలి. 50 వేల వరకు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.35 లక్షలు, 50 వేల నుంచి 5 లక్షల వరకు జనాభా ఉంటే రూ.55 లక్షలు, 5 లక్షల దాటిన చోట్ల రూ.75 లక్షలుగా ఖరారు చేసింది. కాగా గీత కులాలకు కేటాయించే బార్లకు అందులో 50 శాతం మాత్రమే లైసెన్స్ ఫీజుగా ఉంటుంది. ఏటా 10 శాతం ఫీజు పెరుగుతుంది. కూటమి ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన క్వార్టర్ రూ.99 మద్యం బార్లకు ఇవ్వరు. అలాగే



బార్లు ప్రభుత్వం నుంచి మద్యం కొనుగోలు చేసుకునేందుకు అదనంగా ఏఆర్ఈటీ చెల్లించాలి. విమానాశ్రయాల్లోనూ బార్లు ఏర్పాటు చేసుకోవచ్చు. అయితే తిరుపతి విమానాశ్రయం ఇందుకు మినహాయింపు. విమానాశ్రయాల్లో బార్లపై ప్రత్యేకంగా మార్గదర్శకాలు జారీచేస్తారు. బార్లకు దరఖాస్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండు రూపాల్లోనూ స్వీకరిస్తారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ వి. నారాయణనాయక్ కుటుంబానికి రూ.కోటి చెక్కును అందిస్తున్న డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి రూ.కోటి పరిహారం

అమరావతి, ఆగస్టు 13: రోడ్డు ప్రమాదంలో మరణించిన అనంతపురానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ వి.నారాయణ నాయక్ కుటుంబానికి రూ.కోటి డీజీపీ హరీష్ కుమార్ గుప్తా అందజేశారు. అనంతపురం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఈ ఏడాది జనవరి 17న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఫిబ్రవరి 7న నారాయణ నాయక్ మరణించారు. ఈ క్రమంలో విధుల్లో ఉండగా మరణించిన పోలీస్ సిబ్బందికి ఎస్‌బీఐ పోలీస్ శాలరీ ప్యాకేజీ లో భాగంగా రూ.కోటి చెక్కును నారాయణ నాయక్ సతీమణి శాంతిబాయికి డీజీపీ బుధవారం తన కార్యాలయంలో అందజేశారు.

రూటు మార్చిన గంజాయి స్మగ్లర్లు

- రైళ్లలో తనిఖీలు చేసి చెక్ పెడుతున్న పోలీసులు
- 'ఆపరేషన్ ఈగల్' కొనసాగిస్తాం: డీజీపీ

అమరావతి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా గంజాయి నియంత్రణకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక విభాగం(ఈగల్) ఏర్పాటు చేయడంతో స్మగ్లర్లు రూటు మార్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మంత్రుల కమిటీ ఏర్పాటు చేసి అధ్యయనం చేసి 459 మందితో ఈగల్ విభాగాన్ని ఏర్పాటు చేసి ఐజీ ఆకే రవికృష్ణ నేతృత్వంలో గంజాయి కట్టడికి చర్యలు చేపడుతోంది. అయితే ఒడిసా నుంచి తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఇతర ఉత్తరాది రాష్ట్రాలకు మన రాష్ట్రం మీదుగా వెళ్లే రైళ్లలో గంజాయి తరలిస్తున్నారు. దీనిపై దష్టి సారించి గత నెల 3 నుంచి 11 వరకు చేపట్టిన 'ఆపరేషన్ ఈగల్' మంచి ఫలితాలు ఇచ్చిందని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తెలిపారు. మన రాష్ట్రం గుండా వెళ్లే పలు రైళ్లలో తనిఖీలు నిర్వహించి 43 కిలోల గంజాయి, 436 గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకుని పది మందిపై ఎన్‌డీపీఎస్ కేసులు నమోదు చేసి జైలుకు పంపినట్టు చెప్పారు.



టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి కోటి రూపాయల విరాళం అందజేస్తున్న దాత కల్యాణ్ కృష్ణమూర్తి

టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.కోటి విరాళం

తిరుమల, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు బుధవారం రూ.కోటి విరాళంగా అందింది. బెంగుళూరుకు చెందిన కల్యాణ్ కృష్ణమూర్తి అనే భక్తుడు విరాళం చెక్‌ను తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

భోగ శ్రీనివాసమూర్తికి బంగారు లక్ష్మీ పతకం



టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి లక్ష్మీపతకం అందజేస్తున్న కేఎం శ్రీనివాసమూర్తి కుటుంబం

భోగ శ్రీనివాసమూర్తికి అలంకరించేందుకు వజ్రం, వైజయంతి పొదిగిన 148 గ్రాముల బంగారు లక్ష్మీ పతకాన్ని బెంగుళూరుకు చెందిన కేఎం శ్రీనివాసమూర్తి అందజేశారు. దీని విలువ రూ.25 లక్షలు.

19 నుంచి అమరావతిలో పవిత్రోత్సవాలు

అమరావతిలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు పవిత్రోత్సవాలను టీటీడీ నిర్వహించనుంది. 18 సాయంత్రం అంకురార్పణతో ఉత్సవాలు మొదలవుతాయి.

డిసెంబరుకల్లా తేల్చేద్దాం!

(మొదటి పేజీ తరువాయి)

రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన ఉపసంఘం సమావేశం జరిగింది. మంత్రులు అనిత, నిమ్మల రామానాయుడు, నాదెండ్ల మనోహర్, పి.నారాయణ, బీసీ జనార్దన్‌రెడ్డి, సత్యకుమార్ పాల్గొన్నారు. గతంలో జరిగిన జిల్లాల విభజన, దాని వల్ల తలెత్తిన పాలనా సమస్యలు.. జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల సరిహద్దుల్లో ఉన్న ఇబ్బందులు.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సీసీఎల్ఏ జి.జయలక్ష్మి ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇప్పటి వరకు ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, విన్నపాల్లో కీలకమైన వాటిపై ఉపసంఘం చర్చించింది. జిల్లాల్లో ఉన్న సమస్యలకు డిసెంబరునాటికి పరిష్కారం చూపాలని నిర్ణయించింది. సెప్టెంబరు 2వ తేదీ వరకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఇతర వర్గాల నుంచి ఫిర్యాదులు, విన్నపాలు, సూచనలు, సలహాలు స్వీకరించనుంది. ఉపసంఘంలోని మంత్రులు బృందాలుగా ఏర్పడి ఈ నెల 29, 30వ తేదీల్లో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పర్యటించాలని నిర్ణయం తీసుకున్నారు. గిరిజన ప్రాంతాలు పాడేరు, రంపచోడవరం, పోలవరం విలీన మండలాల్లో కూడా పర్యటించి అక్కడి ప్రజలతో మాట్లాడాలని మంత్రులు భావిస్తున్నారు. జిల్లాల పర్యటనలో తొలుత కలెక్టర్లు, ఆ తర్వాత జిల్లా ప్రజాప్రతినిధులతో ఉపసంఘం సమావేశం కానుంది. పాలనాపరమైన ఇబ్బందులు, సరిహద్దు సమస్యలపై కలెక్టర్ల నుంచి వివరాలు తెలుసుకుంటారు. ప్రజలు, కలెక్టర్లు, ప్రజాప్రతినిధుల నుంచి వచ్చే నివేదికలు, సూచనలు, సలహాల ఆధారంగా సెప్టెంబరు 15 నాటికి ఉపసంఘం తుది నివేదికను సిద్ధం చేసి ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందించాలని భావిస్తోంది. ఆ తర్వాత జిల్లాల పేర్లు, ప్రధాన కేంద్రాల ఏర్పాటు, డివిజన్, మండలాల పునర్విభజనపై నిర్ణయం సుకోనుంది. అనంతరం ప్రభుత్వ నిర్ణయాలను బట్టి రెవెన్యూ శాఖ గెజిట్ నోటిఫికేషన్లు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియనంతా డిసెంబరులోపే పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రజాభిప్రాయానికే ప్రాధాన్యం: అనగాని

జిల్లాల పేర్లు, ప్రధాన కేంద్రాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల పునర్విభజనలో ప్రజాభిప్రాయానికే ప్రాధాన్యమిస్తామని మంత్రి అన గాని మీడియాకు చెప్పారు. కమిటీ ఏర్పాటైనప్పటి నుంచి పెద్ద ఎత్తున విన్నపాలు, సూచనలు వస్తున్నాయని, ప్రతి అంశాన్నీ పరిశీలిస్తామని తెలిపారు. తాము కేవలం జిల్లాల పునర్విభ జన అంశంపైనే అధ్యయనం చేస్తున్నామని, అసెంబ్లీ నియోజకవర్గాల మార్పు తమ పరిధిలో లేని అంశమని చెప్పారు.

సూచనల వెల్లువ..

జిల్లాల పేర్లు, ప్రధాన కేంద్రాల మార్పు, డివిజన్లు, మండలాల పునర్విభజనపై ప్రజలు, సంఘాలు, పార్టీలు, ప్రజాప్రతినిధుల నుంచి పెద్ద ఎత్తున విన్నపాలు ఉపసంఘానికి చేరుతున్నాయి. అందులో కొన్ని..

- తూర్పుగోదావరి జిల్లాకు సర్ ఆర్థర్ కాటన్ పేరు పెట్టాలి.
- కోనసీమ, కాకినాడ జిల్లాల్లో మండలాల విభజన జరగాలి.
- మండపేట మండలాన్ని రాజమండ్రిలో కలపాలి.
- సర్వేపల్లి మండలాన్ని నెల్లూరులోనే కొనసాగించాలని టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఉపసంఘాన్ని కోరారు.
- చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలాన్ని తిరుపతి జిల్లాలో కలపాలన్న వినతులు వచ్చాయి. వెదురుకుప్పం తిరుపతికి 15 కిమీ దూరంలో ఉంది. కానీ దానిని చిత్తూరులో చేర్చారు.
- అన్నమయ్య జిల్లాకు ప్రధాన కేంద్రంగా రాజంపేటను ఎంపిక చేయాలన్న విన్నపాలు వచ్చాయి. గతంలో వైసీపీ నేతలు వ్యూహాత్మకగా రాయచోటిని జిల్లా కేంద్రంగా ఎంపిక చేయించారు. జిల్లాల పునర్విభజనకు లోక్‌సభ స్థానాలను ప్రామాణికంగా తీసుకున్న వైసీపీ సర్కారు జిల్లా కేంద్రాల ఏర్పాటులో సొంత రాజకీయ ప్రయోజనాలకే పెద్దపీట వేసింది.
- పాడేరు, అల్లూరి జిల్లా విలీన మండలాల విషయంలో 23 విన్నపాలు వచ్చాయి.
- నరసాపురం లోక్‌సభ స్థానాన్ని పశ్చిమగోదావరి జిల్లాగా పునర్విభజన చేశారు. భీమవరాన్ని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేశారు. ఇప్పుడు నరసాపురాన్ని జిల్లా కేంద్రం చేయాలని అక్కడి ప్రజాప్రతినిధులు ఉపసంఘానికి లేఖ రాశారు.
- బాపట్ల లోక్‌సభ స్థానం ఆధారంగానే జిల్లాను పునర్విభజన చేయాలని అక్కడి నేతలు కోరుతున్నారు. జిల్లా కేంద్రాన్ని చీరాలకు మార్చాలని ఆ ప్రాంత వాసులు కోరారు. బాపట్ల జిల్లాకు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య పేరుపెట్టాలన్నారు.
- గుంటూరు లేదా పల్నాడు జిల్లాకు గుర్రం జాషువా పేరుపెట్టాలని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ ఉపసంఘాన్ని కోరారు.
- కృష్ణా జిల్లా మడిచర్లను బాపులపాడు మండలం నుంచి నూజివీడు లేదా ముసునూరు మండలంలో కలపాలని స్థానికులు కోరారు.
- శ్రీకాకుళం జిల్లా మురపాకను మండలంగా ప్రకటించాలని ఆ ప్రాంతానికే చెందిన బీఎస్ నాయుడు కోరారు.

ఉపసంఘం ముందు కీలక ప్రతిపాదనలు..

- బాపట్ల జిల్లాలో అద్దంకి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన వచ్చింది.
- పాలనా సౌలభ్యం కోసం పార్వతీపురం మన్యం జిల్లా లక్నాపురం గ్రామాన్ని రెండు రెవెన్యూ గ్రామాలుగా విభజించాలి.
- అన్నమయ్య జిల్లాను పూర్తిగా పునర్విభజించాలని ప్రతిపాదన వచ్చింది. చిత్తూరులో ఉన్న పుంగనూరు, చౌడేపల్లి, సోమల, సోదం, పులిచర్ల, రొంపిచర్ల మండలాలను అన్నమయ్య జిల్లాలో కలపాలని రెవెన్యూశాఖ అంటోంది. ఈ జిల్లాలో కొత్తగా మదనపల్లె అర్బన్ మండలం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన వచ్చింది.
- ఎన్టీఆర్ జిల్లాలో వీరులపాడు మండల కేంద్రంగా వీరులపాడునే కొనసాగించాలన్న ప్రతిపాదన వచ్చింది.
- విజయనగరం జిల్లాలో ఉన్న శృంగవరపు కోట, లక్కవరపు కోట, కొత్తవలస, వేపాడ, జామి మండలాలను విశాఖ జిల్లాలో కలుపాలన్న ప్రతిపాదన తెరపైకి వచ్చింది.

ప్రతిభ ఉన్నా నిబంధనలే అడ్డంకి!

- ఇంటర్‌లో ఇంగ్లిష్ లాంగ్వేజీ ఎంచుకోక మెడిసిన్ సీటు కోల్పోతున్న తిరుపతి విద్యార్థి
- దివ్యాంగ కేటగిరీలో ఇంటర్‌లో ఆంగ్లానికి మినహాయింపు
- నీట్‌లో తప్పనిసరి కావడంతో మంత్రి లోకేశ్ స్పందించాలని కోరుతున్న విద్యార్థి కుటుంబం



హరిహర బ్రహ్మారెడ్డి

తిరుపతి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్‌లో తనకు లభించిన మినహాయింపు మేరకు ఫస్ట్ లేదా సెకండ్ లాంగ్వేజీ కింద ఇంగ్లిష్ ఎంచుకోనందుకు ఓ దివ్యాంగ విద్యార్థికి మెడిసిన్ సీటు కోల్పోయే పరిస్థితి నెలకొంది. తిరుపతికి చెందిన దాసరెడ్డి ప్రతాప్‌రెడ్డి కుమారుడు హరిహర బ్రహ్మారెడ్డి కృష్ణా జిల్లా కంకిపాడు శ్రీచైతన్య కాలేజీలో 2023-25 విద్యా సంవత్సరంలో ఇంటర్ బైపీసీ ఇంగ్లిష్ మీడియం చదివారు. శారీరక వైకల్యం కలిగిన విద్యార్థులకు ఇంటర్మీడియట్‌లో ఫస్ట్ లేదా సెకండ్ లాంగ్వేజీ కింద ఇంగ్లిష్ ఎంచుకోకుండా మినహాయింపు ఉంది. దాన్ని వినియోగించుకుని హరిహర బ్రహ్మారెడ్డి ఫస్ట్ లాంగ్వేజీగా ఇంగ్లిష్ మినహాయించుకుని సెకండ్ లాంగ్వేజీగా సంస్కృతం ఎంచుకున్నాడు. ఇంటర్ పరీక్షల్లో 90 శాతం మార్కులతో ఏ గ్రేడ్ సాధించాడు. నీట్‌లో దివ్యాంగ కేటగిరీలో 1174వ ర్యాంకు పొందాడు. ఆ ర్యాంకుతో అతనికి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు లభించే అవకాశముంది. ఈ నెల 19న కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉంది. అయితే నీట్ నిబంధనల ప్రకారం అభ్యర్థులు ఇంటర్‌లో తప్పనిసరిగా ఇంగ్లిష్‌ను ఫస్ట్ లేదా సెకండ్ లాంగ్వేజీగా ఎంచుకోవాలి. ఈ విద్యార్థికి ఇంటర్ మార్కుల జాబితాలో కౌన్సెలింగ్‌లో సమర్పించాల్సిన ఇంటర్ మార్కుల జాబితాలో ఫస్ట్ లాంగ్వేజీ అన్న కాలమ్ వద్ద ఎగ్జెంప్టెడ్ అన్న అర్థంలో 'ఇ' అని పేర్కొన్నారు. దీంతో నీట్ కౌన్సెలింగ్‌లో హరిహర బ్రహ్మారెడ్డి మెడిసిన్ సీటు కోల్పోయే పరిస్థితి నెలకొంది. ఇంటర్‌లో రాష్ట్ర ప్రభుత్వమే దివ్యాంగ విద్యార్థులకు ఇంగ్లిష్ లాంగ్వేజీ నుంచీ మినహాయింపు ఇచ్చినందున తనకు ఇంగ్లిష్‌లో కనీస మార్కులు 35 కలిపి ఆ మేరకు కొత్త మార్కుల జాబితా జారీ చేయాలని బాధిత విద్యార్థి కోరుతున్నాడు. దివ్యాంగుడైన తమ కుమారుడు మెడిసిన్ సీటు సాధించినందుకు పొంగిపోయిన తల్లిదండ్రులు, తాజా పరిస్థితికి తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గతంలో ఇలాంటి పరిస్థితే రాష్ట్రంలో ఐఐటీ సీటు సాధించిన విద్యార్థులకు ఎదురు కాగా విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించి వారికి ఇంగ్లిష్ సబ్జెక్టులో కనీస మార్కులు 35 కలుపుతూ జీవో జారీ చేయించారు. ఇప్పుడు కూడా విద్యా శాఖ మంత్రి లోకేశ్ స్పందిస్తే దివ్యాంగుడైన తమ కుమారుడికి మెడిసిన్ సీటు దక్కుతుందని ప్రతాప్‌రెడ్డి వేడుకుంటున్నారు. ఈ మేరకు మంత్రిని కలిసేందుకు ఆయన మంగళగిరి వెళ్లారు.



మంగళగిరిలోని చేనేత దుకాణంలో వస్త్రాలను కొనుగోలు చేస్తున్న బ్రాహ్మణి

దేశవిదేశాల్లో మంగళగిరి చేనేత మార్మోగాలి: నారా బ్రాహ్మణి

- మంగళగిరిలో విస్తృత పర్యటన..
- చేనేతల సమస్యలపై ఆరా

మంగళగిరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి చేనేత వస్త్రాలు ఇంకా పెద్దఎత్తున మార్కెటింగ్ కావాలని.., దేశ, విదేశాల్లో మంగళగిరి చేనేత బ్రాండ్ మార్మోగిపోవాలని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ సతీమణి బ్రాహ్మణి ఆకాంక్షించారు. మంగళగిరి చేనేతకు ఓ సమున్నతమైన గౌరవాన్ని తీసుకొచ్చేందుకు మంత్రి లోకేశ్ చిత్తశుద్ధితో గట్టిగా పోరాడుతున్నారని చెప్పారు. కచ్చితంగా చేనేతకు పూర్వవైభవాన్ని లోకేశ్ తీసుకొస్తారన్నారు. బ్రాహ్మణి బుధవారం మంగళగిరిలో విస్తృతంగా పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆమె స్వయంగా పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఓ ప్రైవేటు చేనేత వస్త్ర దుకాణాన్ని ప్రారంభించిన బ్రాహ్మణి...అనంతరం పలురకాల చేనేత వస్త్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ డిజైన్లను గురించి ఆసక్తిగా వాకబు చేస్తూ చేనేతలకు మజూరీలు ఏయేవిధంగా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిన్నమొన్నటివరకు కునారిల్లుతూ ఉన్న చేనేతను మనందరం కలిసి కాపాడుకుందామంటూ చేనేతలకు పిలుపునిచ్చారు. అనంతరం కాజలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్-ఈడబ్ల్యూఎస్ సంయుక్త సహకారంతో నిర్వహిస్తున్న ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాన్ని బ్రాహ్మణి సందర్శించారు.

28 నకిలీ వెబ్‌సైట్లు తొలగింపు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తులే లక్ష్యంగా సైబర్ మోసాలకు పాల్పడుతున్న 28 నకిలీ వెబ్‌సైట్లను గూగుల్ సెర్చ్ ఇంజన్ నుంచి తొలగించారు. శ్రీవారి దర్శన టిక్కెట్లు, తిరుమలలో వసతి పేరిట కొన్ని నకిలీ వెబ్‌సైట్లు పుట్టుకొస్తున్నాయి. వీటిపై నిఘాకు తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశాలతో తిరుమల పోలీసులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. దర్శనం, వసతి పేరిట 30కి పైగా నకిలీ వెబ్‌సైట్లు ఉన్నట్లు గుర్తించారు. వీటిలో 28 వెబ్‌సైట్లను గూగుల్ సెర్చ్ ఇంజన్ నుంచి తొలగించారు. మిగతా వాటినీ తొలగించడానికి చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అక్టోబరు 7న పైడిమాంబ సిరిమానోత్సవం

విజయనగరం రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, విజయనగరంలో కొలువైన పైడిమాంబ సిరిమానోత్సవం అక్టోబరు 7న నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శిరీష, పూజారి బంటుపల్లి వెంకటరమణ తెలిపారు. దేవస్థానం కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ...అక్టోబరు 6న తొలేళ్ల ఉత్సవం నిర్వహిస్తామన్నారు. అమ్మవారి పండగకు సంబంధించి సెప్టెంబరు 12న పందిరిరాట వేస్తామని, అదే రోజు భక్తుల మండల దీక్షలు ప్రారంభమవుతాయన్నారు. సిరిమానోత్సవ కార్యక్రమాలు అక్టోబరు 22న జరిగే చండీహోమంతో ముగుస్తాయన్నారు. పండగ షెడ్యూల్‌ను ఈవో శిరీష, వెంకటరావు, దేవాలయ అర్చకులు, ఉద్యోగులు ఆవిష్కరించారు.

సవరించిన డీఎస్సీ తుది మార్కులు విడుదల

- నేడూ అభ్యంతరాలకు అవకాశం

అమరావతి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): టెట్ మార్కులపై అభ్యంతరాలను స్వీకరించి మారిన మార్కులతో సవరించిన డీఎస్సీ తుది మార్కుల స్కోర్ కార్డులను బుధవారం విడుదల చేసినట్టు డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఏపీ డీఎస్సీ వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి సవరించిన మార్కులు చూసుకోవచ్చన్నారు. ఇంకా టెట్ మార్కులపై ఎవరికైనా అభ్యంతరాలుంటే గురువారం కూడా ఆన్‌లైన్‌లో అభ్యంతరాలు పంపవచ్చని సూచించారు.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

వాతావరణ మార్పును అన్ని దేశాలూ తమ శక్తి మేరకు ఎదుర్కోవాలని 15 మంది న్యాయమూర్తుల అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసిజె) ఏకగ్రీవంగా ఇటీవల సలహాపూర్వక అభిప్రాయాన్ని ప్రకటించింది. వాతావరణ మార్పు నిరోధక చర్య అంతర్జాతీయ న్యాయ నియమాలకు నిబద్ధమై ఉండే చట్టపరమైన విధి అని ఐసిజె స్పష్టం చేసింది. వాతావరణ మార్పు కారణాలు, ప్రభావాలను అర్థం చేసుకోవడానికి ఐపీసీసీ అంచనాలు ప్రమాణమయినట్టుగానే వాతావరణ మార్పు వైపరీత్యాలను అదుపుచేయడంలో ప్రపంచ దేశాల కార్యాచరణ లేదా క్రియాశూన్యతను అంచనా వేసేందుకు తన సలహాపూర్వక అభిప్రాయం ఒక స్పష్టమైన ప్రాతిపదిక అని ఐసిజె నిర్దేశించింది. పారిస్ ఒప్పందం ప్రకారం భూతాపాన్ని పారిశ్రామిక యుగ పూర్వ స్థాయిల కంటే 1.5 డిగ్రీ సెంటీగ్రేడ్‌కు తగ్గించాలనే లక్ష్యం చట్టబద్ధమైనదని అంతర్జాతీయ న్యాయస్థానం ధ్రువీకరించింది. ఈ ఏడాది తొలినాళ్లలో అమెరికా ఆ ఒప్పందం నుంచి వైదొలిగింది. అయినప్పటికీ అమెరికా తాను భాగస్వామిగా ఉన్న ఇతర అంతర్జాతీయ ఒడంబడికల ప్రకారం తమ వల్ల పర్యావరణానికి జరుగుతున్న హానికి బాధ్యత వహించాల్సిందేనని ఐసిజె స్పష్టం చేసింది. మానవ కార్యకలాపాల మూలంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, సంభవిస్తున్న విపరీత వాతావరణ సంఘటనలు జీవ వైవిధ్యాన్ని హరించివేస్తూ మానవుడితో సహా సకల జీవకోటి అస్తిత్వానికి ఎనలేని హాని కలిగిస్తున్నాయని ఐసిజె పేర్కొంది. హరిత గృహ వాయు ఉద్గారాల కారణంగా తీవ్రమవుతున్న భూతాపం నుంచి ధరిత్రి వాతావరణ వ్యవస్థలను, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు సకల దేశాల బాధ్యత అని నొక్కి చెప్పింది. వాతావరణ మార్పుపై అంతర్జాతీయ న్యాయస్థాన ఏకగ్రీవ ప్రకటన ప్రపంచవ్యాప్తంగా విధాన నిర్ణేతలలోను, పర్యావరణ పరిరక్షణ స్ఫూర్తి ఉన్న సామాన్య విద్యావంతులలోను ప్రధాన చర్చనీయాంశమయింది.

వాతావరణ న్యాయం

ఐక్యరాజ్యసమితి, దాని అనుబంధ సంస్థల అభ్యర్థన మేరకు నిర్దిష్ట విషయాలపై సలహాపూర్వక అభిప్రాయాన్ని ప్రకటించడం ఐసిజెకు పరిపాటి. ఈ సలహాకు ఏ దేశమూ కట్టుబడి ఉండవల్సిన అవసరం లేదు అయితే అంతర్జాతీయ చట్టం కింద ఒక నిర్దిష్ట సమస్య పరిష్కారానికి ఎటువంటి చర్యలు చేపట్టాలనే దాన్ని ఈ సలహాపూరిత అభిప్రాయం ప్రతిబింబిస్తుంది. కట్టుబడి ఉండవల్సిన అవసరం లేనప్పటికీ ఐసిజె సలహాకు శాసనిక మాన్యత, నైతిక అధికారం ఉన్నాయనే వాస్తవం విస్మరింపలేనిది. వాతావరణ మార్పు సమస్య పరిష్కారానికి జాతీయ ప్రభుత్వాలు చట్టబద్ధంగా చేపట్టవలసిన చర్యలేమిటి? ఆ విధులను అవి నిర్వర్తించకపోతే పర్యవసానాలు ఏమిటి అని ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ నివేదించిన ప్రశ్నలకు ప్రతిస్పందనగా ఐసిజె పై సలహాపూర్వక అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ప్రతి వ్యక్తీ మానవ హక్కులను సంపూర్ణంగా పొందేందుకు నిర్మలమైన, ఆరోగ్యకరమైన, సుస్థిర పర్యావరణం తప్పనిసరి అని, ఈ దృష్ట్యా వాతావరణ వ్యవస్థలు, ఇతర పర్యావరణ విభాగాలను పరిరక్షించకుండా ప్రతి వ్యక్తికీ మానవ హక్కులు సమకూరేలా చేయడం అసాధ్యమవుతుందని ఐసిజె స్పష్టం చేసింది. పర్యావరణ వ్యవస్థలను కేవలం 'వనరులు'గా కాకుండా వాతావరణ భాగస్వాములుగా గుర్తించాలని ఆదేశిస్తూ వాతావరణ మార్పుకు శాశ్వత, సంతృప్తికర పరిష్కారానికి మానవ సంకల్పం, విజ్ఞత అవసరమని ఐసిజె తన తీర్పును కవితాత్మకంగా ముగించింది.

మానవాళి ఉమ్మడి భవిష్యత్తుకు భద్రత సమకూర్చడానికి ఉద్దేశించిన ఈ దార్శనిక న్యాయ నిర్ణయం 2019లో పసిఫిక్ దీవి దేశమైన వనువాటులో 27 మంది న్యాయశాస్త్ర విద్యార్థులు ప్రారంభించిన ఉద్యమ విజయం. వాతావరణ మార్పు దుష్ప్రభావాలకు తీవ్రంగా ప్రభావితమవుతున్న వనువాటు విజ్ఞప్తి మేరకు ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ ఐసిజె అభిప్రాయాన్ని కోరింది. పాశ్చాత్య దేశాలు అంతకంతకూ వాతావరణ వ్యతిరేక వైఖరి వహిస్తున్న తరుణంలో వెలువడిన ఈ అభిప్రాయం 'ధరిత్రి' విజయంగా భావిస్తున్నారు. 'సమస్త వాతావరణ మార్పు నిరోధక విధానాలకు పారిస్ ఒప్పందం లక్ష్యాలే ప్రాతిపాదిక కావాలన్న విషయాన్ని ఐసిజె తీర్పు ధ్రువీకరించింది. ఇది మన ధరిత్రికి, వాతావరణ న్యాయానికి, ప్రపంచ పరిస్థితులను మార్చడంలో యువజనుల శక్తి సామర్థ్యాలకు మహా విజయమని' ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెర్స్ ప్రశంసించారు. 'ప్రపంచం ప్రతిస్పందించాలి' అని ఆయన పిలుపునిచ్చారు. మరి వనువాటు విద్యార్థుల ఉద్యమం మన విద్యార్థి, యువజన సంఘాలు, ముఖ్యంగా యువ న్యాయవాదులకు స్ఫూర్తి కావాలని అందరమూ కోరుకోవాలి.

అబద్ధమే ట్రంప్ ఆయుధం!

నికోలో మాకియవెల్లి (1469–1527), పాలకుడు కానప్పటికీ, తన 'ది ప్రిన్స్' పుస్తకంలో పాలకులు రాజ్య స్థిరత్వం కోసం వ్యూహాత్మకంగా మోసం చేయవచ్చునని సలహా ఇచ్చాడు. క్లియోపాత్రా మోసపూరిత దౌత్యంలో ప్రసిద్ధి చెందింది. నీరో చక్రవర్తి అధికారాన్ని నిలబెట్టుకోవడానికి, ప్రత్యర్థులను తొలగించడానికి అబద్ధాలను ఉపయోగించాడు. ఇంగ్లాండ్‌కు చెందిన మొదటి ఎలిజబెత్ రాణి దౌత్యంలో వ్యూహాత్మక మోసం వాడటంలో పేరు పొందింది. సోవియట్ నాయకుడు స్టాలిన్ అధికారాన్ని నిలబెట్టుకోవడానికి తప్పుడు ప్రచారాన్ని, సమాచారాన్ని ఉపయోగించాడు. ఇలా చరిత్రలో చాలా మంది పాలకులు రాజకీయ లక్ష్యాలను సాధించడానికి మోసపూరితంగా ప్రవర్తించారని చరిత్రకారులు రికార్డు చేశారు. ఈ క్రమంలోకి చక్కగా ఒదిగిపోయే నాయకుడు, వీరికి వర్తమానంలో వారసుడు ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.

అమెరికా రాజకీయ చరిత్రలోనే అతి ఎక్కువ తప్పుదారి పట్టించే ప్రకటనలు చేసిన నాయకుడిగా ట్రంప్‌ను పత్రికలు, పరిశోధకులు గుర్తించారు. ట్రంప్ తన అధ్యక్ష పదవీకాలంలో 30,573 తప్పుదారి పట్టించే వాదనలు చేశారని వాషింగ్టన్ పోస్ట్ పత్రిక నమోదు చేసింది. అంటే రోజుకి సగటున 21 కంటే ఎక్కువ తప్పుడు వ్యాఖ్యలు అన్నమాట. సీఎన్ఎన్ రికార్డుల ప్రకారం ట్రంప్ ఒక్క ఇంటర్వ్యూలోనే 32 తప్పుడు వాదనలు, ఒక ప్రసంగంలోనే 18 తప్పుడు వాదనలు చేసిన సందర్భాలు ఉన్నాయి. ఆయన తప్పుడు వ్యాఖ్యలు ప్రధానంగా ఆర్థిక పరిస్థితులు, ఉద్యోగాల పెరుగుదల, తయారీ రంగం విస్తరణ వంటి విషయాలలో కనిపించాయి. ఉదాహరణకు, చైనాపై విధించిన సుంకాలను "చైనా చెల్లిస్తోంది" అని మళ్ళీ మళ్ళీ చెబుతూ వచ్చాడు. కానీ వాస్తవానికి ఆ భారాన్ని అమెరికా దిగుమతిదారులే మోశారని అధ్యయనాలు నిరూపించాయి. అలాగే, తయారీ రంగంలో రికార్డు స్థాయిలో వృద్ధి జరిగిందని, కోట్ల ఉద్యోగాలు సృష్టించానని చెప్పినా, గణాంకాలు దీనికి విరుద్ధం. కరోనా సమయంలో కూడా ట్రంప్ తప్పుడు వ్యాఖ్యాల ప్రభావం తీవ్రంగా కనిపించింది. కోవిడ్ తీవ్రతను తక్కువ చేసి చూపుతూ, దానిని సాదాసీదా ఫ్లూతో పోల్చాడు. మరణాల శాతం తక్కువగా ఉందని చెప్పాడు. 2020 ఎన్నికల ఫలితాలపై ఆయన చేసిన తప్పుడు ఆరోపణలు అమెరికాలో విస్తృతమైన అపోహలను సృష్టించాయి. ఎన్నికల్లో మోసం జరిగిందని మళ్ళీ మళ్ళీ చెబుతూ వచ్చినా– అన్ని చట్టపరమైన పరిశీలనలు, కోర్టు తీర్పులు ఆ ఆరోపణలను ఖండించాయి. వలసదారులు, నేరాల గణాంకాల గురించి కూడా ఆయన అనేక వ్యాఖ్యలు వాస్తవానికి విరుద్ధంగా, రెచ్చగొట్టే విధంగా ఉన్నాయి.



అమెరికా రాజకీయ చరిత్రలోనే తప్పుదారి పట్టించే ప్రకటనలు అతి ఎక్కువగా చేసిన నాయకుడిగా ట్రంప్‌ను పత్రికలు, పరిశోధకులు గుర్తించారు. ట్రంప్ తన అధ్యక్ష పదవీకాలంలో 30,573 తప్పుదారి పట్టించే వాదనలు చేశారని వాషింగ్టన్ పోస్ట్ పత్రిక నమోదు చేసింది. అంటే రోజుకి సగటున 21 కంటే ఎక్కువ తప్పుడు వ్యాఖ్యలు అన్నమాట.

ప్రభుత్వ సంస్థల నమ్మకాన్ని దెబ్బతీయడంలో కూడా ట్రంప్ పద్ధతి ప్రత్యేకం. తన వాదనలకు విరుద్ధంగా గణాంకాలు చెప్పిన ఫెడరల్ అధికారులను విమర్శించడం, లేదా తొలగించడం, తనకు ప్రతికూలమైన డేటాను "నకిలీ" అని పిలవడం చేశారు. పరిశీలకులు దీన్ని "ఫైర్‌హోసింగ్" అంటున్నారు. అంటే తప్పుదారి పట్టించే సమాచారాన్ని పెద్ద ఎత్తున, వేగంగా, నిరంతరాయంగా వెల్లువెత్తించి, ప్రజల విమర్శనాత్మక ఆలోచనను చంపివేయడం. దీనివల్ల వాస్తవం ఏమిటో నిర్ధారించడం కష్టమవుతుంది. ఈ శైలి ఇప్పుడు ట్రంప్ రెండవసారి అధ్యక్షుడైన తరువాత మరింత తీవ్రస్థాయిలో నడుస్తోంది. ఆర్థిక వ్యవస్థ, ఔషధ ధరలు, రాజకీయ విజయాలు వంటి అనేక అంశాల్లో తప్పు అని తేలిన వాదనలనే ఆయన తిరిగి తిరిగి చెబుతున్నాడు. ఈ తప్పుడు వ్యాఖ్యలు మీడియా, ప్రభుత్వ సంస్థలు, ప్రజాస్వామ్య వ్యవస్థలపై నమ్మకాన్ని క్రమంగా దెబ్బతీసి, అమెరికా రాజకీయ సంభాషణనే మౌలికంగా మార్చేశాయి.

వర్తమాన కాలాన్ని సత్యానంతర (Post–Truth) కాలం అంటున్నారు. ఇందులో వాస్తవాల కంటే భావోద్వేగాలు, వ్యక్తిగత నమ్మకాలు ఎక్కువగా ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేస్తాయి. ఈ పరిస్థితిలో, స్పష్టమైన సాక్ష్యాలు ఉన్నా కూడా, తమ భావాలకు లేదా అభిప్రాయాలకు అనుగుణంగా ఉన్న విషయాలనే ప్రజలు ఎక్కువగా నమ్ముతారు. పక్షపాతపూరిత వార్తా మాధ్యమాల ద్వారా తప్పుడు సమాచారం మరింత విస్తరిస్తుంది. ఈ మధ్య కాలంలో సత్యానంతరత గురించి అనేక పుస్తకాలు, అధ్యయనాలు వచ్చాయి. అన్నీ కూడా ట్రంప్‌నే ఉదాహరణగా చూపించటం గమనార్హం.

ట్రంప్ చెప్పిన, చెపుతున్న అబద్ధాలకు అంతు లేదు. గాజా గురించి మాట్లాడుతూ "నేను అక్కడికి వెళ్లాను, అది చాలా సంక్లిష్ట ప్రదేశం" అన్నాడు. అయితే, ఆయన గాజాకు ఎప్పుడూ వెళ్లినట్టు ఎలాంటి ఆధారాలూ లేవు. ఏ రికార్డులూ ట్రంప్ గాజా ప్రయాణాన్ని నిర్ధారించలేదు. ఎందుకంటే అసలు అలాంటి ప్రయాణం జరగనేలేదు. సీఎన్ఎన్ లాంటి వార్తా సంస్థలు దాన్ని తప్పుడు ప్రచారంగా కొట్టివేశాయి. అలాగే, "హమాస్ దాడులు అమెరికా పన్ను చెల్లింపుదారుల డబ్బుతో జరిగాయి" అనీ, "బైడెన్ ప్రభుత్వమే ఇందుకు కారణం" అనీ ట్రంప్ అన్నాడు. ఈ వాదన పూర్తిగా తప్పు. ఈ నిధులు ఇరాన్‌కు మానవతా సహాయం రూపంలో (ఆహారం కోసం, మందులు కోసం) ఇచ్చినవి, సైనిక ప్రయోజనాల కోసం కాదు. గాజాకు పంపిన ఆహార సరఫరాలను హమాస్ దొంగిలించి, అమ్మేస్తోందని కూడా ట్రంప్ ఆరోపించాడు. అయితే అమెరికా ప్రభుత్వ నివేదికల్లో దీనికి ఎలాంటి ఆధారాలు లభించలేదు. గాజాలో పెద్ద సంఖ్యలో పౌరుల మరణాలకు ఇజ్రాయెల్ కారణమని ట్రంప్ అన్నట్లు ఒక వీడియో సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారమయింది. కానీ ఇది కృత్రిమ మేధ (AI) ద్వారా తయారు చేసిన నకిలీ వీడియో అని తరువాత బయటపడింది. ట్రంప్ అలాంటి వ్యాఖ్య చేసిన రికార్డు ఎక్కడా లేదు. అంతకంటే ముఖ్యంగా, ఇజ్రాయెల్-హమాస్ కాల్పుల విరమణకు తానే ప్రధాన కారణమని ప్రచారం చేసుకున్నాడు. వాస్తవానికి కాల్పుల విరమణ చర్చలు ట్రంప్ ప్రమేయానికి ముందే ప్రారంభమయ్యాయి.

మరింత విచిత్రంగా, ఎటువంటి సంకోచం లేకుండా ట్రంప్ అనేకసార్లు తాను భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధం అణుయుద్ధం అయ్యే ప్రమాదాన్ని ఆపేశానని చెప్పుకున్నాడు. ఇరుదేశాలతో ఉన్న అన్ని వాణిజ్య ఒప్పందాలను రద్దు చేస్తానని బెదిరించడం వల్లే యుద్ధం ఆగిందన్నాడు. అయితే, భారత అధికారులు ఈ కథనాన్ని పూర్తిగా ఖండించారు. కాల్పుల విరమణ అనేది భారత-పాకిస్థాన్ సైనిక వ్యవస్థల మధ్య నేరుగా జరిగిన చర్చల ఫలితమని, ఎటువంటి బయటి మధ్యవర్తిత్వం లేదని స్పష్టం చేశారు. అదేవిధంగా ట్రంప్ కశ్మీర్ సమస్యను పరిష్కరించడానికి భారత ప్రధాని మోదీ తన మధ్యవర్తిత్వాన్ని కోరాడని అన్నాడు. దీనిని భారత విదేశాంగ మంత్రిత్వశాఖ వెంటనే ఖండించింది.

"నాయకులు తమ అబద్ధాలకు సరిపడేలా వాస్తవాన్ని మలచుకునే అధికారాన్ని పొందే ముందు నుంచే, వాళ్ళు వాస్తవాల పట్ల తీవ్రమైన నిర్లక్ష్యాన్ని, నిరాదరాన్ని చూపుతారు. వాళ్ళకి నిజం అనేది స్వతంత్రంగా ఉండే విషయం కాదు. దాన్ని సృష్టించగల, మార్చగల మనిషి శక్తిపైనే అది ఆధారపడుతుందని వాళ్ళు నమ్ముతారు," అని అంటుంది హానా అరెండ్ (Hannah Arendt) తన రచన 'The Origins of Totalitarianism'లో. కచ్చితంగా ట్రంప్ చేసింది, చేస్తున్నది అదే. తప్పుదారి పట్టించే వాదనల వెనుక ట్రంప్‌కు ఉన్న కారణాలు మానసిక, వ్యూహాత్మక, సాంస్కృతిక కారకాల మిశ్రమం నుంచి పుట్టాయనుకోవచ్చు. ట్రంప్ 'స్వయం ప్రేమ' (Narcissistic) లక్షణాలను ప్రదర్శిస్తాడని, స్వీయ–గొప్పతనం కోరుకుంటాడని, అపరాధ భావన లేకుండా అబద్ధాలు చెబుతాడని పరిశీలకులు అంటున్నారు. ట్రంప్ అబద్ధాలన్నీ ప్రజా విశ్వాసాన్ని, ప్రజాస్వామ్య ప్రక్రియలను దెబ్బతీసేవే.

జార్జ్ ఆర్వెల్ అన్నట్లుగా రాజకీయ భాష అబద్ధాలను సత్యంగా అనిపించేలా, హత్యను గౌరవనీయంగా కనిపించేలా, గాలికి దృఢమైన రూపాన్ని కలిగించేలా చేయగలదు. ఈ భాష పట్ల స్పృహ కలిగి ఉండటం నేటి అవసరం. అలాగే "అనంత జ్ఞానానికి ద్వారం తెరవడం మాత్రమే కాదు, అనంత తప్పిదాలకు హద్దు విధించడం" కూడా ఇవ్వాళ అత్యంత అవసరమైన అంశం.

■ ప్రొ. బి. తిరుపతిరావు
ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం

ప్రజాస్వామ్య పునాదులపైనే కుట్రలా!

'ఓట్ల సవరణ జరిగినప్పుడు మనమే అధికారంలో ఉన్నాం. సరిగ్గా పరిశీలించకపోవడం మన తప్పే' అని మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో ఓట్ల చోరీ అంటూ రాహుల్‌గాంధీ చేసిన ఆరోపణలకు కాంగ్రెస్ పార్టీకే చెందిన మంత్రి కేఎన్ రాజన్న సమాధానం ఇచ్చారు. రాహుల్‌గాంధీ వెర్రితనాన్నే బయటపెడతావా అని ఆగ్రహించిన హైకమాండ్ రాజన్న పదవిని పీకేసింది. కానీ ఆయన వ్యక్తం చేసిన సందేహమే అందరిదీ. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. ఓట్ల చోరీ జరిగి ఉంటే కాంగ్రెస్ పార్టీ ఎలా అధికారంలోకి వచ్చింది? అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించక ముందు బీజేపీ ప్రభుత్వమే ఉంది. ఓట్ల చోరీ చేసి గెలవగలిగితే– ఎందుకు బీజేపీ పరాజయం పాలయ్యింది? రాహుల్‌గాంధీ ఈ లాజిక్ మిస్ అయినా ప్రజలు మిస్ కారు.

ప్రతిపక్ష నేతలు ఎవరైనా అధికార పార్టీ మీద పోరాడతారు. కానీ మన దేశ రాజకీయాల్లో ప్రతిపక్ష నేత మాత్రం భిన్నం. ఆయన ఎన్నికల కమిషన్‌ను టార్గెట్ చేస్తూ ఉంటారు. కర్ణాటకలోని మహదేవపురా అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయన్నారు. ఎన్నికల సంఘం రాహుల్‌గాంధీ ప్రకటించినవి వాస్తవాలేనని చెప్పి ఫిర్యాదు చేయమని కోరింది. ధ్రువీకరించి అఫిడవిట్‌లా ఇవ్వాలని కోరింది. కానీ ఆ పనికి రాహుల్ సిద్ధంగా లేరు.

మహదేవపురాలో అసెంబ్లీ నియోజకవర్గంలో ఉన్న 6.5 లక్షల మంది ఓటర్లలో లక్ష ఫేక్ అని రాహుల్ అన్నారు. మహదేవపురా అసెంబ్లీ నియోజకవర్గం బెంగళూరులో భాగం. అది పూర్తి స్థాయిలో పట్టణ ప్రాంతం. బెంగళూరు అంటే ఉపాధి కేంద్రం. దేశం నలుమూలల నుంచి వచ్చి అక్కడ స్థిరపడతారు. ఓటర్లుగా నమోదు చేసుకుంటారు. తమ సొంత ప్రాంతాల్లోనూ నమోదు చేసుకుంటారు. ఓటర్ జాబితాలో ఉండే ఇలాంటి తప్పిదాల వల్ల మెట్రో సిటీల్లో యాభై శాతం కూడా పోలింగ్ జరగదని చెబుతూంటారు. ఎందుకంటే ఓటు నమోదు చేసుకుని పోయినవాళ్లు ఆ సంగతి మర్చిపోతారు. ఇంకో చోట ఓటు నమోదు చేసుకుంటారు. ఇక్కడ విచిత్రం ఏమిటంటే ఓట్ల చోరీ అంటూ మాట్లాడుతున్న రాహుల్ బిహార్‌లో ఇలాంటి అక్రమాల్ని తొలగించేందుకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ను వ్యతిరేకిస్తున్నారు.



భారత ప్రజాస్వామ్యానికి విశ్వాసమే పునాది. ఆ పునాదిని కాపాడేది ఎన్నికల సంఘం. ఆ ఎన్నికల సంఘం విశ్వసనీయతను దెబ్బతీయడానికి రాహుల్‌గాంధీ ఓటర్ల జాబితాలో ఉండే చిన్న చిన్న తప్పిదాలను భూతద్దంలో చూపించేందుకు ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ వారసుడిగా ఇప్పటి వరకూ ఆ పార్టీకి ఒక్క విజయాన్నీ అందించలేని తన అసహాయతను, వైఫల్యాన్ని ఎన్నికల సంఘంపై రుద్దాలనుకుంటున్నారు.

మహదేవపురాలో ఉన్న సమస్య అన్ని రాష్ట్రాల్లో ఉంది. దీన్ని సరి చేయాలని అందరూ డిమాండ్ చేస్తున్నారు. బిహార్‌లో ఈసీ చేస్తున్నది కూడా అదే. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) చేసి ఓటర్ల జాబితాను సంస్కరిస్తున్నారు. కానీ బిహార్‌లో ఓటర్లను తీసేస్తున్నారని గగ్గోలు పెడుతున్న రాహుల్ ఇప్పుడు ఓటర్ల జాబితాలో మూడు, నాలుగు ఎంట్రీలు ఉన్నాయని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఓటర్ల జాబితాలను పూర్తి స్థాయిలో సంస్కరించేందుకు దేశమంతా ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టాలనే డిమాండ్‌ను రాహుల్ గాంధీ చేయాల్సి ఉంది. ఈ సమస్యకు పరిష్కారం పూర్తి స్థాయిలో ఓటర్ కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేయడం. గతంలో ఇలాంటి ప్రయత్నం జరిగినప్పుడు రాహుల్‌గాంధీ అడ్డుకున్నారు. సుప్రీంకోర్టులో కేసులు వేసి తమ పార్టీకి చెందిన లాయర్లతో వాదింపచేశారు. చివరికి అనుసంధానం చేయకుండా చేశారు.

ఆరోపణలు చేయడం, తరువాత రాజ్యాంగ వ్యవస్థకు క్షమాపణలు చెప్పడం ప్రతిపక్ష నేతకు పరిపాటిగా మారింది. నిన్నటి వరకూ రాహుల్‌గాంధీ ఈవీఎంలను నిందించేవారు. ఇప్పుడు హఠాత్తుగా ఈవీఎంల గురించి మరిచిపోయారు. ఓటర్ల జాబితాలను తెరపైకి తెచ్చారు. ఓటములకు కారణాలు వెతుక్కోవడంలో ఉండే సూక్ష్మబుద్ధిని ఓటమికి కారణమైన పద్ధతులను మార్చుకోవడంలో ఎందుకు చూపించరో అర్థం కాదు. హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లో ఎగ్జిట్ పోల్స్‌కు భిన్నంగా ఫలితాలు వచ్చాయని, అవే తన వాదనకు రుజువు అని రాహుల్ అంటున్నారు. అయితే పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఎగ్జిట్ పోల్స్ బీజేపీ కూటమికి నాలుగు వందల సీట్లు వస్తాయని అంచనా వేశాయి. కాంగ్రెస్ పార్టీకి మరోసారి ప్రధాన ప్రతిపక్ష హోదా రాదని లెక్కలు చెప్పాయి. కానీ ఏం జరిగింది. కాంగ్రెస్ పార్టీ 99 స్థానాల్లో విజయం సాధించింది కదా. మరి ఈ ఫలితాలపై తమకు అనుమానాలు ఉన్నాయని ఎందుకు అనడం లేదు? ఈవీఎంలపై, ఓటర్ల జాబితాలపై నమ్మకం లేకపోతే తెలంగాణ ఎన్నికల ఫలితాలనూ రిజెక్ట్ చేయాలి. ఎందుకంటే అంతకుముందు పదేళ్లపాటు తెలంగాణలో జరిగిన ఏ ఒక్క ఉపఎన్నికలోనూ కాంగ్రెస్ పార్టీ డిపాజిట్లు దక్కించుకోలేకపోయింది. సాధారణ ఎన్నికల్లో అయితే చెప్పాల్సిన పని లేదు. అంతదాకా ఎందుకు 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ఏడాది ముందట జరిగిన మునుగోడు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ డిపాజిట్ కోల్పోయింది. మరి ఏడాదిలో ఎలా అధికారంలోకి వచ్చింది?

భారత ప్రజాస్వామ్యానికి విశ్వాసమే పునాది. ఆ పునాదిని కాపాడేది ఎన్నికల సంఘం. ఆ ఎన్నికల సంఘం విశ్వసనీయతను దెబ్బతీయడానికి రాహుల్‌గాంధీ ఓటర్ల జాబితాలో ఉండే చిన్న చిన్న తప్పిదాలను భూతద్దంలో చూపించేందుకు ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ వారసుడిగా ఇప్పటి వరకూ ఆ పార్టీకి ఒక్క విజయాన్నీ అందించలేని తన అసహాయతను, వైఫల్యాన్ని ఎన్నికల సంఘంపై రుద్దాలనుకుంటున్నారు.

"నిజమైన భారతీయుడివైతే ఇలాంటి వ్యాఖ్యలు చేయరు" అని మన దేశాన్ని కించపరిచేలా రాహుల్ చేసిన వ్యాఖ్యలను ఉద్దేశించి సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ డౌట్ ఇప్పుడు దేశ ప్రజలందరికీ వస్తోంది. రాహుల్ నిజమైన భారతీయుడైతే మన దేశ ప్రజాస్వామ్య పునాదులపై ఎందుకు కుట్ర చేస్తారు? అర్థంపర్థం లేని ఆరోపణలతో ఎందుకు ఈసీపై దాడి చేస్తున్నారు? దేశమే టార్గెట్‌గా రాహుల్ చేస్తున్న కుట్రను భగ్నం చేయాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉంది.

● యస్. విష్ణువర్ధన్ రెడ్డి
బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఎన్నికల సంఘం స్పందిస్తే బాగుండేది!

బిహారులో ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితా సవరణల్లో భాగంగా నిర్వహిస్తున్న 'స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూ'లో 'ఓటు చోరీ' జరుగుతోందని, దాన్ని సరిదిద్దాలని కోరుతూ మూడు వందల మంది ప్రతిపక్ష ఎంపీలు ఢిల్లీలో నిరసన ర్యాలీ చెయ్యడం ప్రాముఖ్యత కలిగిన వార్త. వారు తమను కలిసేందుకు ఎన్నికల కమిషన్ అనుమతి ఇస్తే సబబుగా ఉండేది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ గత కొంత కాలంగా బీహారు అంశమే కాకుండా, గత సార్వత్రిక ఎన్నికల్లో అక్రమాలు జరిగినట్లు కొన్ని ఆధారాలతో బలంగా చెప్తున్నారు. కర్ణాటకలో ఒక పార్లమెంటు నియోజకవర్గంలో లక్ష ఓట్లకు పైగా మతలబు జరిగినట్లు, అలాంటి ఉదంతాలు దేశవ్యాప్తంగా ఉన్నట్లు, తద్వారా అధికార పక్షానికి మేలు జరిగినట్లు తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణల తీవ్రత దృష్ట్యా ఎన్నికల కమిషన్ సందేహ నివృత్తి చేయాల్సింది. సరైన రుజువులతో ఆయన వాదనని పూర్వపక్షం చేసి ఉంటే దేశ ప్రజలకు మంచి సందేశం ఇచ్చినట్లు ఉండేది. పైగా అలా చెయ్యడం దాని బాధ్యత కూడా. దురదృష్టవశాత్తూ ఎన్నికల సంఘం ఆ దిశగా ఆలోచిస్తున్నట్లు కనబడడం లేదు. ఒక రాజ్యాంగ సంస్థ తన బాధ్యత పట్ల ఏ రూపంలో విమర్శ ఎదురైనా, దాన్ని ఒక అవకాశంగా తీసుకుని ప్రజల దృష్టిలో తన నిబద్ధతను చాటిచెప్పేలా ప్రవర్తించాలి. అడిగింది రాహుల్‌గాంధీనా లేక సామాన్య పౌరుడా అన్నదానితో సంబంధం లేకుండా 'ఇదీ, నా సూటి జవాబు' అన్న రీతిలో స్పందించాలి. ప్రస్తుతం అడుగుతున్నది ఒక రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్నవారు – లోక్‌సభలో ప్రతిపక్ష నేత – అయినప్పుడు, మరింత స్పష్టతతో దేశ ప్రజలకి జవాబు ఇవ్వాలి. కానీ జరుగుతున్నది అలా లేదు. రాహుల్ గత ఎన్నికల్లో సందేహాస్పద ఓటర్ల జాబితా డిజిటల్ రూపంలో అడుగుతున్నారు– దాన్ని ఇవ్వడం లేదు. దొంగ ఓట్లు, ఒకే చిరునామాతో ఉన్న డజన్ల ఓట్లు, డూప్లికేట్‌వి... ఇలాంటి అవకతవకలు లక్షల్లో నమోదైనట్లు తనకు ఉన్న ఆధారాలు చూపిస్తున్నారు – వాటికి జవాబు లేదు. పైగా కర్ణాటకలో ఇలా జరిగిందని రాహుల్ చెప్పినప్పుడు అలాంటి అవకాశం లేదని చెప్పకుండా 'అదేదో అఫిడవిట్ ద్వారా అడగమని' జవాబు ఇచ్చారు. దీన్నే అసలు వదిలి కొసరు పట్టుకోవడం అంటారు. రాహుల్ ఆరోపణల వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉండొచ్చు. అది అప్రస్తుతం. తన బాధ్యత పట్ల ఒక అనుమానం లేవనెత్తినప్పుడు ఎన్నికల కమిషన్ సవ్యంగా స్పందించాలి. ప్రతీ పౌరుడికీ తన ఓటు హక్కును స్వేచ్ఛగా వాడుకొనే పరిస్థితిని కల్పించాలి. అక్రమాలతో ప్రజాతీర్పు తారుమారు కాకుండా చూసే బాధ్యత కూడా దానిదే. అలా చూడడమే గాక, ఆ నమ్మకాన్ని పౌరునిలో కలిగించాలి. అది ప్రజల పట్ల, దేశం పట్ల రాజ్యాంగబద్ధమైన బాధ్యత.

– డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ

జరగాల్సింది 'లొంగుబాటు' కాదు, దిద్దుబాటు!

దండకారణ్యంలో, ఆదివాసీల తరఫున పోరాడుతున్న మావోయిస్టు పార్టీ నాయకుల్నీ, కార్యకర్తల్నీ, వారిని అనుసరిస్తున్న ఆదివాసీలనూ 2026 మార్చి చివరికల్లా మట్టుపెడతామని కేంద్ర హోం మంత్రి ప్రతిజ్ఞ చేసిన సంగతి తెలిసిందే! ఆ ప్రతిజ్ఞ ప్రకారమే గత ఏడాదిగా కొన్ని వందల మంది మావోయిస్టుల్ని ప్రభుత్వ సాయుధ బలగాలు చంపుతూ వస్తున్నాయి.

ఈ పరిస్థితికి స్పందించిన కొందరు మేధావులు, కొన్ని సూచనలు చేస్తున్నారు. 'మావోయిస్టులు చర్చలకు సిద్ధం అంటున్నారు కాబట్టి, ప్రభుత్వం, వారితో చర్చలు జరిపి, ఒక శాంతియుతమైన పరిష్కారానికి రావాలి' అన్నది ఒక సూచన. 'వాస్తవ పరిస్థితుల్ని అర్థం చేసుకుని, మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి వచ్చి, "ప్రజాస్వామ్యబద్ధంగా" పనిచేయాలి' అన్నది మరో సూచన. ఈ రెండు సూచనలూ, ఆదివాసీల పట్లా, వారికోసం ప్రాణాలు పణంగా పెడుతున్న మావోయిస్టుల పట్లా, వర్గాతీతమైన మానవతా దృక్పథంతో చేసినవే అనుకోవాలి. ఈ సూచనలకి ప్రభుత్వం నుంచి వచ్చే జవాబు ఏమిటంటే: 'శాంతి చర్చలు– అనే ప్రశ్నే లేదు. ఆయుధాలతో సహా ప్రభుత్వానికి లొంగిపోయే వరకూ ప్రభుత్వం మావోయిస్టుల్ని వేటాడుతూనే వుంటుంది' – అని!

అయితే, ఇప్పటి వరకూ ఎవ్వరూ కూడా, ప్రభుత్వం కోరుతున్నట్టు, 'ఆయుధాలతో సహా లొంగిపొమ్మని' మావోయిస్టులకు సూచించలేదు. కానీ, ఇప్పుడు, నాకు తెలిసి మొదటిసారి, అలా లొంగిపొమ్మని, ఇనుకొండ తిరుమలి సూచించారు. ('అరణ్యవాసంలోనే విప్లవ ప్రభాతం' –ఆంధ్రజ్యోతి, జులై 25). తిరుమలి, ఇలా అన్నారు: 'నక్సలైట్లు తమ ఆయుధాలతో రాజ్యానికి లొంగిపోయి, పునరావాసం పొందడానికి ప్రయత్నించాలి. లొంగిపోయిన నక్సల్స్‌కు సౌకర్యవంతమైన పునరావాసం కల్పిస్తామనే హామీతో వారిని పార్లమెంటరీ ప్రజాస్వామిక మార్గం వైపు మళ్ళించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలి'– అని!

'మార్క్సు సిద్ధాంతాన్ని మరింతగా అధ్యయనం' చేయడానికి, ప్రసిద్ధి చెందిన 'జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయానికి' వెళ్ళి, 'వర్గ సంబంధాలనూ, వర్గ పోరాటాలనూ మరింత లోతుగా అధ్యయనం' చేశానని చెప్పుకున్న చరిత్రకారుడు తిరుమలి– ఇప్పటివరకూ ఎవ్వరూ ఇవ్వని సలహా ఇవ్వడం వింతగా వుంది. పిల్లీ ఎలకా అని పోల్చదగ్గ, ప్రభుత్వానికీ నక్సలైట్లకూ, అంటే, పరస్పర శత్రు వర్గాలకూ, సమన్వయం సాధ్యం అని, 'వర్గ పోరాటాల గురించి మరింత లోతుగా అధ్యయనం' చేసిన వారెవరైనా భావించవచ్చా?

మార్క్సు సిద్ధాంతం చదవని తిరుగుబాటుదారులు కూడా ఆ పని చెయ్యరని చరిత్రకారుడైన తిరుమలి చరిత్రలో చదవలేదా? ఉదాహరణకి, ఇటలీ వలస పాలన నించి విముక్తి కోసం లిబియా ప్రజలు ఎన్నో ఏళ్ళపాటు పోరాటం చేశారు. ఇటలీ సామ్రాజ్యవాదులతో యుద్ధంలో వేలమంది చనిపోయారు. ఇరవై సంవత్సరాలకు పైగా, గెరిల్లా యుద్ధ తంత్రంతో, ఇటలీ సైన్యాన్ని ఎదుర్కొన్న అగ్రనాయకుడు 'ఉమర్ ముఖ్తార్'ను ఇటలీ పట్టుకుని, 'లొంగిపో, లేకపోతే ఉరిశిక్షే!' అంటే, అతనేమన్నాడో తెలుసా?– 'మేము ఎన్నడూ లొంగిపోము! మేము గెలుస్తాము! లేదా, చచ్చిపోతాము! దాంతో అంతా ఆగిపోతుందనుకోకండి! మీతో పోరాడడానికి మా తర్వాత ఇంకో తరం! ఆ తర్వాత ఇంకో తరం! ఆ తరవాత ఇంకో తరం..." అన్నాడు. ('ఒక వీరుడు మరణిస్తే, వేనవేలు ప్రభవింతురు' అని, తెలంగాణా రైతాంగ పోరాటానికి సంబంధించిన ఒక కవితలో ఉన్నట్టు!). ఇలా అన్న ఉమర్

నక్సలైట్లకి దిద్దుబాటని చూపకుండా, లొంగుబాటని చూపి, ఆ బాట ద్వారా పునరావాసం కోసం కూడా ప్రయత్నించమంటున్నారు ఇనుకొండ తిరుమలి. కానీ, నక్సలైట్ ఉద్యమంలోకి వచ్చేవారు, పోలీసు శాఖలోకి వచ్చినట్టు, ఒక ఉద్యోగానికి రారు కదా!?



ముఖ్తార్, మార్క్సు సిద్ధాంతాన్ని 'మరింతగా' కాదు కదా, కనీసంగా కూడా అధ్యయనం చేసినవాడు కాదు. (అతను లొంగకపోయేసరికి, 1931లో, అతనికి 73 ఏళ్ళ వయసులో ఇటలీ సైనికాధికారులు ఉరితీశారు.)

ఆదివాసీలకు గానీ, వారికోసం నిలబడ్డ మావోయిస్టులకు గానీ, వారి శ్రేయోభిలాషులు చెప్పవలసింది– లొంగుబాటు కాదు, దిద్దుబాటు! ఉదాహరణకి, తిరుమలి తన వ్యాసంలో, 'నక్సలైట్ ఉద్యమం పరిపూర్ణ ప్రజా ఉద్యమంగా మారలేదు' అన్నారు. అలాంటప్పుడు, 'లొంగిపొండి' అని సలహా ఇవ్వడం కాక, 'మీ తప్పులు దిద్దుకోండి! మీ ఉద్యమాన్ని పరిపూర్ణ ప్రజా ఉద్యమంగా మార్చుకునేలా, మీ అవగాహననీ, ఆచరణనీ దిద్దుకోండి!' అని చెప్పాలి. అయితే, ఆ సలహాల్ని మావోయిస్టు పార్టీ గానీ, ఆ పార్టీని ఎటువంటి విమర్శా లేకుండా సమర్థించేవారు గానీ, అంగీకరిస్తారా, లేదా అనేది వేరే విషయం.

నక్సలైట్లకి దిద్దుబాటని చూపకుండా, లొంగుబాటని చూపి, ఆ బాట ద్వారా పునరావాసం కోసం కూడా ప్రయత్నించమంటున్నారు ఇనుకొండ తిరుమలి. కానీ, నక్సలైట్ ఉద్యమంలోకి వచ్చేవారు, పోలీసు శాఖలోకి వచ్చినట్టు, ఒక ఉద్యోగానికి రారు కదా! ప్రభుత్వం, లొంగిపోయిన నక్సలైట్లకి, 'సౌకర్యవంతమైన పునరావాసం' కల్పించాలి– అని తిరుమలి సలహా! పౌరులందరికీ, అన్ని రకాల న్యాయబద్ధమైన సౌకర్యాలూ ప్రభుత్వాలు కల్పిస్తే ఇక ఉద్యమాల అవసరం ఏముంటుంది? తిరుమలి తన వ్యాసంలో కొన్ని అవాస్తవాలు కూడా రాశారు: 'గ్రామాలలో రైతులు వాణిజ్య పంటలు సాగుచేసి ధనవంతులయ్యారు' అన్నారు. మరి, రైతుల ఆత్మహత్యలు వందల వేల సంఖ్యలో ఎందుకు జరుగుతున్నట్టు? పైగా, ఎక్కువ ఆత్మహత్యలు, పత్తి వంటి వాణిజ్య పంటలు సాగుచేసిన వారిలోనే కనిపిస్తాయి. 2021లో, నందకిశోర్ కన్నూరి, శుశ్రుత్ జాదవ్ అనే ఇద్దరు పరిశోధకులు జరిపిన ఒక సర్వే ప్రకారం, 1995కీ–2018కీ మధ్య కాలంలో, భారతదేశంలో, 4 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అంటే, రోజుకి సగటున 48 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నమాట! వీరిలో మెజారిటీ రైతులు 'వెనకబడిన కులాలకు' చెందినవారేనట!

అయినా, ఎవరైనా, ఎలా ధనవంతులవుతారు? 'మార్క్సు సిద్ధాంతాన్ని మరింతగా అధ్యయనం' చేసిన వారు చెప్పవలసింది, 'ఇతరుల శ్రమని దోపిడీ చేయడం ద్వారానే ధనవంతులవుతారు' అని! తిరుమలి చేసిన ఇంకో విచిత్రమైన వాదన: 'పరిశ్రమల ప్రైవేటీకరణతో కార్మిక వర్గం సైతం పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ఆదరించింది' అట! మరి, విశాఖ ఉక్కు కర్మాగారం వంటి దాన్నీ, సింగరేణి వంటి దాన్నీ, ఇంకా అనేక ప్రభుత్వ రంగ సంస్థల్నీ ప్రైవేటుపరం చెయ్యొద్దు మొర్రో అని కార్మిక సంఘాలు మొత్తుకోవడం సంగతి ఏమిటి? అదేమీ పట్టించుకోకుండా, 'భారతీయ సమాజం పెట్టుబడిదారీ విధానాన్ని అంగీకరించింది' అని తేల్చారు. భారతీయ సమాజంలో, పెట్టుబడిదారీ విధానం ఉన్నదనడమూ, దాన్ని తీవ్ర స్థాయిలో వ్యతిరేకించే కార్మిక వర్గ ఉద్యమాలు లేవనడమూ వేరు. అంతేగానీ, ఆ విధానాన్ని సమాజం మొత్తం అంగీకరించిందనడం వాస్తవం కాదు!

ఇప్పుడున్న 'ప్రజాస్వామ్య వ్యవస్థలు, సామ్యవాద సమాజ నిర్మాణానికి ఆస్కారం కల్పించడం సంశయాస్పదమే' అని ఒక పక్కన అంటూనే, చిట్టచివరి వాక్యంలో, 'పార్లమెంటరీ ప్రజాస్వామిక మార్గం వైపు నక్సలైట్లను మళ్ళించ'మని ప్రభుత్వానికి తిరుమలి సలహా ఇస్తున్నారు. 'వర్గ సంబంధాలనీ, వర్గపోరాటాలనీ మరింత లోతుగా అధ్యయనం' చేసిన వారెవరైనా ప్రభుత్వానికి ఇలాంటి సలహా ఇవ్వగలరా?

◆ నౌరోజీ

ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

గురువారం 14 ఆగస్టు 2025



● గుంటూరులో కంకరగుంట అండర్ పాస్‌లోకి చేరిన వర్షపు నీరు

నేడు పాఠశాలలకు సెలవు

భారీవర్షాల నేపథ్యంలో, విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాఠశాలలకు గురువారం సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. అన్ని యాజమాన్య, ప్రైవేట్ పాఠశాలలకు సెలవు వర్తిస్తుందని చెప్పారు.



నీట మునిగిన చుట్టుగుంట రైతు బజార్

వర్ష బీభత్సం



జిల్లా వ్యాప్తంగా ముంచెత్తిన వాన

- కుంభవృష్టితో జన జీవనం అస్తవ్యస్తం
- ఉప్పొంగిన వాగులు.. స్తంభించిన రాకపోకలు
- లోతట్టు ప్రాంతాలు సహా పలు గ్రామాలు జలదిగ్బంధం

ఆకాశానికి చిల్లుపడిందా.. మేఘాలు నీటిని కుమ్మరిస్తున్నాయా.. అన్నట్లుగా మంగళవారం అర్ధరాత్రి, బుధవారం సాయంత్రం జిల్లాలో వర్ష బీభత్సం సృష్టించింది. గంటల తరబడి ఏకధాటిగా కురిసిన వర్షంతో జనం వణికిపోయారు. కుండపోత వర్షంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. జిల్లా అంతటా భారీ వర్షాలు కురిశాయి. కొన్ని మండలాల్లో కుండపోత వర్షం కురిసింది. జిల్లా కేంద్రంతో పాటు పలు పట్టణాలు, ప్రధాన రహదారులను వాన నీరు ముంచెత్తింది. మంగళవారం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షంతో నిద్రలో ఉన్న వారు కూడా వణికిపోయారు. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో ఏమి జరుగుతుందోనని ప్రజలు భీతిల్లిపోయారు. బుధవారం ఉదయం కొన్ని ప్రాంతాల్లో తెరిపిచ్చినా సాయంత్రం మళ్లీ వరుణుడు వణికించాడు. తెరిపి ఇవ్వకుండా కురిసిన వర్షంతో వాగులు, డ్రెయిన్లు, కాల్వలు పొంగి ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. పట్టణాల్లోని శివారు కాలనీలు, లోతట్టు ప్రాంతాలతో పాటు పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకు న్నాయి. పలు ప్రాంతాల్లో రహదారులపై వర్షపు నీరు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుం డటంతో వాహనాల రాక పోకలు స్తంభించిపోయాయి. వాన నీటి ముంపుతో పంట పొలాలు సైతం తటాకాలను మరి పిస్తున్నాయి. పలు మండలాల్లో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైంది. మరో మూడు రోజులు ఇదేరీతిన వర్షాలు కురు స్తాయన్న వాతావరణ శాఖ అంచనాలు అటు రైతులను, ఇటు ప్రజలను మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి.



● గుంటూరు మార్కెట్‌లో పరిస్థితి



ఆర్టీసీ గ్యారేజ్‌లో చేరిన వర్షపు నీరు

మరిన్ని కథనాలు 8లో..

ఇద్దరు మృతి



మృతి చెందిన నేలపాటి భరత్

రాజుపాలెం మండలంలోని కొండమోడు సమీపంలోని కోతుల వాగులో 45 ఏళ్ల వ్యక్తి మృతదేహం బుధవారం కొట్టుకువచ్చింది. ఇతడి వివరాలు తెలియ లేదు. నంబూరులో వాగు ఉధృతికి అదే గ్రామానికి చెందిన నేలపాటి భరత్(14) గల్లంతయ్యాడు. స్థానిక జడ్పీ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదుతున్న బాలుడు వాగును చూసేందుకు వెళ్లి జారిపడి కొట్టుకుపోగా గజ ఈతగాళ్లు మృతదేహాన్ని వెలికితీశారు.



గుర్తు తెలియని మృతదేహం

పెదకూరపాడు - అబ్బరాజుపాలెం గ్రామాల మధ్యలోని లోలెవల్ చప్టా వద్ద తెల్లవారు జామున ద్విచక్ర వాహనంపై వెళుతున్న సాగర్, సన్నీ అనే ఇద్దరు యువకులు వాగులో కొట్టుకుపోయారు. వారిని పోలీసులు రక్షించారు.



● లాం చప్టా వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కొండవీటి వాగు



ఏటి అగ్రహారం 15 లైనులో వర్షపు నీరు

జిల్లా.. జలదిగ్బంధం

కుంభవృష్టి.. పోటెత్తిన వరద

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ 0863 - 2234014

(గుంటూరు, తెనాలి - ఆంధ్రజ్యోతి)

బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లా అంతా జలదిగ్బంధంగా మారింది. అనేక ప్రాంతాల్లో పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. దీంతో జిల్లా కేంద్రం గుంటూరుతో పాటు పలు పట్టణాలు, గ్రామాల్లో ఇళ్లలోకి నీరు ప్రవేశించడంతో ప్రజలు తీవ్రంగా ఇక్కట్లకు గురయ్యారు. ఇళ్లలో చేరిన నీటిని బయటకు పంపించేందుకు అష్టకష్టాలు

(మిగతా 6వ పేజీలో)




కుంచనపల్లిలో నీటమునిగిన ఆకు కూరలు



పొన్నూరు ప్రాంతంలో నీట మునిగిన పంట పొలాలు

నిండుకుండల్లా జలాశయాలు

ఇప్పటికే జలాశయాలు నిండుకుండల్లా ఉన్నాయి. రెండు రోజులుగా కురుస్తోన్న భారీ వర్షాలతో ఎగువ నుంచి వరద పోటెత్తుతోంది. నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి 2,28,141 క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో బుధవారం ప్రాజెక్ట్ అధికారులు 26 క్రస్ట్‌గేట్లను తెరిచి దిగువకు నీటిని విడుదల చేశారు. భారీ వర్షాలకు ఎత్తిపోతల జలకళను సంతరించుకుంది. 70 అడుగుల ఎత్తు నుంచి నీరు కిందకు దుముకుతూ పర్యాటకులను ఆకర్షిస్తోంది. ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది పరవళ్లు తొక్కుతోంది. దీంతో అధికారులు బ్యారేజి 70 గేట్లను పూర్తిగా ఎత్తి వరదనీటిని సముద్రంలోకి విడుదల చేశారు.



ప్రకాశం బ్యారేజి 70 గేట్లు ఎత్తి నీటి విడుదల

హార్బర్‌లో 3వ నెంబర్ హెచ్చరిక

రేపల్లె: బంగాళాఖాతంలో అల్పపీడనం వాయుగుండంగా మారడంతో భారీ వర్షాలు పడుతున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా ఉంది. ఈ క్రమంలో నిజాంపట్నం హార్బర్‌లో 3వ నెంబర్ ప్రమాద హెచ్చరికను ఎగురవేసినట్లు పోర్టు అధికారులు తెలిపారు. సముద్రం లో వేట చేసే పరిస్థితి లేకపోవడంతో మత్స్యకారులు హార్బర్‌కు చేరారు. మత్స్యకారలు వేటకు వెళ్లరాదని అధికారులు సూచించారు.



హార్బర్‌లో 3వ నెంబర్ ప్రమాద హెచ్చరిక

టీడీపీ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

- వైసీపీ నేత అంబటి మురళిపై ఫిర్యాదు

6

ఆశలు వెల్లి విరిసేలా

- ఆశా వర్కర్లపై కూటమి ప్రభుత్వం వరాల జల్లు
- పూర్తి వేతనంతో కూడిన ఆరునెలల ప్రశూతి సెలవులు
- 62 ఏళ్ళ వరకూ విధులు

బాల్యం ఆరంభ దశలోనే బలమైన పునాది పడాలి

- స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి

జీఎంసీలో ప్రావిడెంట్ ఫండ్ కుంభకోణం

- ఉద్యోగి దుర్గాభవానీకి షోకాస్ నోటీసులు జారీ ● అదనపు కమిషనర్ చల్ల ఓబులేసు

అన్ని రంగాల్లో రాణించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలి

- వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ

8

అమరావతిలో బసవతారకం హాస్పటల్

భూమి పూజ చేసిన చైర్మన్ బాలకృష్ణ ● హాజరైన స్పీకర్, మంత్రులు

తుళ్లూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి) : అమరావతిలో బసవతారకం ఇండో - అమెరికన్ హాస్పటల్ నిర్మాణానికి రాజధాని గ్రామం తుళ్ళూరు వద్ద బుధవారం ఉదయం ఆసుపత్రి చైర్మన్ సినీ నటుడు బాలకృష్ణ భూమి పూజనిర్వహించారు. ఈ సందర్భంగా మాటాడుతూ, అంధ్రప్రదేశ్ రాజధానిలో అత్యాధునిక క్యాన్సర్ కేర్ క్యాంపస్ అభివృద్ధి చేస్తోందన్నారు ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ ద్వారా భవిష్యత్తులో అధిక నాణ్యత క్యాన్సర్ చికిత్సను ఇతర ప్రాంతాలకు విస్తరించడమే కాకుండా అవసరమైన చోట ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చి ఇన్సిస్టిట్యూట్ నిబద్ధతతో పని చేస్తుందన్నారు. 21 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేస్తున్న ఈ ఆసుపత్రి 500 పడకల సామర్థ్యంతో 750 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్నామన్నారు. 2028 నాటికి ఆపరేషన్లు ప్రారంభమవుతాయనే అంచనాతో ఉన్నామన్నారు. రెండో విడతలో ఆసుపత్రిని 1000 పడకలకు పెంచుతామన్నారు. సంస్థకు దాతలు, భాగస్వాములు, శ్రేయోభిలాషులు , కమ్యూనిటీ సభ్యులు అందిస్తున్న నిరంతరాయమైన మద్దతు తెలిపిన అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని బాలకృష్ణ అన్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా శాసనసభ స్పీకర్ సీహెచ్ అయ్యన్న పాత్రుడు, మున్సిపల్ శాఖ మంత్రి పీ నారాయణ, ఆరోగ్య శాఖ మంత్రి వై సత్య కుమార్, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, మాదిగ వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్ పర్సన్, ఉండవల్లి శ్రీదేవి, అంధ్ర ప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, ఛైర్మన్, అమరావతి డెవలెప్మెంట్ కార్పొరేషన్ కమిషనర్ లక్ష్మీ పార్థసారథి, సీఆర్డీఏ కమషనర్ కన్నబాబు, డాక్టర్ దత్తాత్రేయుడు నోరి, డాక్టర్ పోలవరపు రాఘవరావు, డాక్టర్ గడ్డం దశరథ రామి రెడ్డి, శ్రీ జెయస్ ఆర్ ప్రసాద్, నారా బ్రాహ్మణి ట్రస్టు బోర్డు సభ్యులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.



శిలాఫలకం వద్ద మాట్లాడుతున్న బాలకృష్ణ, డాక్టర్లు

మంగళగిరిలో బ్రాహ్మణి

- చేనేతల సాధక బాధకాలపై ఆరా
- ఘనస్వాగతం పలికిన టీడీపీ శ్రేణులు

8



కాజ కుట్టు శిక్షణా కేంద్రంలో మహిళలతో మాట్లాడుతున్న బ్రాహ్మణి

జిల్లా.. జలదిగ్బంధం

(5వ పేజీ తరువాయి)

పడుతున్నారు. కృష్ణా డెల్టా ప్రాంతాన్ని ఓ పక్క వర్షం ముంచేస్తుంటే, మరోపక్క వరద ముంచుకు వస్తోంది. లంక గ్రామాలు భయం గుప్పిట బిక్కుబిక్కుమంటుంటే, వర్షం వీడడంలేదు. మంగళవారం రాత్రి తెనాలి, దుగ్గిరాల, మంగళగిరిలో అత్యధిక



కాజ టోల్‌గేట్ వద్ద వరద ప్రవాహం

వర్షపాతం కలవరపెట్టింది. కృష్ణా నదికి వరద భారీగా వస్తుండటంతో ప్రకాశం బ్యారేజి నుంచి 3.42 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదిలేశారు. నదిలో గురువారానికి వరద ప్రవాహం 4 లక్షల నుంచి 5 లక్షల క్యూసెక్కుల వరకు పెరిగే పరిస్థితి ఉందని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. ఇదే జరిగితే 15 అగులకు పైగా వరద ప్రవాహం నదిలో ప్రవహిస్తోంది. దీనికితోడు వర్షాల కారణంగా బ్యారేజి క్యాచ్‌మెంట్ ప్రాంతంలో పడిన వాన నీటి వరద కూడా పెరుగుతుండటంతో లంకల్లోని ప్రజలు భయం గుప్పిట్లో ఉన్నారు. భారీ వర్షాలతో మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల, తెనాలి, కొల్లిపర, పొన్నూరు, పెదకాకాని, మండలాల్లో వరద నీరు చేలపైపడి పంటలను ముంచేసింది. డ్రెయిన్లకు దగ్గర్లో ఉన్న చేలు సముద్రాన్ని తలపిస్తున్నాయి. డ్రెయిన్‌లు కూడా పొంగి ప్రవహిస్తుండటంతో చేలల్లోని ముంపు నీరు బయటకు పోవడానికి చాలా సమయం పడుతుండటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవల వెద పద్ధతిలో వేసిన వరి నాట్లున్న చేలల్లో అయితే పైరు కనిపిచటంలేదు.

నగరంలో నరకం..

గుంటూరులో ఆదరాబాదరాగా శంకర్‌విలాస్ ఆర్‌వోబీని కూల్చివేయడం.. ఇదే సమయంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకున్న నగరవాసులు నరకం చూస్తున్నారు. కంకరగుంట బ్రిడ్జిపైన ఇరువైపులా కిలోమీటర్‌కు పైగా దూరం పాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది. దీంతో వర్షంలో ప్రజలు అల్లాడిపోయారు. కంకరగుంట ఆర్‌యూబీ, మూడొంతెనల కిందకు నాలుగైదు అడుగుల ఎత్తులో వరదనీరు చేరడంతో ట్రాఫిక్‌కు అవాంతరం కలిగింది.

పీకలవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో నల్లపాడు వద్ద గుంటూరు - సత్తెనపల్లి మార్గంలో నడుం లోతు పైగా ప్రవాహంతో వాహనాల రాకపోలకు ఇబ్బంది కలిగింది. శ్రీరాంనగర్, శ్రీలక్ష్మీనగర్, రామిరెడ్డినగర్‌లోకి వరదనీరు ప్రవహించడంతో కాలనీల్లో నుంచి బయటకు రావడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చుట్టుగుంట వద్ద డ్రెయినేజీ పనుల కారణంగా వరదనీరు మార్కెటింగ్, వ్యవసాయ శాఖ కమిషనరేట్లు, మార్కెటింగ్ ఏడీ, డీడీ కార్యాలయాల ప్రాంగణాల్లోకి ప్రవహించింది. దాంతో ఉద్యోగులు విధులకు హాజరు కాలేకపోయారు. రైతుబజార్‌లోకి వరదనీరు చేరడంతో కూరగాయల వ్యాపారులు దుకాణాలు తీయలేకపోయారు. మురికిపేటలో అయితే ద్విచక్ర వాహనాలు మునిగిపోయే స్థాయిలో వరద ప్రవహించింది. నంబూరు వద్ద వరదనీరు రోడ్డు పైకి చేరడంతో ఆ గ్రామానికి రాకపోకలు తెగిపోయాయి.

తాడేపల్లిలోని పుష్కరకాలనీ, ఎల్ఎల్ కాలనీల్లోకి వరదనీరు చేరడంతో ప్రజలు నిరాశ్రయులయ్యారు.

చేబ్రోలులో అత్యధిక వర్షం..

జిల్లాలో అత్యధికంగా చేబ్రోలులో 23.46 సెం.మీటర్లు వర్షం కురిసింది. దుగ్గిరాలలో 22.58, మంగళగిరిలో 19.48, తెనాలిలో 17.84, తాడేపల్లిలో 10.64, పొన్నూరులో 14.42, కొల్లిపరలో 13.82, తాడికొండలో 22.5, పెదకాకానిలో 18.88, తుళ్లూరులో 18.02, గుంటూరు తూర్పులో 14.02, మేడికొండూరులో 14.02, గుంటూరు పశ్చిమలో 13.22, ఫిరంగిపురంలో 11.12, వట్టిచెరుకూరులో 8.96, ప్రత్తిపాడులో 6.54, పెదనందిపాడులో 6.24, కాకుమానులో 6.04 సెం.మీటర్లు వర్షపాతం నమోదైంది.

పునరావాస కేంద్రాలకు ప్రజలు

గుంటూరు సిటీ: జిల్లాలో కృష్ణా నది పరీవాహక గ్రామాల్లోని ప్రజలను, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించినట్లు మంత్రి వంగలపూడి అనితకు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. భారీ వర్షాలపై రాష్ట్ర సచివాలయం నుంచి మంత్రి అనిత నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ హాజరై జిల్లాలోని పరిస్థితులను వివరించారు. గుంటూరు చానల్ ఓవర్ ఫ్లో కారణంగా నంబూరులోని లోతట్టు కాలనీలో వరద నీటితో 150 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించామన్నారు. తాడికొండ మండలం గరికపాడు, బేతాజ్‌పురంలలో కొండవీటి వాగు పొంగి ప్రవహిస్తున్నందున 75 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించామన్నారు. కొల్లిపర మండలంలో పంట నష్టం అధికంగా ఉందన్నారు. తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో బోటు తీసుకుని రావడానికి వెళ్లిన ముగ్గురు మత్స్యకారులలో ఇద్దరు నీటి ప్రవాహానికి కొట్టుకుపోగా ఎస్‌డీఆర్ఎఫ్ బృందం ద్వారా వారిని రక్షించడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగాన్ని సిద్ధం చేశామని మంత్రి అనితకు కలెక్టర్ తెలిపారు. భారీవర్షాలు నేపథ్యంలో ప్రజల సహాయార్థం కలెక్టరేట్‌లో 0863- 2234014 నెంబరుతో 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ప్రజలు అత్యవసర సహాయం కోసం ఈ నెంబర్‌కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ భార్గవ్‌తేజ, డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, డీఆర్వో ఖాజావలి, ఆర్డీవో శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో జ్యోతిబసు, డీటీసీ సీతారామిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, ఉద్యాన శాఖ అధికారి రవీంద్ర, డీపీవో నాగసాయికుమార్, జేడీ పశుసంవర్ధక శాఖ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



తెనాలి-బుర్రిపాలెం మధ్య చేలల్లో వరదనీరు చేరి సముద్రాన్ని తలపిస్తున్న చిత్రం



జలదిగ్బంధంలో మిర్చి యార్డు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

టీడీపీ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

● వైసీపీ నేత అంబటి మురళిపై ఫిర్యాదు



ఆత్మహత్యాయత్నం చేసుకున్న పౌల్ రాజు స్టేట్మెంట్ రికార్డు చేస్తున్న రూరల్ పోలీసులు

పొన్నూరుటౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు మండలం ఆలూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త పౌలు రాజు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పొన్నూరు పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పౌలు రాజును బుధవారం రూరల్ పోలీసులు విచారించి స్టేట్మెంట్ రికార్డు చేశారు. ఆలూరు గ్రామానికి చెందిన పౌల్ రాజు అతని భార్య వెంకటేశ్వరమ్మ మధ్య ఇటీవల మనస్పర్థలు వచ్చాయి. దీంతో వెంకటేశ్వరమ్మ ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి వెళ్లి పౌల్‌రాజుపై ఫిర్యాదు చేసింది. అయితే తమ కుటుంబ తగాదాలను రాజకీయ లబ్ధి కోసం వాడుకొని భార్యాభర్తల మధ్య విభేదాల సృష్టించి వీటన్నింటిని స్థానిక ఎమ్మెల్యేకు ఆపాదించేలా వైసీపీ నాయకుడు అంబటి మురళీకృష్ణ ప్రయత్నిస్తున్నాడని పౌలు రాజు పోలీసులకు ఇచ్చిన స్టేట్మెంట్లో ఫిర్యాదు చేశాడు. తన భార్య చేసిన ఫిర్యాదు ఆధారంగా వైసీపీ నాయకుడు అంబటి మురళి రాజకీయపరంగా మాట్లాడిన మాటలను అతని అనుచరుడు అంబటి కృష్ణ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి తన పరువును బజారుకు ఈడ్చాడని ఇది తనను మానసికంగా కుంగ తీసిందని ఆవేదన వ్యక్తం చేస్తూ చీమల మందు తిన్నట్లు పోలీసులకు తెలిపారు. కేవలం కుటుంబ గొడవలను రాజకీయాల కోసం వాడుకొని వ్యక్తిగతంగా తనను లక్ష్యంగా చేయడం వల్లన ఆత్మహత్యాయత్నానికి పాల్పడినటు పౌలు రాజు వాపోయాడు. అంతేకాకుండా ధనుంజయ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తులు కూడా తమ భార్యాభర్తల మధ్య గొడవలు సృష్టించి విభేదాలు వచ్చేలా వ్యవహరిస్తున్నారని తన చావుకు వీరిదే బాధ్యత అని పౌల్‌రాజు పోలీసులకు తెలిపాడు. పౌల్ రాజు ఇచ్చిన స్టేట్మెంట్ ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారు.

సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్

CUB TRUST AND EXCELLENCE SINCE 1904

క్రెడిట్ రికవరీ మరియు మేనేజ్‌మెంట్ శాఖ
పరిపాలనా కార్యాలయము : నం. 24-B, గాంధీనగర్, కుంబకోణం - 612001. ఇ-మెయిల్ ID: crmd@cityunionbank.in. ఫోన్ : 0435-2432322, ఫ్యాక్స్ : 0435-2431746

SARFAESI చట్టం 2002 క్రింద రీ-టెండరు - సహిత - వేలం అమ్మకం ప్రకటన

రుణగ్రహీతలు/హామీదారులు: నం.1) M/s. సౌజన్య కాటన్ ట్రేడర్స్, నం. 63/3, C/o. శ్రీరామ్ కాటన్ జిన్నింగ్ మిల్స్, మహాలక్ష్మీపురం, ఏటుకూరు రోడ్, గుంటూరు-522003, నం.2) శ్రీ ఎన్. మందలపు ఆంజనేయులు తండ్రి నారాయణ, డి.నం. 11-4-34, రాజాగారితోట, 1వ లైన్, గుంటూరు-522002 మరియు శ్రీ ఎస్. మందలపు ఆంజనేయులు, తండ్రి నారాయణ, ఫ్లాట్ నం. 2సి, శ్రీనిలయము అపార్ట్‌మెంట్, కొత్తపేట పోలీస్ స్టేషన్ ఎదురుగా, గుంటూరు-522201, నం.3) శ్రీమతి ఎ. మందలపు పార్వతి, భర్త ఎస్. మందలపు ఆంజనేయులు, డి.నం. 11-4-34, రాజాగారి తోట, 1వ లైన్, గుంటూరు-522002, నం.4) శ్రీమతి సి. కమ్మ వెంకాయమ్మ, భర్త కమ్మ చిరంజీవి, డి.నం. 19-11-2, బోయపాటివారి వీధి, లాంచెస్టర్ రోడ్, సంగడిగుంట, గుంటూరు-522003 వారి నుండి 11-08-2025 నుండి చార్జి చేయబడే తదుపరి వడ్డీ, ఇతర ఖర్చులు, ఏవేని ఇతర బకాయితో కలిపి 10-08-2025 నాటికి రూ.1,58,17,727/- (రూపాయలు ఒక కోటి యాభై ఎనిమిది లక్షల పదిహేడు వేల ఏడు వందల ఇరవై ఏడు మాత్రమే) లను రాబట్టుకొనుటకు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002లోని రూలు 8(6) & 9 క్రింద, SARFAESI చట్టం 2002 క్రింద సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్‌కు తనఖాపెట్టిన దిగువ ఆస్తి/ఆస్తులు బ్యాంక్ అధీకృత అధికారిచే రీ-టెండరు- సహిత-బహిరంగ వేలంలో విక్రయించబడును.

మా బ్యాంక్‌కు తనఖా పెట్టిన స్థిరాస్తులు

షెడ్యూలు-A : (శ్రీ ఎస్. మందలపు ఆంజనేయులు తండ్రి నారాయణకు చెందిన ఆస్తి)
గుంటూరు జిల్లా, గుంటూరు సబ్ జిల్లా, గుంటూరు సిటీ, రాజాస్ గార్డెన్, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా లోని టి.ఎస్ నం. 1225, వార్డు నం. 5 & బ్లాక్ నం. 8 వద్ద ప్రస్తుతం ఉన్న భూమి & భవనం మరియు భవిష్యత్‌లో దానిపై నిర్మించనున్న నిర్మాణం యావత్తు. విస్తీర్ణ కొలతలు: 57 8/9 చ.గజాలు, సరిహద్దులు: డి.నం. 11-4-34, తూర్పు: చవ్వా వెంకాయమ్మ, దక్షిణం: రోడ్, పశ్చిమం: తెలగతోటి రమణమ్మ, ఉత్తరం: ఎర్రబోతుల సుబ్బారెడ్డి.

రిజర్వు ధర: రూ. 75,00,000/- (రూపాయలు డెబ్బై ఐదు లక్షలు మాత్రమే)

రీ-వేలం వివరాలు

రీ-టెండరు-సహిత-వేలం అమ్మకం తేది:	ప్రదేశం
08-09-2025	సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, గుంటూరు-పట్నం బజార్ శాఖ, డి.నం.23-6-122, రామ ఎన్‌క్లేవ్, పట్నంబజార్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522003. టెలిఫోన్ నం.08632-222005, సెల్ నం.లు: 9390735612, 8925876329

రీ-టెండరు-సహిత-వేలం అమ్మకం నియమ నిబంధనలు :
1. కాగోరు బిడ్డర్లు వేలంలో స్వయంగా పాల్గొనవలెను మరియు వ్యక్తిగతంగా పాల్గొనాలి మరియు అందుకు సంబంధించి అతని/ఆమె కొరకే అతను/ఆమె బిడ్డింగ్ వేస్తున్నట్లు వ్రాతపూర్వక ప్రకటన ఇవ్వవలసి ఉంటుంది. **2.** కాగోరు బిడ్డర్లు ది మేనేజర్, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, గుంటూరు-పట్నం బజార్ శాఖ, డి.నం.23-6-122, రామ ఎన్‌క్లేవ్, పట్నంబజార్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522003 వారి నుండి టెండరు ఫారాలను పొందవచ్చును. **3.** కాగోరు బిడ్డర్లు వారి బిడ్లను "సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్" పేరున తీసిన రిజర్వు ధరలో **10 శాతం** బయానా కొరకు డిమాండ్ డ్రాఫ్ట్ / పే ఆర్డర్ రూపంలో ఉన్నదానితోపాటుగా ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన **మ.12.00 గం.కు లేదా ఆలోగా అధీకృత అధికారి, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్** వారి చిరునామాకు సీల్డు ఎన్వలప్‌లలో నిర్దిష్టపరిచిన టెండరు ఫారంలో మాత్రమే వారి బిడ్లను దాఖలు చేయవలెను. **4.** ఆస్తి తనిఖీ మరియు ఇతర వివరాల కొరకు కాగోరు కొనుగోలుదారు టెలిఫోన్ నం.08632-222005, సెల్ నం.లు: 9390735612, 8925876329లను సంప్రదించవచ్చును. **5.** ఆస్తి / ఆస్తులు "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా" మరియు "అక్కడ ఏది ఉన్నదో అది" ప్రాతిపదికన విక్రయించబడతాయి. **6.** ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన **మ.01.00 గం.కు** కాగోరు బిడ్డర్ల సమక్షంలో సీల్డ్ టెండర్లు తెరవబడతాయి. అమ్మకం సాధారణంగా ముగింపు టెండర్ల రూపంలోనే ఉంటుంది. అధీకృత అధికారి అతని విచక్షణ మేరకు టెండరు ప్రక్రియ ముగింపు సమయంలో స్వీకరించబడిన దానికన్నా అత్యధిక బిడ్‌ను కోట్ చేయుటకు ఆసక్తి వ్యక్తం చేసిన బిడ్డర్ల మధ్య బహిరంగ వేలం నిర్వహించవచ్చును మరియు అటువంటి సందర్భంలో అత్యధిక బిడ్ వేసిన వ్యక్తికే అమ్మకం సంక్రమిస్తుంది. అయితే అమ్మకం సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ నిర్ధారణకు లోబడి ఉంటుంది. **7.** గెలుపొందిన బిడ్డరు అమ్మకం పూర్తయిన **వెంటనే** అమ్మకం మొత్తంలో **25%** (**చెల్లించిన బయానా కలిపి**) చెల్లించాలి మరియు మిగిలిన **75%** మొత్తమును అమ్మకం నిర్ధారణ తేదీ నుండి **15 రోజులలోగా** చెల్లించాలి. లేనిచో ముందుగా డిపాజిట్ చేసిన **25%** మొత్తం స్వాధీనం చేసుకొనబడుతుంది. **8.** ఇందులో నిర్దిష్టపరచిన కాలపరిమితిలోగా మొత్తం అమ్మకం ప్రతిఫలం అందుకున్న తరువాత మాత్రమే గెలుపొందిన కొనుగోలుదారు పేరు మీద అమ్మకం సర్టిఫికెటును అధీకృత అధికారి జారీ చేస్తారు. **9.** చట్టం క్రింద వర్తించు విధంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు వంటి కన్వేయన్స్ కొరకు చెల్లించాల్సిన చార్జీలు/ఫీజులు గెలుపొందిన కొనుగోలుదారు భరించవలసి ఉంటుంది. **10.** ప్రభుత్వానికి, ప్రభుత్వ రంగ సంస్థలకు మరియు స్థానిక సంస్థలకు బకాయిలు ఉన్న ఏవేని చట్టబద్ధ బకాయిలు (న్యాయపరంగా ఇంటి పన్ను, విద్యుత్ చార్జీలు మరియు ఇతర బకాయిలు) TDS, GST గెలుపొందిన బిడ్డరే చెల్లించాలి. **11.** ఎటువంటి కారణం తెలియజేయకుండా బిడ్లను అంగీకరించు లేదా తిరస్కరించు లేదా అమ్మకాన్ని వాయిదా వేయు లేదా రద్దు చేయు అన్ని అధికారాలు అధీకృత అధికారి కలిగి ఉన్నారు.

ప్రదేశం : కుంబకోణం, తేది : 12.08.2025 — అధీకృత అధికారి

నమోదిత కార్యాలయం: 149, T.S.R. (Big) స్ట్రీట్, కుంబకోణం, తంజావూరు జిల్లా, తమిళనాడు-612001, CIN - L65110TN1904PLC001287, టెలిఫోన్ నం.0435-2402322, ఫ్యాక్స్:0435-2431746, వెబ్‌సైట్:www.cityunionbank.com

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14A, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032.
నిర్వాహక కార్యాలయం: 6వ అంతస్తు(లెవల్ 2),భవనం సంఖ్య 02,బెరం క్యూ పార్క్ జనరల్ 4/1,TTC, థానే బేలాపూర్ రోడ్,ఘన్సోలి,నవీ ముంబై-400710

గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు

ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీపై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన రుణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలంపాటను మేము వేలం వేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీత నుండి చట్టపరమైన చర్యల ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో వేటినైనా వేలం నుండి తొలగించటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదీని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

AUCTION DATE 21.08.2025,AUCTION PLACE:SHRIRAM FINANCE LTD,ZONAL OFFICE,SHRIRAM ENCLAVE,ANNAPURNA NAGAR,5thLINE,INNER RING ROAD OPP. NARAYANA COLLEGE,GORANTLA,GUNTUR-522034,

Loan A/C No	Customer Name	Loan A/C No	Customer Name
PTNBZPJ2502110001	SRINIVASARAO SUDABATHULA	PRNPMPJ2502120010	SIVA ALLA
PTNBZPJ2502240002	KAMESWARA RAO ELURI	PRNPMPJ2411160011	REPUDI MALLESWARI
PTNBZPJ2503010003	KAMESWARA RAO ELURI	PRNPMPJ2411180006	PACHALA RAMBABU
PTNBZPJ2503010002	KAMESWARA RAO ELURI	PRNPMPJ2502220012	DASARI MARIYA JYOTHI
PRNPMPJ2502030009	GOSALA RAMESH	PRNPMPJ2502270005	GUMMA VEERABRAHMAM
PRNPMPJ2502100008	POLLAGURI RAYAPPA	PRNPMPJ2503010026	KOTESWARA RAO DHARNAKOTA
PRNPMPJ2502100011	KADAGALA LAKSHMI	PRNPMPJ2503010038	BHIMANADHUNI VEERANJANEYU
PRNPMPJ2502120001	ADAM SHAFI SHAIK		

వేలం సమయం: 11.00 AM మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు **శ్రీ జి.వెంకటేశ్వర్లు**ను సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కాని యెడల మరుసటిరోజు అదే నియమ నిభంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబందించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిస్తాయి.

తేది: 13.08.2025
స్థలం: గుంటూరు
అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్.

SHRIRAM Finance — శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిష్టర్డు కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032
ఆఫీస్ అడ్రస్ : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, జోనల్ ఆఫీస్, శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లైను, ఇన్నర్ రింగ్ రోడ్, గోరంట్ల, గుంటూరు-522034.

భౌతికంగా స్వాధీనత ప్రకటన రూలు 8(3) (స్థిరాస్తిపై)

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (సెకండ్) యాక్ట్, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) ప్రకారం మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ ("శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" యన్‌సియల్‌టి చెన్నై వారి ఉత్తర్వు ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్" లో విలీనమైనది. తర్వాత ది.30-11-2022 నాటి పేరు మార్పునసుసరించి ఇన్‌కార్పొరేషన్ సర్టిఫికెట్ ద్వారా ది.30-11-2022 నుండి వర్తింపుతో "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్" యొక్క పేరు "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్"గా మార్చబడినది) యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారుడు సదరు చట్టంలోని సెక్షన్ 13(12)కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 నందలి రూలు 3 ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ అగ్రిమెంట్ నెం. **GUNBRTF1809190018** ప్రకారం ఋణగ్రహీతలు : **1)** శ్రీ వైష్ణవి టౌన్‌షిప్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, మేనేజింగ్ డైరెక్టర్ వేములపల్లి వెంకటనరసయ్య, హెచ్.నెం.11-198, అయ్యప్ప నగర్, నరసరావుపేట శివారు, సత్తెనపల్లి రోడ్, నరసరావుపేట, గుంటూరు జిల్లా-522601, **2)** వేములపల్లి వెంకటనరసయ్య, తండ్రి : గోపాలరావు, హెచ్.నెం.11-198, అయ్యప్ప నగర్, నరసరావుపేట శివారు, సత్తెనపల్లి రోడ్, నరసరావుపేట, గుంటూరు జిల్లా-522601, **3)** వేములపల్లి రమేష్‌బాబు, తండ్రి : కోదండ రామయ్య, డి.నెం.4-19-94, వికాస్ నగర్, 7వ లైను, గుంటూరు-522006, **4)** నాగోతు సవిత, తండ్రి : వేములపల్లి వెంకటనరసయ్య, డి.నెం.5-1-16, పాత పల్నాడు రోడ్, నరసరావుపేట (పోస్టు), గుంటూరు జిల్లా-522601, **5)** నాగోతు ప్రకాష్‌రావు, తండ్రి : అనంతయ్య, మథర్ థెరీస్సా హాస్పిటల్ (డాక్టర్), గడియారస్తంభం దగ్గర, చిన్న కూరపాలెం పోస్టు, నరసరావుపేట (మండలం), గుంటూరు జిల్లా మీ అందరూ చెల్లించవలసిన బకాయిసొమ్ము రూ.1,21,02,482/- (అక్షరాల ఒక్క కోటి ఇరవైఒక్క లక్షల రెండు వేల నాలుగు వందల ఎనభైరెండు రూపాయలు మాత్రము) మరియు కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం తదుపరి జమకూడు వడ్డీ మరియు ఇతర ఖర్చులు నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసినదిగా ది.30-07-2022న డిమాండు నోటీసు జారీచేయడమైనది.

బకాయిసొమ్ము చెల్లించడంలో ఋణగ్రహీతలు విఫలమైనందున ఈ దిగువ సంతకందారు మా కార్యనిర్వాహకుడి సహాయంతో సదరు చట్టములోని సెక్షన్ 13(4) ప్రకారం దిగువ పేర్కొన్న ఆస్తిని తేది.06-08-2025 న భౌతికంగా స్వాధీనత తీసుకున్నారు. ఎందుకనగా, దిగువ తెలిపిన తనఖా ఆస్తి ఖాళీ భూమి, కాబట్టి అధీకృత అధికారి ఈ రోజు అనగా తేది.06-08-2025 న నేరుగా భౌతికంగా స్వాధీనం చేసుకున్నారని ఋణగ్రహీతలకు ప్రత్యేకంగా మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది. సదరు ఆస్తికి సంబంధించి ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా బకాయి పడిన సొమ్ము రూ.1,21,02,482/- (అక్షరాల ఒక్క కోటి ఇరవైఒక్క లక్షల రెండు వేల నాలుగు వందల ఎనభైరెండు రూపాయలు మాత్రము) మరియు తదుపరి జమకూడు వడ్డీ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలు మరియు ఇతర ఖర్చులు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారి ఛార్జికి లోబడి ఉంటాయని ఇందుమూలముగా ముఖ్యముగా ఋణగ్రహీతలను మరియు సాధారణ ప్రజానీకాన్ని హెచ్చరించడమైనది.

స్థిరాస్తుల వివరములు

ఐటమ్ నెం.1 : గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్ జిల్లా, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ ఏరియా, పొత్తూరు గ్రామము, మొత్తం డి.నెంబర్లు : 191/1బి, 191/1సి, 191/1డి, 191/1ఇ, 191/1యఫ్, 191/2, 191/3, 192/బి, 193/2, 194, 195/1బి, 195/2, 198/1, 198/2ఎ, 198/2బి, 198/3, 198/4, 199/1, 199/2, 200/1ఎ, 200/1బి, 200/2ఎ, 200/2బి, 200/2సి, 200/3, 201, 202/1, 202/2, 230/2, 230/3, 230/4, 230/5, 230/6, 231/1ఎ, 231/1బి, 231/1సి, 231/1డి, 231/2ఎ, 231/2బి మరియు 231/3 నందు గుంటూరు, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని పొత్తూరు గ్రామములోని డి.నెంబర్లు : 230/2, 230/3, 230/4, 230/5, 230/6, 231/1ఎ, 231/1బి, 231/1సి, 231/1డి, 231/2ఎ, 231/2బి మరియు 231/3 నందు అప్రూవ్డ్ లేఅవుట్ లోని యల్.పి.నెం.01/2016/జియన్‌టి లోని ప్లాట్ నెం.61 కి చెందిన 276 చ॥గ॥ల విస్తీర్ణముగల ఖాళీ ఇంటిస్థలమునకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు : తూర్పు:** ప్లాట్ నెం.112 లోని స్థలము, **దక్షిణం:** ప్లాట్ నెం.62 లోని స్థలము, **పడమర :** 40 అ॥ల వెడల్పుగల రోడ్డు, **ఉత్తరం:** ఇతరుల భూమి. పైన తెలిపిన హద్దుల మధ్యగల శ్రీ వైష్ణవి టౌన్‌షిప్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ కు చెందిన "శ్రీవారినిలయం" లేఅవుట్ లో ప్లాట్ నెం.61 లోని **276 చ॥గ॥ల విస్తీర్ణముగల ఖాళీ ఇంటి స్థలము మాత్రమే. (ఈ ఆస్తి నల్లపాడు యస్.ఆర్.ఒ లోని దస్తావేజు నెం.1307/2016 ప్రకారం కలదు).**

ఐటమ్ నెం.2 : గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్ జిల్లా, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ ఏరియా, పొత్తూరు గ్రామము, మొత్తం డి.నెంబర్లు : 191/1బి, 191/1సి, 191/1డి, 191/1ఇ, 191/1యఫ్, 191/2, 191/3, 192/బి, 193/2, 194, 195/1బి, 195/2, 198/1, 198/2ఎ, 198/2బి, 198/3, 198/4, 199/1, 199/2, 200/1ఎ, 200/1బి, 200/2ఎ, 200/2బి, 200/2సి, 200/3, 201, 202/1, 202/2, 230/2, 230/3, 230/4, 230/5, 230/6, 231/1ఎ, 231/1బి, 231/1సి, 231/1డి, 231/2ఎ, 231/2బి మరియు 231/3 నందు గుంటూరు, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని పొత్తూరు [illegible]

స్థలము. పైన తెలిపిన హద్దుల మధ్యగల శ్రీ వైష్ణవి టౌన్‌షిప్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ కు చెందిన "శ్రీవారినిలయం" లేఅవుట్ లో ప్లాట్ నెం.41 లోని 176 చ॥గ॥ల విస్తీర్ణముగల ఖాళీ ఇంటి స్థలము మాత్రమే. (ఈ ఆస్తి నల్లపాడు యస్.ఆర్.ఒ లోని దస్తావేజు నెంబర్లు 7882/2016 మరియు 7883/2016 ప్రకారం కలదు).

ఐటమ్ నెం.13 : గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్ జిల్లా, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ ఏరియా, పొత్తూరు గ్రామము, మొత్తం డి.నెంబర్లు : 191/1బి, 191/1సి, 191/1డి, 191/1ఇ, 191/1యఫ్, 191/2, 191/3, 192/బి, 193/2, 194, 195/1బి, 195/2, 198/1, 198/2ఎ, 198/2బి, 198/3, 198/4, 199/1, 199/2, 200/1ఎ, 200/1బి, 200/2ఎ, 200/2బి, 200/2సి, 200/3, 201, 202/1, 202/2, 230/2, 230/3, 230/4, 230/5, 230/6, 231/1ఎ, 231/1బి, 231/1సి, 231/1డి, 231/2ఎ, 231/2బి మరియు 231/3 నందు గుంటూరు, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని పొత్తూరు గ్రామములోని డి.నెంబర్లు : 194 మరియు 193/2 నందు అప్రూవ్డ్ లేఅవుట్ లోని యల్.పి.నెం.01/2016/జియన్‌టి లోని ప్లాట్ నెం.42 కి చెందిన 179 చ॥గ॥ల విస్తీర్ణముగల ఖాళీ ఇంటిస్థలమునకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు : తూర్పు:** 40 అ॥ల వెడల్పుగల రోడ్డు, **దక్షిణం:** ప్లాట్ నెం41 లోని స్థలము, **పడమర :** ఇతరుల యొక్క భూమి, **ఉత్తరం:** ప్లాట్ నెం43 లోని స్థలము. పైన తెలిపిన హద్దుల మధ్యగల శ్రీ వైష్ణవి టౌన్‌షిప్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ కు చెందిన "శ్రీవారినిలయం" లేఅవుట్ లో ప్లాట్ నెం.42 లోని 179 చ॥గ॥ల విస్తీర్ణముగల ఖాళీ ఇంటి స్థలము మాత్రమే. (ఈ ఆస్తి నల్లపాడు యస్.ఆర్.ఒ లోని దస్తావేజు నెంబర్లు 7882/2016 మరియు 7883/2016 ప్రకారం కలదు).

ఐటమ్ నెం.14 : గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్ జిల్లా, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ ఏరియా, పొత్తూరు గ్రామము, మొత్తం డి.నెంబర్లు : 191/1బి, 191/1సి, 191/1డి, 191/1ఇ, 191/1యఫ్, 191/2, 191/3, 192/బి, 193/2, 194, 195/1బి, 195/2, 198/1, 198/2ఎ, 198/2బి, 198/3, 198/4, 199/1, 199/2, 200/1ఎ, 200/1బి, 200/2ఎ, 200/2బి, 200/2సి, 200/3, 201, 202/1, 202/2, 230/2, 230/3, 230/4, 230/5, 230/6, 231/1ఎ, 231/1బి, 231/1సి, 231/1డి, 231/2ఎ, 231/2బి మరియు 231/3 నందు గుంటూరు, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని పొత్తూరు గ్రామములోని డి.నెంబర్లు : 194 మరియు 193/2 నందు అప్రూవ్డ్ లేఅవుట్ లోని యల్.పి.నెం.01/2016/జియన్‌టి లోని ప్లాట్ నెం.43 కి చెందిన 181 చ॥గ॥ల విస్తీర్ణముగల ఖాళీ ఇంటిస్థలమునకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు : తూర్పు:** 40 అ॥ల వెడల్పుగల రోడ్డు, **దక్షిణం:** ప్లాట్ నెం42 లోని స్థలము, **పడమర :** ఇతరుల యొక్క భూమి, **ఉత్తరం:** ప్లాట్ నెం44 లోని స్థలము. పైన తెలిపిన హద్దుల మధ్యగల శ్రీ వైష్ణవి టౌన్‌షిప్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ కు చెందిన "శ్రీవారినిలయం" లేఅవుట్ లో ప్లాట్ నెం.43 లోని 181 చ॥గ॥ల విస్తీర్ణముగల ఖాళీ ఇంటి స్థలము మాత్రమే. (ఈ ఆస్తి నల్లపాడు యస్.ఆర్.ఒ లోని దస్తావేజు నెంబర్లు 7882/2016 మరియు 7883/2016 ప్రకారం కలదు). **పైన తెలిపిన 14 ఐటమ్‌ల మొత్తం విస్తీర్ణము 2776 చ॥గ॥ల విస్తీర్ణముగల ఖాళీ ఇంటి స్థలము మాత్రమే.**

తేది : 06-08-2025, ప్రదేశం: గుంటూరు — సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ


ప్రసంగిస్తున్న మేయర్ రవీంద్ర, పక్కన కమిషనర్, ఇతర అధికారులు

అధికారులు సమన్వయంతో కృషి చేయాలి : మేయర్

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం నగరంలో కురుస్తున్న వర్షాలకు ప్రజలకు ఏ విధమైన సమస్య లు రాకుండా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. బుధవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, జీఎంసీ విభాగాధిపతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. మేయర్ మాట్లాడుతూ ప్రస్తుతం శంకర్‌విలాస్ వంతెన రాక పోకలు నిలిచినందున ప్రధాన ప్రత్యామ్నాయ మార్గమైన కంకరగుంట ఆర్‌యూబీ దగ్గర నీరు నిలవకుండా అదనపు మోటార్లను, సిబ్బందికి కేటాయించాలన్నారు. అలాగే హర ఘర్ తిరంగా కార్యక్రమాల్లో భాగంగా గురువారం జరిగే జాతీయ జెండా ప్రదర్శన విజయవంతానికి కార్పొరేటర్లు కూడా బాధ్యత తీసుకోవాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ 24 గంటలు పని చేసేలా జీఎంసీ కాల్ సెంటర్ (0863234 5103)ని సిద్ధం చేశామని, ప్రజలు కాల్ చేయవచ్చ న్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ షేక్ సజిలా, అదనపు కమిష నర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీని వాస్, టి.వెంకట కృష్ణయ్య, బి.శ్రీనివాసరావు, సిటి ప్లానర్ రాంబాబు, ఇన్‌చార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, మేనేజర్ బాలాజీ బాష పాల్గొన్నారు.

ఉపాధి పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి

● రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ తులసిరెడ్డి


ప్రసంగిస్తున్న మాజీ ఎంపీ తులసిరెడ్డి

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా అమల్లో ఉన్న ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయడం ద్వారా వ్యవ సాయ రంగం అభి వృద్ధి చెందుతుందని రాజ్యసభ మాజీ సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ మీడియా కమిటీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. గుంటూరులో జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో వ్యవసాయం పండగా? దండగా? అనే అంశంపై జరిగిన చర్చా గోష్టిలో ఆయన ప్రసంగించారు. అమల్లో ఉన్న సాగునీటి పారుదల ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేస్తే ఆంధ్రప్రదేశ్‌లో 90 శాతం వ్యవసాయ భూమికి నీరు అందించగల మన్నారు. దళారీల దోపిడీని అరికట్టి మార్కెటింగ్ సదుపాయాలను కల్పించాలన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి ప్రసంగిస్తూ వ్యవ సాయ రంగంలో యాంత్రీకరణను పెంచి సేవ లు, పరిశ్రమల రంగాల్లో ఉపాధి అవకాశాలను పెంచాలన్నారు. వ్యవ సాయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ ఎన్.వేణుగోపాలరావు ప్రసంగిస్తూ పంట భూములను వ్యవసాయేతర కార్యక్రమాలకు వినియోగించరాదనే ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ సూచనలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లెక్క చేయడం లేదన్నారు. చర్చా గోష్టిలో రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓరుగంటి నారాయణరెడ్డి, కౌలు రైతుల సంఘం అధ్యక్షులు బి. శ్రీనివాసులు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు ఈమని అప్పారావు, బీసీ మహా జనసభ అధ్యక్షులు ఉగ్గం సాంబశివరావుతో పాటు కైలా జయసుధ తదితరులు ప్రసంగించారు.

విపక్ష ఎంపీలను అరెస్టు చేయటం అప్రజాస్వామికం

గుంటూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాలో తప్పొప్పులను ప్రశ్నిస్తూ ఈసీని కలిసేందుకు వెళ్లిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, విపక్ష ఎంపీలను అరెస్టు చేయటం అప్రజాస్వామికం, అత్యంత దుర్మార్గమని ఏపీసీసీ అధికార ప్రతినిధి ఎన్ తులసిరెడ్డి విమర్శించా రు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వర రావుతో కలిసి రాజీవ్‌గాంధీభవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఓటర్ల జాబితాలో తప్పొప్పులపై పార్లమెంటు సాక్షిగా రాహుల్‌గాంధీ ప్రశ్నిస్తే ఎన్నికల కమిషన్ కనీసం అపాయింట్‌మెంట్ ఇవ్వకపోగా అరెస్టులు చేయటం పిరికి పంద చర్య అని అన్నారు. కార్యక్ర మంలో గడ్డం పాల్ విజయ్ కుమార్, జె.వెంకటరెడ్డి, కె.సురేష్, వినయ్‌కుమార్ తదితరులున్నారు.

అవయవదానం ప్రాణదానంతో సమానం

● కిమ్స్ న్యూరోసర్జన్ చిట్టెం లక్ష్మణరావు

గుంటూరు మెడికల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అవయవదానం ప్రాణదానంతో సమానమని కిమ్స్ శిఖర హాస్పిటల్స్‌కు చెందిన న్యూరో సర్జన్ డాక్టర్ చిట్టెం లక్ష్మణరావు తెలి పారు. పెదకాకాని రోడ్‌లోని కిమ్స్ శిఖర హాస్పిటల్‌లో మంగళవారం అవయవదానంపై ఆన్సరింగ్ ది కాల్ అనే థీమ్‌తో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. వ్యక్తి మరణించినా అవయవదానం చేయడం ద్వారా తిరిగి జీవించవచ్చని డాక్టర్ లక్ష్మణరావు తెలిపారు. గ్యాస్ట్రో ఎంటిరాలజిస్ట్ డాక్టర్ రావెళ్ల విష్ణుప్రసాద్ మాట్లాడుతూ అవయవాలను కేవలం దానం ద్వారా మాత్రమే సమకూర్చుకోగలమని, ఎన్ని రూ.కోట్లు ఖర్చు చేసినా ఫ్యాక్టరీల్లో వీటిని తయారు చేయలేమని తెలిపారు. డాక్టర్ సూరా ప్రదీప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అప్పుడే పుట్టిన శిశువు నుంచి 90ఏళ్ల వృద్ధుల వరకు ఎవరైనా అవయవదానం చేయవచ్చన్నారు. డాక్టర్ ప్రతాప్ మౌళి మాట్లాడుతూ కిమ్స్ శిఖర హాస్పిటల్‌లో అవయవ మార్పిడి శస్త్ర చికిత్సలు అందుబాట్లో ఉన్నట్లు తెలిపారు. అవయవదానం చేయదలచిన వారు జీవన్ దాన్ ట్రస్ట్ పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శరత్ చంద్ర పాల్గొన్నారు.


అవయవ దానంపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కిమ్స్ వైద్యసిబ్బంది

అవయవ దానంతో పునర్జన్మ : వల్లూరి

గుంటూరు(విద్య), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అవయవ దానం పునర్జననంతో సమానమని ప్రముఖ అవయవ, దేహదాన ఉద్యమ కారుడు వల్లూరి సదాశివరావు అన్నారు. బుధవారం బ్రాడీపేటలోని జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో ప్రజా ఆలోచన వేదిక ఆధ్వర్యంలో ప్రపంచ అవయవ దాన దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు బీ కైలాసనాద్ అధ్యక్షత వహించి అవయవ దేహదానంపై వెలువరించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజా ఆలోచన వేదిక అధ్యక్షుడు మేడూరి రాజేంద్రప్రసాద్, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ నాయకులు ఏఎంజీ ఉమామహేశ్వరరావు, షేక్ హుస్సేన్, బీ ఆనందరావు పాల్గొన్నారు.

సీపీఆర్ చికిత్సపై విద్యార్థులకు అవగాహన అవసరం

గుంటూరు (విద్య) ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో గుండెపోటు, శ్వాస తీసు కోవడంలో కలిగే ఇబ్బందులపై అవగాహన కలిగి ఉండటం ద్వారా చాలా మందికి ప్రాణ దానం చేయవచ్చునని మెడ్ ఇంపాక్ట్ గ్లోబల్ సంస్థ అసోసియేట్ డైరెక్టర్ రజిని మద్ది పేర్కొన్నారు. బుధవారం స్థానిక రైలుపేట కన్నా ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో విద్యార్థు లకు ఎంపవరింగ్ ది యూత్ టూ సేవ్ లైవ్స్ అంశంలో భాగంగా కార్డియో పల్మనరీ రెససిటేషన్ (సీపీఆర్)పై అవగాహనతో పాటు రబ్బరు బొమ్మల ద్వారా శిక్షణ పొందిన బేసిక్ కార్డియాక్ లైఫ్ సపోర్టర్స్ మణిదీప్ ముప్పల, ధ్రువన్‌రెడ్డిల ద్వారా ప్రాక్టికల్స్ చేయించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కన్నా మాస్టర్ పాల్గొన్నారు.

నగరం జలమయం

● చెరువులను తలపించిన లోతట్టు, శివారు ప్రాంతాలు


చుట్టుగుంట సెంటర్లోని కాలనీలోకి చేరిన వర్షపు నీరు

గుంటూరు కార్పొరేషన్, గుంటూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం రాత్రి నుంచి కురిసిన భారీ వర్షంతో నీటిమయంగా మారింది. అన్ని ప్రధాన రహదారులు, అవుట్ ఫాల్ డ్రైన్, వాగులు, కాలువలు వర్షపు నీటితో నిండి ఉన్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శంకర్‌విలాస్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో 3 వంతెనల వద్ద, కంకరగుంట ఆర్‌యూబీ వద్ద భారీగా నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. దీంతో జీఎంసీ అధికారులు రైల్వే బ్రిడ్జిల కింద ప్రత్యేక మోటార్లు ఏర్పాటు చేసి నీటిని బయటికి పంపారు. చుట్టుగుంట, నల్లపాడు రోడ్డులోని పలు కాలనీలు వరద నీటిలో చిక్కుకుపోయాయి. రాకపోకలకు కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి


లక్ష్మీ నగర్ రెండో లైన్ లోకి చేరిన వర్షపు నీరు

వచ్చింది. హనుమాన్‌నగర్, శ్రీరామ్‌నగర్‌లో వరద నీరు పెద్ద ఎత్తున చేరుకుంది. శ్రీ లక్ష్మీనగర్‌లో కొన్ని ఇళ్ళలోకి వరద నీరు చేరటంతో ప్రజలు తలుపులకు తాళాలు వేసి బంధువుల ఇళ్ళకు వెళ్ళిపోయారు. ఇక ఏటి అగ్రహారం 14వ లైను నుంచి 17వ లైను వరకు, మల్లారెడ్డి నగర్, శాంతి నగర్‌లో అంతర్గత రహదారుల్లో వర్షపునీరు చెరువులను తలపించింది. పాఠశాలలకు వెళ్ళే విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు రాకపోకలకు మోకాలిలోతు వచ్చిన వరద నీటికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

చుట్టుగుంట రైతుబజారులోకి వరదనీరు పెద్ద ఎత్తున చేరుకోవటంతో లోనికి వెళ్లే పరిస్థితి లేదు. దాంతో రైతులు, వ్యాపారులు ఆకుకూర లు, ఇతర కూరగాయలు జీటీ రోడ్డుపైనే ఉంచి వ్యాపారాలు నిర్వహిం చారు. మరో వైపు రైతుబజారుకు ఆనుకొని ఉన్న మురికిపేట కాలనీ వరద నీటిలో చిక్కుకుపోయింది. డ్రెయిన్‌ల నిర్మాణ పనులు త్వరితగతిన చేసి ఉంటే తమకు వరద ముంపు తప్పేదని మురికి పేట కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఒకవైపు బ్రిడ్జి కూల్చివేత.. మరోవైపు వర్షాలు

గుంటూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): శంకర్‌విలాస్ ఫ్లైఓవర్ కూల్చివేత జరుగుతున్న సమయంలో మంగళవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి నగరంలో జనజీవనం పూర్తిగా స్తంభించింది. నగరంలో రైల్వే ట్రాక్‌ల కారణంగానే నగరవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ తమకేమీ సంబంధం లేదు అన్నట్లుగా రైల్వే శాఖ చోద్యం చూస్తూ ఉండడంతో సమస్య మరింత జటిలంగా మారు తుంది. బ్రాడీపేట 14వ అడ్డరోడ్డు వద్ద రైల్వే గేట్‌ని మూసివేశారు. శంకర్‌విలాస్ ఫ్లైఓవర్ నిర్మాణం నేపథ్యంలో ప్రత్యామ్నాయమైన బ్రాడీ పేట 14వ అడ్డరోడ్డు గేటును తెరవకుండా మీనమేషాలు లెక్కిస్తున్నా రు. అదేమంటే 14వ అడ్డరోడ్డు గేటు రైల్వే ఇంటర్ లాకింగ్ సిస్టంలో ఉందని, దానిని మార్చాలంటే 8 కోట్లు ఖర్చు అవుతుందంటూ చెప్పి చేతులెత్తేస్తున్నారు. మరోవైపు కంకరకుంట అండర్ పాస్, మూడు వంతెనల వద్ద వర్షపు నీరు నిలిచి దశాబ్దాలుగా నగరవాసులు వర్షం పడితే నరకం చవి చూస్తున్నారు. అయినప్పటికీ రైల్వే అండర్ పాస్‌ల నిర్వహణ చూసుకోవలసిన రైల్వేశాఖ తమకు సంబంధం లేదని చేతు లెత్తేస్తోంది. ఆయా అండర్ పాస్‌ల వద్ద కనీసం మోటార్లు ఏర్పాటు చేయడానికి కూడా ముందుకు రాకుండా తమకు సంబంధం లేదని చెబుతుండడం నగరంలో జటిలమవుతున్న ట్రాఫిక్ సమస్యలకు మరో కారణంగా చెప్పవచ్చు.

బ్రిడ్జిపై గుంతలు పూడ్చిన ట్రాఫిక్ పోలీసులు

కంకరగుంట ఫ్లైఓవర్‌పై గుంతలో ఏర్పడడంతో వాహన రాకపోకల కు అంతరాయం కలుగుతున్నడంతో వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య ఆధ్వర్యంలో ట్రాఫిక్ సిబ్బందే మట్టి పోసి ఆయా గుంతలు పూడ్చుకు న్నారు. శంకర్‌విలాస్ ఫ్లైఓవర్ బ్రిడ్జి కూల్చివేత నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్‌రద్దీ అధిగమిం చేందుకు ఈస్ట్, వెస్ట్ ట్రాఫిక్ సీఐలు అశోక్ కుమార్, సింగయ్యలు పూర్తి అప్రమత్తంగా ఉంటున్నారు. మూడు వంతెనల వైపు నుంచి కొత్తపేటలోకి వెళ్లే వాహన రాకపోకలన్నిం టిని ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ పర్యవేక్షిస్తూ అక్కడ వాహనాల రద్దీ అధిగమిం చేందుకు అనేక ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు.


కంకరగుంట ఆర్వోబీ పై భారీగా నిలిచిన వాహనాలు

జిల్లాలో 28645 హెక్టార్లలో పంట మునక

గుంటూరు సిటీ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో విస్తారంగా కురిసిన వర్షాలకు జిల్లాలో 28,645 హెక్టార్ల పంట నీట మునిగింది. ముఖ్యంగా డెల్టా ప్రాంతంలో వరి పంట పూర్తిగా ముంపునకు గురయ్యింది. జిల్లాలోని 11 మండలాల్లోని 88 గ్రామాల్లో వరి పంట నీట మునిగినట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. మొత్తం 28,437 రైతులకు చెందిన పంటకు నష్టం వాటిల్లే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు. జిల్లాలో 3420 హెక్టార్లలో పత్తి పంట, 315 హెక్టార్లలో మినుము పంట పూర్తిగా మునిగినట్లు అధికారులు తేల్చారు. భారీ వర్షం నేపథ్యంలో నీట మునిగిన పంట పొలాలను పరిశీలిం చేందుకు జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు బుధవారం జిల్లా వ్యాప్తంగా పర్యటించారు. రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు వ్యవసాయ శాఖ ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని డీఏవో నాగేశ్వరరావు అన్నారు.

కారుణ్య నియామక పత్రం అందజేసిన కలెక్టర్

గుంటూరు సిటీ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ మినీ సమావేశ మందిరంలో కే శంకర్‌రెడ్డికి పంచాయతీరాజ్ శాఖ కాకుమాను మండలం కొండపాటూరులో జూనియర్ అసిస్టెం ట్‌గా నియమిస్తూ జారీ చేసిన కారుణ్య నియామక ఉత్తర్వులను కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజతో కలసి అందించారు. డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, డీఆర్వో ఎన్ఎస్ కే ఖాజావలి, ఆర్డీవో కే శ్రీనివాసరావు, డీపీవో నాగ సాయికుమార్ పాల్గొన్నారు.

దేశ వ్యవసాయ రంగాన్ని పరిరక్షించుకోవాలి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): దేశ వ్యవసాయ రంగాన్ని పరిరక్షించు కునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బ్రాడీపేట నుంచి లాడ్జీ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్ అధ్యక్షత వహించగా, కార్యక్ర మంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాదు, వెలుగూరి రాదాకృష్ణమూర్తి, పచ్చల శివాజీ, కొల్లి రంగారెడ్డి, ఈమని అప్పారావు, ఏ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

గుంటూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): తన వద్ద తీసుకున్న అప్పు తిరిగి చెల్లించనని చెప్పడంతో ఓ మహిళ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం నగరంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏటీ అగ్రహారం 20/1లో జరిగింది. నగరం పాలెం సీఐ నజీర్ బేగ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లపాడు రోడ్డుకు చెందిన అన్నం సీత, దాన య్య దంపతుల పెద్ద కుమార్తె జ్యోతికి 2007లో ఎర్రంశెట్టి వెంకట్రావుతో వివాహం జరిగింది. వారికి విశాల్, దినేష్ అనే ఇద్దరు సంతానం ఉన్నారు. వెంకట్రావు డ్రైవర్‌గా జీవనం సాగిస్తుంటాడు. వెంకట్రావు స్నేహితుడి ద్వారా వసుంధర అనే మహిళ జ్యోతికి పరిచయమైంది. తనకు అత్యవసరంగా రెండు లక్షలు అప్పు కావాలని అడగడంతో జ్యోతి ఆ మొత్తం ఇచ్చింది. తన వద్ద తీసుకున్న రెండు లక్షలు తిరిగి ఇవ్వాలని కొద్ది రోజులుగా వసుంధరను జ్యోతి అడుగుతుండగా ఆమె డబ్బులు ఇవ్వనని తెగేసి చెప్పింది. దీంతో బుధవారం ఉదయం జ్యోతి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. జ్యోతి తల్లి సీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగరం పాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రూ.40 లక్షలు మోసం

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో విశ్రాంత ఆర్మీ ఉద్యోగిని సైబర్ నేరగాళ్ళు రూ.40 లక్షలు మోసం చేసారు. లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జున్ను సాహిబ్‌నగర్‌కు చెందిన సయ్యద్ మస్తాన్ వలి ఆర్మీలో పని చేసి 20 సంవత్సరాల క్రితం ఉద్యోగ విరమణ చేసాడు. అయితే నెల రోజుల క్రితం తన వాట్సాప్ నెంబర్‌కు గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఆన్‌లైన్ ట్రేడింగ్‌కు సంబంధించి మెసేజ్ వచ్చింది. ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించాడు. మస్తాన్ వలితో విడతల వారీగా రూ.40 లక్షలు పెట్టుబడి పెట్టించారు. చివరకు మోసపోయానని గ్రహించిన బాధితుడు మస్తాన్‌వలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు లాలాపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధాశ్రమంలో దుప్పట్లు పంపిణీ

గుంటూరు(తూర్పు), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ జన్మదినాన్ని పురస్కరించుకుని టీ సీనియర్ నాయకుడు కొర్రపాటి సురేష్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీనగర్, మాతృశ్రీ వృద్ధుల ఆశ్రమంలో బుధవారం అన్నదానం నిర్వహించి దుప్పట్లు పంపిణీ చేశారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మానుకొండ శివప్రసాద్ షేక్ ఖాజావలీ, అంగిరేకుల వరప్రసాద్ యాదవ్, దారా అంబేద్కర్, నవకు మార్, రత్నకుమారి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

జీఎంసీలో ప్రావిడెంట్ ఫండ్ కుంభకోణం

● ఉద్యోగి దుర్గాభవానికి షోకాస్ నోటీసులు జారీ

● అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో ఆర్ఐగా పనిచేస్తున్న రేణుక దుర్గాభవానీకి నగర అదనపు కమిషనర్ షోకాజ్ నోటిసులు బుధవారం జారీ చేశారు. రవీంద్రనగర్‌లో మున్సిపల్ స్కూల్లో టీచర్‌గా పనిచేస్తున్న రమాదేవి 2021లో తన పీఎఫ్ ఖాతా నుంచి రూ.8,21,000 డ్రా చేసుకున్నారు. అయితే సదరు సొమ్ము పీఎఫ్ ఖాతాలో విత్ డ్రా చేసుకున్నట్లు పీఎఫ్ సెక్షన్‌లో పనిచేసే రేణుకా దుర్గా భవానీ(ప్రస్తుతం ఆర్ఐగా పనిచేస్తున్నారు)పీఎఫ్ ఖాతాలో నమోదు చేయలేదు. సదరు టీచర్ లోన్ తీసుకున్నప్పటికి లోన్ తీసుకోలేనట్లుగా పీఎఫ్ ఖాతాలో కనిపిస్తుంది. ప్రస్తుతం మున్సిపల్ టీచర్లను విద్యాశాఖకు బదిలీ చేయడంతో పీఎఫ్ ఖాతాను సెటిల్‌మెంట్ చేసుకునేందుకు నగర పాలక సంస్థ కార్యాలయానికి వచ్చిన సదరు టీచర్ విషయం తెలుసుకుని నగర అదనపు కమిషనర్ చల్లా ఓబులేసుకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు అదనపు కమిషనర్ దుర్గాభవానీకి షోకాజ్ నోటీసు జారీ చేశారు.

దొంగనోట్లు చలామణి చేస్తున్న నిందితుడి అరెస్టు

గుంటూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో దొంగ నోట్లు చలామణి చేస్తున్న బాపట్ల వివేకానంద కాలనీకి చెందిన బక్కా గోపీ అలియాస్ గోపిరెడ్డిని బుధవారం పట్టాభిపురం పోలీసులు అరెస్టు చేశారు. పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నా యి. బాపట్లకి చెందిన బక్క గోపి అలియాస్ గోపిరెడ్డి మొదటి భార్య చనిపోగా రెండో భార్యతో కలసి గుంటూరులోని పలకలూరురోడ్డులో గల రత్నగిరి నగర్ మొదటి లైనులో నివాసం ఉంటున్నాడు. గోపికి హైదరాబాద్‌కు చెందిన భరత్‌రెడ్డితో పరిచయం ఏర్పడింది. భరత్‌రెడ్డి నకిలీ బంగారపు బిస్కెట్స్, నకిలీ కరెన్సీ నోట్స్, నకిలీ వజ్రాలు అమ్మే కలకత్తాకు చెందిన గోపాల్‌ని బక్క గోపికి పరిచయం చేశాడు. అంతట బక్కా గోపి సుమారు 25 రోజులు క్రితం కలకత్తా వెళ్లి గోపాల్ అనే అతని వద్ద 160 నకిలీ 500 రూపాయల ఇండియన్ కరెన్సీ నోట్స్‌ని కొని గుంటూరు తీసుకువచ్చాడు. బుధవారం గోపి నకిలీ కరెన్సీ నోట్లను మార్చడానికి నగరంలో తిరుగుతూ ఉండగా పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు అరెస్ట్ చేసి, అతని నుంచి 26 నకిలీ రూ.500 నోట్లను స్వాధీనం చేసుకున్నారు. కాగా గోపిరెడ్డి ఇప్పటికే నగరంలో 134 నకిలీ 500 నోట్లు మార్పిడి చేసినట్లు సీఐ తెలిపారు. అతనిని కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారు.

పోలీస్ పెట్రోల్ బంకుకు ఉత్తమ నిర్వహణ అవార్డు

గుంటూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నగరంపాలెంలో గల పోలీస్ పెట్రోల్ బంకుకు ఉత్తమ నిర్వహణ అవార్డు లభించింది. విజయవాడ రీజియన్ ఇండియన్ ఆయిల్ పెట్రోలియం కార్పొరేషన్ 2024-2025 ఆర్థిక సంవత్సరానికిగాను పలు విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన రిటైల్ ఔట్లెట్ పెట్రోల్ బంకుల వారికి అవార్డులు ప్రదానం చేసి అభినందించారు. విజయవాడ డివి జనల్ కార్యాలయ మేనేజర్ రాజేష్ చేతుల మీదుగా ఈ అవార్డును జిల్లా పోలీస్ విభాగం తరపున పెట్రోల్ బంక్ ఇన్‌చార్జ్ ఆఫీసర్ ఏఆర్ ఏఎస్ఐ రత్నకుమార్ అందుకున్నారు. ఈ మేరకు ఎస్పీ సతీష్ కుమార్ పోలీస్ పెట్రోల్ బంక్‌ను సందర్శించి, ఉత్తమ నిర్వహణ అవా ర్డు వచ్చినందుకు హర్షం వ్యక్తం చేసి, అవార్డు రావడంలో విశేష కృషి చేసిన పెట్రోల్ బంక్ సిబ్బందిని, పర్యవేక్షణ అధికారి వెల్ఫేర్ ఆర్ఐ సురేష్‌ని అభినందించారు.

జగన్ రెడ్డి మాటలు హాస్యాస్పదం : ధారూనాయక్

గుంటూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాటు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన జగన్‌కు ఇప్పుడు ప్రజాస్వామ్యం గుర్తుకొచ్చిందా అని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారూనాయక్ ప్రశ్నించారు. బుధవారం జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేయనివ్వకుండా అవతలి పక్షం వాళ్ళ చేతుల్లోంచి నామినేషన్ పత్రాలు లాక్కుని చించేసిన నాటి ప్రభుత్వం నీదే కదా జగన్ అన్నారు. నేడు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగితే దాన్ని కూడా ఓర్చుకోలేక పోతున్నారన్నారు.

చంద్రబాబుతోనే నాయీ బ్రాహ్మణుల అభ్యున్నతి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణుల అభ్యున్నతి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమవుతుందని మరోసారి రుజువైందని నాయీ బ్రాహ్మణ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కందుకూరి వెంకట్ అన్నారు. స్థానిక పాత గుంటూరు ఆ సంఘ కమ్యూనిటీ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయీ బ్రాహ్మణలకు 150 నుంచి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ప్రకటించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో తుళ్లూరి కిరణ్, మల్లాది నాగరాజు, ఈదర్ శ్రీనాధ్, సాంబశివరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మంత్రి నారాయణతో సమావేశమైన మేయర్ రవీంద్ర, ఎమ్మెల్యేలు నసీర్, మాధవి

'గుంటూరు పశ్చిమ' అభివృద్ధికి సహకారం అందించండి

● మంత్రి నారాయణకు ఎమ్మెల్యే గల్లా మాధవి విజ్ఞప్తి

గుంటూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజక వర్గ అభివృద్ధి కోసం తగిన నిధుల మంజూరు చేయాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, పురపాలక శాఖా మంత్రి పొంగూరు నారాయణను కోరారు. వెలగపూడిలోని సచివాలయంలో బుధవారం ఎమ్మెల్యేలు గల్లా మాధవి, మొహమ్మద్ నసీర్, బూర్ల రామాంజనే యులు, మేయర్ కోవెలమూడి రవీంద్ర హాజరయ్యారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రజలను వేధిస్తున్న ముఖ్యసమస్యలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వీధి కుక్క ల నియంత్రణ, ఖాళీ స్థలాల నిర్వహణ చర్యలు, కాలువల శుభ్రత, మౌళిక వసతుల మెరుగుదల, డ్రైనేజ్ సమస్యలు ప్రధానంగా ఉన్నా యని మంత్రికి ఆమె వివరించారు. వాటిని త్వరగా పరిష్కరించేందుకు ప్రభుత్వం తగిన నిధులు కేటాయించాలని మంత్రిని కోరానన్నారు. ప్రజల సమస్యలు పరిష్కారమయ్యే వరకు నేను నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ సమస్యలపై మంత్రి నారాయణ సానుకూలం గా స్పందించి, చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఆమె తెలిపారు.

సచివాలయాల్లో నెట్ కనెక్షన్ ఇప్పించండి

● మంత్రి నారాయణకు ఎమ్మెల్యే నసీర్ వినతి

గుంటూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో ఇంటర్నెట్ కనెక్షన్ ఇప్పించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ పురపాలక శాఖా మంత్రి పొంగూరి నారాయణను కోరారు. వెలగపూడిలోని సచి వాలయంలో బుధవారం మంత్రి నారాయణను కలిసిన ఆయన వినతి పత్రం అందజేశారు. గుంటూరు నగరంలో సమగ్ర అభివృద్ధి దిశగా పనులు చేపట్టామని, దీనికి మరింత సహకారం అందించాలని మంత్రిని ఎమ్మెల్యే కోరారు. మున్సిపాలిటీలో టీపీఎస్, ఏఈ, శానిటరీ ఇన్స్‌పెక్టర్ వంటి సూపర్‌వై జరీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. నగరంలో విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు స్థలం కేటాయించాలని విన్నవించారు. ఆటోనగర్‌లో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. మంత్రి నారాయణ త్వరలోనే అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

లోతట్టు ప్రాంతాల్లో ఎమ్మెల్యే నసీర్ పర్యటన


లోతట్టు ప్రాంతంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే నసీర్

భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండండి. . ప్రజలకు ఎలాంటి సౌకర్యాలు కావాలన్నా వెంటనే అందించండి.. గడ్డిపాడు చెరువు నీరు ఇళ్లలోకి చేరకుండా అగతవరప్పాడు కాలువలోకి వెంటనే మళ్లించండి అంటూ అధికారులకు తూర్పు ఎమ్మెల్యే నసీర్ ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా నియోజకవర్గంలో నీట మునిగిన లోతట్టు ప్రాంతాలను ఎమ్మెల్యే నసీర్ పరిశీలించారు.

లిక్కర్ స్కామ్ తీగలాగితే తాడేపల్లిలో డొంక కదులుతోంది

● ఏపీఐడీసీ చైర్మన్ దేగల ప్రభాకర్

గుంటూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కాం తీగ లాగితే తాడేపల్లి డొంక కదులుతోందని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ అన్నారు. గుంటూరు నగర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన మద్యం కుంభకోణం దేశంలోనే అతిపెద్ద లిక్కర్ స్కామ్ అని ఆరోపించారు. దేశంలో ప్రకంపనలు రేపిన ఢిల్లీ, ఛత్తీస్‌ఘడ్ లిక్కర్ స్కామ్ కంటే ఏపీ మద్యం కుంభకోణం 10 రెట్లు ఎక్కువని అన్నారు. మద్యం తయారీ కంపెనీలను తమ గుప్పెట్లో పెట్టుకొని, కమీషన్లు ఇచ్చిన కంపెనీలకు మాత్రమే ఆర్డర్లు కట్టబెట్టి, కోట్ల రూపాయలు కొల్లగొట్టారన్నారు. కల్తీ మద్యం అమ్మి వేల మంది ప్రాణాలు హరించి, లక్షల మందిని అనారోగ్యంతో ఆస్పత్రిపాలు చేసిన వ్యక్తి జగన్‌రెడ్డి అని మండిపడ్డారు. ఈ మద్యం కుంభకోణంలో సూత్రధారులు, పాత్రధారుల ఆస్తులను జప్తు చేసి నష్ట పోయిన కుటుంబాలను ఆదుకోవాలన్నారు. పేదల రక్తమాంసాలను పీల్చి పిప్పిచేసిన దొంగలందరూ జైలుకు వెళ్లక తప్పదని దేగల ప్రభాకర్ తేల్చి చెప్పారు.



తుళ్లూరులో జరిగిన బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ శంకుస్థాపన కార్యక్రమంలో ట్రస్టు సభ్యుడు, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ పాల్గొ న్నారు. ట్రస్టు చైర్మన్ బాలకృష్ణ మాట్లాడుతూ బీహార్‌కు చెందిన పేద విద్యార్థినులకు తాను రూ.2 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి చదువుకు బాసటగా నిలిస్తే ఆ ఇద్దరు అక్కాచెల్లెళ్లకు మోహనకృష్ణ ల్యాప్‌టాప్‌లు అందించారని చెప్పారు.
(ఆంధ్రజ్యోతి గుంటూరు)

జాతీయ పతాకం.. మన గౌరవానికి ప్రతీక

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ పతాకం.. మన గౌరవానికి ప్రతీక అని, ప్రతి ఒక్కరూ దేశభక్తిని ప్రదర్శించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అన్నారు. బుధవారం స్థానిక బ్రాడీపేటలో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ జరిగింది. ఆయన మాట్లాడుతూ ఆజాదీ కా అమృత్ మహో త్సవంలో భాగంగా ఈ మూడు రోజులు ప్రజలు, బీజేపీ శ్రేణులు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఆవిష్కరించి సెల్ఫీ తీసుకోవాలని సూచించారు. స్వాతంత్ర్య సమర యోధుల విగ్రహాలను శుభ్రం చేసి, వారికి ఘనంగా నివాళర్పించాలన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ ప్రతి భారతీయుడు జాతీయ పతాకాన్ని గౌరవించాలన్నారు. ఈ ర్యాలీలో కోస్తాంధ్ర ఇన్‌చార్జ్ కొక్కెర శ్రీనివాస్, పాలపాటి రవికు మార్, సత్యనారాయణ, తోట శ్రీనివాస్, నారాయణ రెడ్డి, టీవీ రావు, దర్శనం శ్రీని వాస్, వెలగలేటి గంగా ధర్, రాజేష్ నాయుడు పాల్గొన్నారు.

గుర్రం జాషువా పేరు పెట్టాలి

● ఏపీ సబ్ క్యాబినెట్ కమిటికి మాణిక్యవరప్రసాద్ విజ్ఞాపన

గుంటూరు(తూర్పు), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా గానీ పల్నాడు జిల్లా కు గానీ గుర్రం జాషువా పేరు పెట్టాలని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదు కోరారు. సచివాలయంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ సబ్ క్యాబినెట్ కమిటీకి ఆయన వినతిపత్రం అందజేశారు. మహాకవి గుర్రం జాషువా పల్నాడు జిల్లా వినుకొండలో జన్మించి, గుంటూరు జిల్లాలో తన సాహిత్యం ద్వారా ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచారని వినతిపత్రంలో ఆయన పేర్కొన్నారు. పులివెందుల్లో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరగలేదని జగన్ అంటున్నారని ఆ హక్కు ఆయనకు లేదన్నారు. జగన్ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడడం అంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఆయన ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో జాషువా కళాపీఠం నాయకులు నూతక్కి సతీష్, అత్తోట జోసఫ్‌కుమార్, సౌపాటి రమేష్‌బాబు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఉన్నారు.


రొంపిచర్ల : మునమాక వద్ద చప్టాను తాకుతూ ప్రవహిస్తున్న వర్షపు నీరు

వర్ష బీభత్సం

● జిల్లావ్యాప్తంగా ముంచెత్తిన వాన
● కుంభవృష్టితో జన జీవనం అస్తవ్యస్తం
● ఉప్పొంగిన వాగులు.. స్తంభించిన రాకపోకలు
● లోతట్టు ప్రాంతాలు సహా పలు గ్రామాలు జలదిగ్బంధం


పెదకూరపాడు: కంభంపాడు వాగు వద్ద అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ అరుణ్ బాబు


పెదకూరపాడు వద్ద కోతకు గురైన రహదారి


పిడుగురాళ్ళ: కోనంకి వెళ్లే చప్టాపై వరద ఉధృతిని పరిశీలించి పోలీసు, రెవెన్యూ అధికారులను కాపలాగా వుంచిన తహసీల్దార్ మధుబాబు

(ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్)

గంట... రెండు గంటలు కాదు. ఏకంగా ఐదారు గంటలకు పైగా జిల్లా అంతటా వర్షం కుంభవృష్టిగా కురిసింది. ఎడతెరపి లేకుండా మంగళవారం రాత్రి 10 గంటలకు మొదలుకొని బుధవారం వేకువజాము వరకు వర్షం కురవడంతో దాని ప్రభావం జిల్లాపై తీవ్రంగానే చూపించింది. ఒక్క రాత్రిలోనే నెల అంతటా కలుపుకుని కురిసే వర్షం పడటంతో వరద పోటెత్తింది. ఎటు వీలుంటే అటు ఉధృతంగా ప్రవహించి లోతట్టు, నివాస ప్రాంతాలను నీట ముంచేసింది. అమరావతిలో రికార్డు స్థాయిలో 165.5 మీమీ వర్షపాతం నమోదైంది. పలు కాలనీలు, గ్రామాలలకు సంబంధాలను తెంచేసింది. లోలెవల్ చప్టాల వద్ద వరద రోడ్డు పైకి చేరి ప్రవహించడంతో ఆయా మార్గాల్లో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మంగళవారం, బుధవారం కురిసిన వర్షం జిల్లాపై తీవ్ర ప్రభావాన్నే చూపించింది. పట్టణ ప్రాంతాల్లో డ్రెయినేజీ వ్యవస్థలో ఉన్న లోపాలను ఎత్తి చూపింది. పలు ప్రధాన మార్గాల్లోని రోడ్లపై నడుం లోతు పైగా వర్షం నీరు చేరి గంటల తరబడి నిలబడిపోయింది. దీంతో వాహనాల రాకపోలకు ఆటంకం కలిగింది. గుంటూరు, నరసరావుపేట, బాపట్లతో పాటు పలు పట్టణాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు కూడా జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. బుధవారం ఉదయం కార్యాలయాలకు వచ్చిన ఉద్యోగులు, సందర్శకులు లోనికి వెళ్లేందుకు కూడా వీలు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు.

స్తంభించిన రాకపోకలు

గుంటూరు అమరావతి రోడ్డులో లాం వద్ద కొండవీటి వాగు ఉధృతంగా ప్రవహించి రోడ్డు పైకి చేరడంతో ఆ మార్గంలో వాహనాలను నిలిపేశారు. పోలీసులు, పంచాయతీ అధికారులు ఇరువైపులా పహారా కాసి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ కారణంగా ఉదయం హైకోర్టు, సచివాలయానికి ఉద్యోగులు విధులకు హాజరు కాలేకపోయారు. పెద్దపరిమి వద్ద కొట్టేళ్ల వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాజధానికి రాకపోకలు నిలిచాయి. జాతీయ రహదారిపై కాజా టోల్‌ప్లాజా వద్ద వరదనీరు మూడు అడుగుల ఎత్తులో ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగింది. పెదకాకానిలోని నంబూరులో తాగునీటి చెరువు కట్ట తెగిపోవడంతో ఆ గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. పాలడుగు వద్ద వాగు కూడా రహదారిపై ప్రవహిస్తున్నది. ప్రకాశం బ్యారేజీకి అంతకంతకూ పెరుగుతున్న వరద లంక గ్రామాల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. కరకట్టలు బలహీనంగా ఉండడంతో ఆయా గ్రామాల ప్రజలను మరింత కలవరపాటుకు గురిచేస్తోంది.

తప్పిన ప్రమాదాలు..

● మేడికొండూరు మండలంలోని విశదల వద్ద కొండవాగు ఉధృతికి ఎన్ఆర్ఐ కళాశాల వద్ద పార్కింగ్ చేసి ఉన్న కారు కొట్టుకుపోయింది. అందులో ఎవరూ లేకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

రైళ్లకు కాషన్ ఆర్డర్

భారీవర్షాలతో రైళ్ల రాకపోకలకు కూడా అంతరాయం కలిగింది. గుంటూరు-తెనాలి మార్గంలో 14వ నంబరు వంతెన వద్ద వరదనీరు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుండటంతో రైళ్ల వేగాన్ని 30 కిలోమీటర్లకు తగ్గించారు. అలానే పిడుగురాళ్ల - బెల్లంకొండ మధ్య 59వ నంబరు వంతెన వద్ద వరద ఉధృతంగా ఉండటంతో రైళ్ల వేగాన్ని 30 కిలోమీటర్లకు తగ్గించారు.


జలకళతో ఎత్తిపోతల జలపాతం

కృష్ణానదిలో పెరిగిన వరద

● ప్రాజెక్టుల నుంచి దిగువనకు నీటి విడుదల

విజయపురిసౌత్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో కృష్ణమ్మ ఉరకలెత్తి ప్రవహిస్తోంది. ఎగువ ప్రాజెక్టుల నుంచి పోటెత్తుతోన్న వరదతో శ్రీశైలం నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి 2,28,141 క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో బుధవారం ప్రాజెక్ట్ అధికారులు 26 క్రస్ట్‌గేట్లను తెరిచి దిగువకు నీటిని విడుదల చేశారు. జలాశయ నీటి మట్టం 588.90 అడుగులు ఉంది. ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 28,754, కుడి కాల్వ ద్వారా 4050, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, 4 క్రస్ట్ గేట్లను 10 అడుగులు, 22 క్రస్ట్‌గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 2,34,850 క్యూసెక్కులు, మొత్తం ఔట్ ఫ్లోగా 2,69,445 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

ఎత్తిపోతలకు జలకళ

విజయపురిసౌత్: భారీ వర్షాలతో మాచర్ల మండలంలోని పర్యాటక ప్రాంతమైన ఎత్తిపోతల జలకళను సంతరించుకుంది. వాగులు, అటవీ మార్గాల ద్వారా వరదనీరు ఎత్తిపోతల జలపాతానికి చేరుకుంది. దీంతో 70 అడుగుల ఎత్తు నుంచి నీరు కిందకు దుముకుతూ పర్యాటకులను ఆకర్షిస్తోంది. జలపాతం అందాలను చూసేందుకు పర్యాటకులు ఎత్తిపోతలకు చేరుకుంటున్నారు.

పులిచింతలకు 2,75,166 క్యూసెక్కులు

రెంటచింతల: సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన 10 క్రస్ట్‌గేట్లను 3.5 మీటర్లు, 6 గేట్లను 3.0 మీటర్లమేర ఎత్తి పులిచింతలకు 275166 నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ వెంకటరమణ, ఈఈ సుబ్రహ్మణ్యం తెలిపారు. సాగర్ నుంచి 236874 క్యూసెక్కుల నీరొస్తుందన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 74.80 మీటర్ల మేర నీరుంది. విద్యుదుత్పత్తిని నిలిపి వేశామన్నారు.

ప్రకాశం బ్యారేజి వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక

తాడేపల్లి టౌన్: ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది పరవళ్లు తొక్కుతోంది. ఎగువ నుంచి బుధవారం సాయంత్రం 6 గంటలకు 3 లక్షల 63 వేల 438 క్యూసెక్కుల వరదనీరు ఇన్‌ఫ్లోగా నమోదైంది. కాగా రాత్రి 7 గంటలకు 3 లక్షల 97 వేల క్యూసెక్కుల వరద నీరు బ్యారేజిని తాకడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా మొత్తం 70 గేట్లను ఎత్తి దిగువకు 3 లక్షల 97 వేల 250 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్‌శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజికి వరద ఉధృతి పెరుగుతుండడంతో దిగువ ప్రాంతాల వారు, లంక భూముల రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు సూచించారు.


బుధవారం తెల్లవారుజామున కాజ టోల్‌గేటు వద్ద హైవేపై వరద నీటి ఉధృతి


రాజుపాలెం: అనుపాలెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు


గుంటూరులో నీట మునిగిన వెన్‌లాక్ మార్కెట్


తాడేపల్లి: సీతానగరం ఘాట్‌ల వద్ద కృష్ణానది వరద ఉధృతి

మంగళగిరిలో బ్రాహ్మణి పర్యటన

● చేనేతల సాధకబాదకాలపై ఆరా
● ఘనస్వాగతం పలికిన టీడీపీ శ్రేణులు


మంగళగిరిలోని చేనేత దుకాణంలో వస్త్రాలను కొనుగోలు చేస్తున్న బ్రాహ్మణి

మంగళగిరి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ సతీమణి బ్రాహ్మణి బుధవారం మంగళగిరిలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా నగరంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆమె స్వయంగా పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. నగరంలో ఓ ప్రైవేటు చేనేత వస్త్ర దుకాణాన్ని ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ మంగళగిరి చేనేత వస్త్రాలు ఇంకా పెద్దఎత్తున మార్కెటింగ్ కావాలని, దేశవిదేశాలలో మంగళగిరి చేనేత బ్రాండ్ మారుమోగిపోవాలని ఆకాంక్షించారు. మంగళగిరి చేనేతకు ఓ సమున్నతమైన గౌరవాన్ని తీసుకొచ్చేందుకు మంత్రి నారా లోకేశ్ చిత్తశుద్ధితో గట్టిగా పోరాడుతున్నారని చెప్పారు. అలాగే లోకేశ్ ఆధ్వర్యంలో మంగళగిరి రూపురేఖలు పూర్తిగా మారిపోతున్నాయన్నారు. నగరమంతటా యుడీజీ, గోల్డ్‌హబ్, 46 పార్కులు, శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవాలయం అభివృద్ధి వంటి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను లోకేశ్ చాల వేగంగా పట్టాలెక్కిస్తున్నారన్నారు. ఇవన్నీ రాగల కొద్ది సంవత్సరాలలోనే పూర్తయి...మంగళగిరి దేశ ప్రజలను ఆకట్టుకునే గొప్ప ఆదర్శ నియోజకవర్గంగా రూపుదాలుస్తుందన్నారు. ఈ సందర్భంగా ఓ చేనేత చీరెను బ్రాహ్మణి కొనుగోలు చేశారు.

అనంతరం కాజలో బీసీ ఫైన్సాన్స్ కార్పోరేషన్-ఈడ బ్ల్యూయస్ సంయుక్త సహకారంతో నిర్వహిస్తున్న ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాన్ని బ్రాహ్మణి సందర్శించారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి కాలనీలోని 0.35 ఎకరాల్లో రూ 1.06 కోట్ల వ్యయంతో ఎంటీఎంసి అభివృద్ధి చేసిన పార్కును బ్రాహ్మణి సందర్శించారు. పార్కు వినియోగాన్ని గురించి స్థానిక మహిళలతో కాసేపు ముచ్చటించారు. అనంతరం సరదాగా పార్కులో ఏర్పాటుచేసిన ఉయ్యాలపై వూగారు.

శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం వద్ద దివీస్ లేబొరేటరీస్ సంస్థ సహకారంతో ఏర్పాటుచేసిన ఆర్వో మినరల్ వాటర్‌ప్లాంటును పరిశీలించారు. అనంతరం ఎగువ సన్నిధికి భక్తులు వెళ్లి వచ్చేందుకు లోకేశ్ ఏర్పాటుచేయించిన ఉచిత ఈవీ ఏసీ బస్సులను పరిశీలించారు. సదరు బస్సులో ఎక్కి భక్తులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమాలలో దర్శి నియోజకవర్గ టీడీపి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి, టీడీపి పట్టణశాఖ అధ్యక్షుడు పడవల మహేష్, నాయకులు దామర్ల రాజు, షేక్ రియాజ్, రంగిశెట్టి నరేంద్ర (బాబీ), మంగళగిరి పీఎసీయస్ అధ్యక్షుడు గాదె పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్యం ఆరంభ దశలోనే బలమైన పునాది పడాలి

● స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి


సెమినార్‌లో మాట్లాడుతున్న అధికారులు, ప్రతినిధులు

గుంటూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): బాల్యం ఆరంభ దశలోనే చిన్నారులకు బలమైన పునాది పడాలని స్త్రీ, శిసుసంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి చెప్పారు. గుంటూరు అమరావతి రోడ్డులోని సెమినార్ హాల్లో బుధవారం ఆమె అధ్యక్షతన పూర్వ ప్రాథమిక విద్య- పునాది అంశంపై సెమినార్ జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ రవిప్రకాశ్‌రెడ్డి ప్రత్యేక అవసరాలున్న బాలల కోసం కూడా ఈసీసీ ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారి నుంచి పూర్వ ప్రాథమిక విద్య బలోపేతంపై సలహాలు, సూచనలు తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సేకరించిన సలహాలు, సూచనలతో ఆచరణ యోగ్యమైన ప్రణాళిక రూపొందించి అమలు చేస్తామని తెలిపారు. సమావేశంలో పాఠశాల విద్య, గిరిజన సంక్షేమ, ఎస్సీ ఈఆర్టీ శాఖల ప్రతినిధులు, యూనిసెఫ్, ప్రథమ్, ఐటీసీ, క్రిస్స్, పడాల చారిటబుల్ ట్రస్టు తదితర ఎన్జీవో సంతస్థలు, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఆశలు వెల్లివిరిసేలా..

● ఆశా వర్కర్లపై కూటమి ప్రభుత్వం వరాల జల్లు
● పూర్తి వేతనంతో కూడిన ఆరునెలల ప్రశూతి సెలవులు
● 62 ఏళ్ళ వరకూ విధులు

సత్తెనపల్లి ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు పెంచడం సీజనల్ వ్యాధులు, ప్రాణాంతక వ్యాధులపై ప్రజలలో అవగాహన తదితర కీలకమైన వైద్య ఆరోగ్య సేవలను అందించే ఆశావర్కర్లపై రాష్ట్ర ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. ఈ మేరకు జీఓ 94 ఉత్తర్వులను వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి కృష్ణ బాబు మంగళవారం విడుదల చేశారు. ఈ ఉత్తర్వులతో జిల్లాలోని ఆశా వర్కర్లకు నేరుగా ప్రయోజనం లభిస్తుంది.

ఇవి వివరాలు..

ఇప్పటివరకు ఆశావర్కర్లకు లేని ప్రసూతి సెలవులను ఇకపై ఆరు నెలలు పూర్తి వేతనంతో ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ వెసులుబాటు రెండు కాన్పుల వరకే పరిమితం చేశారు. 2010లో నియమితులైన ఆశా వర్కర్లకు ఈ సదుపాయాన్ని వినియోగించుకునే అవకాశం ఉండక పోవచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. తొలిసారిగా ఆశా వర్కర్లకు 62 సంవత్సరాలు గరిష్ట ఉద్యోగ కాలంగా ప్రకటించారు. ఎప్పటినుంచి అమలు చేయనున్నారో స్పష్టత రావాల్సిఉంది. ఆశావర్కర్లకు నెలకు రూ.10వేల గౌరవవేతనంగా చెల్లిస్తున్నారు. ఇందులో రూ.7200 రాష్ట్ర ప్రభుత్వం మిగతా రూ.2800 కేంద్ర ప్రభుత్వం ఎన్.హెచ్.ఎం స్కీంద్వారా ఆశావర్కర్ల బ్యాంకు ఖాతాలకు నెలనెలా వేర్వేరుగా జమచేస్తున్నారు. ఆశావర్కర్ ఉద్యోగ విరమణ తరువాత ఆర్థిక భద్రత కోసం 1లక్షా 50వేల రూపాయలు గ్రాట్యూటీని, నెలకు 5 వేల రూపాయల చొప్పున గరిష్టంగా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడం పట్ల ఆశా వర్కర్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అన్ని రంగాల్లో రాణించేలా
విద్యార్థులను తీర్చిదిద్దాలి

● రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ

గుంటూరు(తూర్పు), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాలు, గురుకుల విద్యాసంస్థల విద్యార్థులను అన్ని రంగాల్లోనూ రాణించేలా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేయాలని రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ, ఎక్స్ అఫిషియో కార్యదర్శి ఎస్ సత్యనారాయణ తెలిపారు. గుంటూరు కలెక్టరేట్‌లో బుధవారం కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల గురుకుల విద్యాసంస్థల ప్రిన్సిపల్స్, బీసీ వెల్ఫేర్, వసతి గృహాల సంక్షేమ అధికారులతో జరిగిన ప్రేరణ సమావేశంలో ఆయన ప్రసంగించారు. సంక్షేమ వసతిగృహాలు రోల్ మోడల్‌గా ఉండేలా అధికారులు విధులు నిర్వహించాలన్నారు. విద్యతోపాటు వ్యక్తిత్వ వికాసం పెంపొందించాలన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలన్నారు. అధికారులు వసతిగృహాల సమీపంలోనే నివాసం ఉంటూ సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించేలా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. వసతి గృహాల్లో సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. మహాత్మ జ్యోతీబాపూలే రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి మాధవీలతా మాట్లాడుతూ విద్యతోపాటు వారికి ఆసక్తిఉన్న రంగాల్లో ప్రోత్సహించాలన్నారు. రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ డైరెక్టర్ చంద్రశేఖరరాజు మాట్లాడుతూ అత్యున్నత నాణ్యత ప్రమాణాలతో విద్యనందించాలన్న ఉద్దేశంతో అధికారులకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డీఎస్పీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ వసతిగృహాల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో వ్యక్తిత్వవికాస నిపుణులు ప్రత్యూష సుబ్బారావు, సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి మయూరి వివిధ జిల్లాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ సత్యనారాయణ, పాల్గొన్న జిల్లాల అధికారులు

ఆశలు కల్పిస్తున్న 'బ్యాక్టీరియో ఫేజ్' చికిత్సలు!

● సెప్టిక్ షాక్ రోగికి ఫేజ్ చికిత్స, కోలుకున్న వైనం
● ఏపీలో మొదటిసారిగా గుంటూరు ఫేజ్ చికిత్సలు


కోలుకున్న ప్రభావతితో వైద్యులు కళ్యాణ్ చక్రవర్తి, రామకృష్ణ

గుంటూరు మెడికల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): వివిధ మొండి జబ్బులకు ఔషధ నిరోధకత వేగంగా విస్తరిస్తున్న నేటి తరుణంలో.. చీకటిలో చిరుదీపంలా బ్యాక్టీరియో ఫేజ్ చికిత్సలు కనిపిస్తున్నాయి. మొండి బ్యాక్టీరియాలను (సూపర్ బగ్స్) అంతం చేసేందుకు అదే బ్యాక్టీరియాలను ఉపయోగించమే ఫేజ్ థెరపీ. రాష్ట్రంలో తొలిసారిగా గుంటూరులోని శ్రీహాస్పిటల్స్‌లో ఫేజ్ థెరపీ ఉపయోగించి తీవ్రమైన ఇన్‌ఫెక్షన్‌తో సెప్టిక్ షాక్‌లో వచ్చిన రోగిని రక్షించారు. శ్రీహాస్పిటల్స్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఇన్‌ఫెక్షన్ వ్యాధుల స్పెషలిస్ట్ డాక్టర్ కే కళ్యాణ్‌చక్రవర్తి ఈ కేసు వివరాలను తెలిపారు. బాపట్ల జిల్లా వెదుళ్లపల్లికి చెందిన ప్రభావతి(72) థైరాయిడ్ కేన్సర్‌కు గురయ్యారు. ఇది కుడి తొడ తుంటి ఎముకకు పాకడంతో..వైద్యులు హిప్ ఇంప్లాంట్ వేశారు. ఇంప్లాంట్ వేసిన ప్రాంతంలో ఎముక, కండరాలు తీవ్రమైన ఇన్‌ఫెక్షన్‌కు గురయ్యాయి. యాంటీబయోటిక్ మందులు వాడినా ఫలితం కనిపించలేదు. ఆమె సెప్టిక్ షాక్‌లో వెళ్లారు. దీంతో చివరి ప్రయత్నంగా ఈ ఏడాది జనవరి 26న ఆమెను చికిత్స కోసం గుంటూరులోని శ్రీ హాస్పిటల్స్‌కు తెచ్చారు.

వైద్య పరీక్షల్లో ఎసినిటో బ్యాక్టర్ బోమాని అనే సూపర్ బగ్ బారినపడటంతో ఆమె ఇన్‌ఫెక్షన్‌కు గురైనట్లు వైద్యులు గుర్తించారు. కుటుంబ సభ్యుల ఆమోదంతో చివరి ప్రయత్నంగా... కారుణ్య చికిత్స కింద బ్యాక్టీరియో ఫేజ్ థెరపీ ప్రారంభించారు. తుంటి ఇన్‌ఫెక్షన్‌కు ఫేజ్ చికిత్స చేశారు. వారంలో మూడురోజుల చొప్పున రెండు పర్యాయాలు ఫేజ్ బ్యాక్టీరియోను ఇన్‌ఫెక్షన్‌లో పంపారు. అరగంట తర్వాత డ్రెయిన్ ద్వారా ఫేజ్‌ను బయటకు పంపారు. ఫేజ్ చికిత్స సూపర్‌బగ్‌ను అంతంచేసింది. కొద్దికాలంలోనే ఇన్‌ఫెక్షన్ పూర్తిగా తగ్గి గాయం నయమైందని డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. బెనారస్‌లోని డాక్టర్ గోపాల్ నాథ్ నుంచి బ్యాక్టీరియో ఫేజ్‌ను గుంటూరుకు తెప్పించి చికిత్సలు చేసినట్లు వివరించారు. క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ ఫేజ్ థెరపీ మొండి ఇన్‌ఫెక్షన్లను తగ్గించడంతో పాటు రోగుల వ్యాధి నిరోధక శక్తిని పెంచే ఇమ్యునోథెరపీగా కూడా ఉపయోగపడుతుందని తెలిపారు.

జీఎంసీలో ప్రావిడెంట్ ఫండ్ కుంభకోణం

● ఉద్యోగి దుర్గాభవానీకి షోకాస్ నోటీసులు జారీ
● అదనపు కమిషనర్ చల్ల ఓబులేసు

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థలో ఆర్ఐగా పనిచేస్తున్న రేణుక దుర్గాభవానీ నగర అదనపు కమిషనర్ షోకాజ్ నోటీసులు బుధవారం జారీ చేశారు. రవీంద్రనగర్‌లో మున్సిపల్ స్కూల్లో టీచర్‌గా పనిచేస్తున్న రమాదేవి 2021లో తన పీఎఫ్ ఖాతా నుంచి రూ.8,21,000 డ్రా చేసుకున్నారు. అయితే సదరు సొమ్ము పీఎఫ్ ఖాతాలో విత్ డ్రా చేసుకున్నట్లు పీఎఫ్ సెక్షన్‌లో పనిచేసే రేణుకా దుర్గా భవానీ(ప్రస్తుతం ఆర్ఐగా పనిచేస్తున్నారు) పీఎఫ్ ఖాతాలో నమోదు చేయలేదు. సదరు టీచర్ లోన్ తీసుకున్నప్పటికి లోన్ తీసుకోలేనట్లుగా పీఎఫ్ ఖాతాలో కనిపిస్తుంది. ప్రస్తుతం మున్సిపల్ టీచర్లను విద్యాశాఖకు బదిలీ చేయడంతో పీఎఫ్ ఖాతాను సెటిల్‌మెంట్ చేసుకునేందుకు నగరపాలక సంస్థ కార్యాలయానికి వచ్చిన సదరు టీచర్ విషయం తెలుసుకుని నగర అదనపు కమిషనర్ చల్లా ఓబులేసుకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు అదనపు కమిషనర్ దుర్గాభవానీకి షోకాజ్ నోటీసు జారీ చేశారు.

అమరేశ్వరాలయ వార్షిక పవిత్రోత్సవాలు ప్రారంభం

అమరావతి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయ వార్షిక పవిత్రోత్సవాలు బుధవారం ఉదయం భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు, వేదపండితులు పవిత్రోత్సవాలను మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణలతో ప్రారంభించగా దేవస్థాన సహాయ కమిషనర్ రేఖ పర్యవేక్షించారు. ఆధ్యాత్మిక ప్రసంగాన్ని పీసపాటి నాగేశ్వరశర్మ నిర్వహించారు. ఉదయం ఆలయ శుద్ధి, ప్రధాన, ఉపాలయాలలోని దేవతామూర్తులకు అభిషేకాలు నిర్వహించారు. విఘ్నేశ్వరపూజ, ప్రధాన కలశస్థాపన చేశారు. సాయంత్రం అగ్నిప్రతిష్టాపన, దీక్షా హోమాలు, మండప దేవతా హవనములు, మండప పూజలు, హారతి మంత్రపుష్పం నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే పవిత్రోత్సవాలు శుక్రవారం పూర్ణాహుతితో ముగుస్తాయి.


పవిత్రోత్సవాలను ప్రారంభిస్తున్న అర్చకులు, వేదపండితులు

నవ్య
కుటుంబ కదంబం

గురువారం
14 ఆగస్టు 2025





"విదేశీయుల పాలన నుంచి భారతదేశ విముక్తి లక్ష్యంగా సాగిన పోరాటాలు, ఉద్యమాలు, మహనీయుల త్యాగాల ఫలితం ఈనాడు మనమంతా అనుభవిస్తున్న స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు. తెలుగు నేల మీద సంఘ సంస్కరణోద్యమం, జాతీయోద్యమం కలగలిసి... మానవీయ విలువలకు పట్టంకట్టిన అద్భుతమైన కాలం అది. ఆ మహత్తర ఉద్యమాలకు ప్రత్యక్ష సాక్షులు మాత్రమే కాదు, అందులో భాగస్వాములు... గుత్తా జవహరీబాయి, రావూరి మనోరమ, ఏటుకూరి కృష్ణమూర్తి. 'స్వరాజ్యం మా జన్మహక్కు..' అని నినదించి జైలుకు వెళ్లిన, ఆ ముగ్గురు స్వాతంత్ర్య సమరయోధులను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'నవ్య' పలకరించింది.

ఆ త్యాగాలకు ఏదీ విలువ?

అమ్మతో కలసి జైలుకెళ్లాను

- రావూరి మనోరమ,
స్వాతంత్ర్య సమరయోధురాలు, 98 ఏళ్లు

"సొంత గొడవే కానీ స్వాతంత్ర్యోద్యమ విలువలు ఈనాడు పట్టినదెవరికి? ఆనాడు అంతా ఒక్కటై దేశంకోసం పోరాడాం. ఈనాడు ఎవరికి వారు గొప్పగా బతకాలని ప్రతిఒక్కరూ ఆరాటపడుతున్నారు. వ్యక్తిగత స్వార్థం పెరిగింది. మనం ఇవాళ అనుభవిస్తున్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు తమకు పుట్టుకతోనే వచ్చినవేనన్నది ఈ తరం అభిప్రాయం. అవి ఎందరో మహనీయుల పోరాటాలు, త్యాగాల ఫలితంగా సిద్ధించాయన్న కనీస స్పృహ, ఆలోచన నేటి యువతీ, యువకుల్లో లేకపోవడం బాధాకరం. ఉద్యోగరీత్యా ఎన్నో మంచి అవకాశాలను సునాయాసంగా వదిలి జాతీయోద్యమానికి అంకితమయ్యారు మా నాన్న గోపరాజు రామచంద్రరావు (గోరా). సమాంతరంగా ఆంధ్ర దేశంలో కుల నిర్మూలనోద్యమానికి నాయకత్వం వహించారు. నాస్తికోద్యమంలో ఆయనకు శిష్యుడైన రావూరి అర్జునరావుతో నాకు వివాహం జరిపించి గొప్ప ఆదర్శవాదిగా నిలిచారు. ఇప్పుడు ఆ నిబద్ధత, చిత్తశుద్ధి, నిజాయితీ సమాజంలో పెద్దగా కనిపించడం లేదు.

క్విట్ ఇండియా పోరాటం...

ఒక్క స్వాతంత్ర్య పోరాటమే కాదు, సామాజిక మార్పు కోసం మా నాన్న తలపెట్టిన ప్రతి సంఘ సంస్కరణ ఉద్యమంలో అమ్మ సరస్వతీ గోరాతో పాటు మేమంతా పాల్గొన్నాం. క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో విజయవాడలోని ఒకచోట అమ్మ, మా మేనత్త సామ్రాజ్యంతో పాటు నేను, మరి కొంతమంది మహిళలం సమావేశమయ్యాం. అప్పుడు నా వయసు 14 ఏళ్లు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలిస్తూ ర్యాలీకి అలా కదిలామో లేదో... మమ్మల్ని పోలీసులు అరెస్టు చేశారు. విజయవాడ సబ్ జైలులో కొన్ని రోజులు నిర్బంధించిన తర్వాత... మమ్మల్ని రాయవెల్లూరు జైలుకు తరలించారు. కారాగారం అనే మాటేగానీ... ఆట, పాటలతో చాలా సందడిగా ఉండేది. ఒకరితో ఒకరు ఎంతో ప్రేమతో, ఆప్యాయతతో మెలిగేవాళ్లు. జైలర్లు కూడా మమ్మల్ని చాలా గౌరవంగా చూసేవారు. ఆ ఆరునెలల జైలు జీవితం మరచిపోలేని జ్ఞాపకాలను మిగిల్చింది.

మహాత్ముడు నిర్ణయించిన ముహూర్తం...

అర్జునరావుతో నాకు వివాహం నిశ్చయించిన తర్వాత ఆ విషయాన్ని గాంధీగారికి మా నాన్న చెప్పారు. బులుసు సాంబమూర్తి గారి ద్వారా నా ఇష్టాయిష్టాలను తెలుసుకున్న తర్వాత... సేవాగ్రామ్‌లో తన చేతుల మీదుగా మా పెళ్లి జరిపిస్తానని మహాత్మా గాంధీ మాట ఇచ్చారు. అయితే... రెండేళ్లు ఆగమన్నారు. నాకు తూర్పుగోదావరి జిల్లాలోని కస్తూర్బా ఆశ్రమంలో జీవన నైపుణ్యాల శిక్షణ ఇప్పించాల్సిందిగా ఆదేశించారు. అర్జున్‌రావును తన వెంట వార్ధాకు తీసుకువెళ్ళారు. ఏడాది తర్వాత ఒక రోజు... 1948, మార్చి 13న మా వివాహానికి మహాత్మాగాంధీ ముహూర్తం ప్రకటించారు. అంతా సవ్యంగా సాగుతోందని అనుకుంటున్న సమయంలో... ఆ ఏడాది జనవరి 30న గాంధీ హత్యకు గురయ్యారు. బాపూజీ లేకపోయినా, ఆయన నిర్ణయించిన ముహూర్తానికి సేవాగ్రామ్‌లోని కస్తూర్బా కుటీరం దగ్గర ఆనాటి దేశ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ లాంటి మహనీయుల సమక్షంలో... అర్జునరావు, నేను నూలుదండలు మార్చుకొని వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టాం. అతిథులకు వేపిన వేరుశెనగపప్పు, బెల్లం పంచారు.

లోక్‌నాయక్ పరామర్శ...

వివాహానంతరం కృష్ణాజిల్లా వానపాములలో కొన్నాళ్లు ఉన్నాం. ఆ సమయంలో నా యోగక్షేమాలు తెలుసుకోవడంకోసం లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణగారు ఆ ఊరు వచ్చారు. గ్రామంలోని దళితవాడలో మేము నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు చూసి మెచ్చుకొన్నారు. తర్వాత 1960 నుంచి నలభై ఏళ్లకు పైగా గుడివాడలో 'అంబేద్కర్ హరిజన బాలికా వసతి గృహం' నడిపాం. వారందరికీ నేనే స్వయంగా వండి వడ్డిస్తే, అమ్మాయిల చదువు బాధ్యతను అర్జునరావు చూసుకున్నారు. అలా ఎంతో మంది నిరుపేద అమ్మాయిలకు తల్లిదండ్రులుగా మారి, చేతనైన సాయం అందించడానికి ప్రయత్నించాం. ఒంట్లో ఓపికున్నంత కాలం పార్టీ రహిత ప్రజాస్వామ్యాన్ని, నాస్తికవాదాన్ని విస్తృతంగా ప్రచారం చేశాం. ఇప్పుడు మా పిల్లలు మిలావ్, చునావ్, సాదిక్, పవర్, అమ్మాయి సూయజ్ కలసి 'మార్పు' ట్రస్ట్ ద్వారా కొన్నిసామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సంపూర్ణ స్వాతంత్ర్యం రాలేదు

- గుత్తా జవహరి బాయి, 102 ఏళ్లు


"పెద్ద వయసు వల్ల కాలు బయట పెట్టలేకపోయినా, బయట ఏం జరుగుతోందో నాకు తెలుసు. టెలివిజన్‌లో ముఖ్యమైన వార్తలు ప్రతిరోజూ తప్పనిసరిగా చూస్తాను. నేటి రాజకీయాలు బాగోలేవు. అంతా స్వార్థం, అవినీతి, నిలకడలేనితనం. స్వాతంత్ర్యం వచ్చి 78ఏళ్లు అయినా... ఈ దేశంలో ఇంకా కూడు, గూడులేనివారు ఎంతోమంది ఉన్నారంటే, సంపూర్ణ స్వాతంత్ర్యం రాలేదనే కదా అర్థం! ఏమయ్యాయి ఆనాటి స్వాతంత్ర్యోద్యమ ఆశలు, ఆకాంక్షలు? జాతీయోద్యమంలో మా కుటుంబం మొత్తం పాల్గొని జైలుకు వెళ్లింది. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న కారణంగా నా భర్త గుత్తా సుబ్రహ్మణ్యం సోదరులు రామానుజయ్య, రాఘవయ్య, చలమయ్య, మా ఆడపడుచు రాజారత్నం, నా పెద్ద తోటి కోడలు సుందరమ్మ... వీరంతా జైలు శిక్ష అనుభవించారు. సుందరమ్మ అయితే విష జ్వరంతో బాధపడుతూ రాయవెల్లూరు జైలులోనే మరణించింది. 'బ్రిటిష్ ప్రభుత్వం నశించాలి', 'స్వాతంత్ర్యం కావాలి' అని రోడ్డుమీద నినాదాలు చేసినందుకు నన్నూ అరెస్టు చేసి, కొద్దిరోజులు జైల్లో ఉంచారు.

నేతాజీకి మా నాన్న స్నేహితుడు

నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌కు మా నాన్న గుంటూరు సుబ్బారావు మంచి స్నేహితుడు. కోల్‌కతా ఒరియంటల్ కాలేజీలో వారిద్దరికీ పరిచయం. వారిమధ్య చాలాకాలం ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా నడిచాయి. నేతాజీ స్ఫూర్తితో మా నాన్న కూడా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లారు. నాన్నకు ఫార్వర్డ్ బ్లాక్ పార్టీతో సత్సంబంధాలున్నాయని తెలిసి పోలీసులు చాలారోజులు ఆయనను వెంటాడారు. అటు నా పుట్టింటివారు, ఇటు మెట్టినింటి వారు స్వాతంత్ర్యోద్యమంతో పాటు సంఘ సంస్కరణోద్యమంలోనూ భాగమయ్యారు. ఇప్పుడు ఆ విలువలను కొనసాగించడానికి యువత ముందుకు రావాలి. మహనీయుల వారసత్వాన్ని అందిపుచ్చుకోవాలి."

రహస్యంగా పత్రికలు బట్వాడా చేశా...

- ఏటుకూరి కృష్ణమూర్తి, 104 ఏళ్లు



"సామాజిక మార్పును కోరే కమ్యూనిస్టులే కలసి పని చేయలేకపోతున్నారు. ఇక సామాన్యులు ఐకమత్యంతో ఉండాలని కోరుకోవడం అత్యాశ అవుతుందేమో. గుంటూరు టౌన్ హైస్కూల్లో ఎస్ఎల్‌సీ చదువుతున్న రోజుల్లో 'క్విట్ ఇండియా' ఉద్యమానికి మద్దతుగా మేము నిరసన సభ నిర్వహించాం. కొందరు స్నేహితులం కలసి లాలాపేట పోలీస్ స్టేషన్‌మీద జాతీయ జెండా ఎగరేశాం. దాంతో పోలీసులు మమ్మల్ని అరెస్టు చేసి గుంటూరు సబ్ జైలులో నిర్బంధించారు.
మాకు సంఘీభావంగా స్థానికులు పెద్ద సంఖ్యలో పరామర్శకు వస్తుండడంతో... మమ్మల్ని బాపట్ల, మంగళగిరి... అలా రకరకాల ప్రదేశాలు తిప్పారు. మేము నాలుగు నెలలకు పైగా జైలు జీవితం గడిపాం. దేశభక్త కొండా వెంకటప్పయ్య గారి మనుమలు నాకు మంచి స్నేహితులు. వారి ఇంటికి తరచుగా వెళ్లేవాణ్ణి. మరోవైపు ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు లాంటి నాయకులను కలిసేవాణ్ణి.

ఆర్మీలో తిరుగుబాటు...

మా బాబాయి ఏటుకూరి జోగిరాజు సైమన్ కమిషన్ వ్యతిరేక పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. ఆయన స్ఫూర్తితోనే నేనూ జాతీయోద్యమంలోకి వెళ్లాను. విజయవాడ నుంచి భారత కమ్యూనిస్టు పార్టీ 'స్వతంత్ర భారత్' పత్రిక ప్రచురించేది. ఆ పత్రికను గుంటూరులోని జాతీయోద్యమ నాయకులకు పంచే బాధ్యత నాది. అలా రహస్యంగా చాలాకాలం ఆ పత్రికల్ని బట్వాడా చేశాను. కొన్నాళ్లకు 'బ్రిటిష్ - ఇండియా ఆర్మీ'లో చేరాను. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా రాయల్ ఇండియన్ నేవీ సైనికులు తిరుగుబాటు ప్రారంభించారు. వారికి మద్దతుగా నేనూ నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నాను. మమ్మల్ని అరెస్టు చేసి, లాహోర్ జైల్‌లో కొన్నాళ్లు నిర్బంధించారు. దేశానికి స్వాతంత్ర్యం ప్రకటించిన తర్వాత మమ్మల్ని విడుదల చేశారు. ఆ వెంటనే ఆంధ్రా రెవెన్యూ శాఖలో ఉద్యోగిగా కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో చేరాను. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులకు నావంతుగా సహకారం అందించాను. ప్రస్తుతం స్వాతంత్ర్య సమరయోధుల సంఘానికి ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నాను. రోజూ దినపత్రికలే నా కాలక్షేపం."

• సాంత్వన్
ఫొటోలు: హరిప్రేమ్

స్వాతంత్ర్యదినోత్సవం రోజున మువ్వన్నెల జెండాను ఎగురవేస్తాం. ఆ జెండాలోని మూడు రంగులను ప్రతిబింబించేలా తిరంగా ట్రీట్ తయారుచేసుకుని కుటుంబసభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఆస్వాదిస్తే... ఆ ఆనందాన్ని మాటల్లో చెప్పలేం. అలాంటి తిరంగా ట్రీట్ తయారీ మీకోసం...

తిరంగా ట్రీట్..!

ఆరెంజ్ కివి కస్టర్డ్



కావాల్సిన పదార్థాలు

వెనీలా కస్టర్డ్ పౌడర్- మూడు చెంచాలు, కివి పండ్లు- రెండు, ఆరెంజ్ జెల్లీ పౌడర్- ఒక ప్యాకెట్, పాలు- రెండు కప్పులు, పంచదార- రెండు చెంచాలు

తయారీ విధానం

- కివి పండ్లను సన్నని చక్రాల్లా కోసుకోవాలి. ఒక గిన్నెలో మూడు కప్పుల వేడి నీళ్లు తీసుకుని ఆరెంజ్ జెల్లీ పౌడర్ వేసి కరిగించాలి. మరో గిన్నెలో ఒక కప్పు పాలు పోసి కస్టర్డ్ పౌడర్ వేసి ఉండలు లేకుండా కలపాలి.
- స్టవ్ మీద గిన్నె పెట్టి ఒక కప్పు పాలు పోసి పంచదార వేసి కరిగించాలి. తరువాత కస్టర్డ్ పౌడర్ కలిపిన పాలు పోస్తూ బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని రెండు నిమిషాలు మరిగించి స్టవ్ మీద నుంచి దించాలి.
- ఎనిమిది గాజు గ్లాసులను తీసుకొని ఒక్కోదానిలో రెండు కివి చక్రాలు వేయాలి. గ్లాస్‌లో సగం వరకు కస్టర్డ్ మిశ్రమాన్ని పోయాలి. ఫ్రిజ్‌లో పావుగంటసేపు ఉంచాలి. తరువాత గ్లాసుల్లో ఆరెంజ్ జెల్లీ మిశ్రమం వేసి మరో అరగంటసేపు ఫ్రిజ్‌లో ఉంచాలి. తరువాత చల్ల చల్లగా సర్వ్ చేసుకోవాలి.

తిరంగా పలావ్



కావాల్సిన పదార్థాలు

బాస్మతి బియ్యం, నెయ్యి, జీలకర్ర, అల్లం వెల్లుల్లి పేస్టు, రెడ్ చిల్లీ పేస్టు, పసుపు, కేరట్ ప్యూరీ, పాలక్ ప్యూరీ, మిరియాల పొడి, గరం మసాల పొడి, ఉప్పు- తగినంత

తయారీ విధానం

- ముందుగా బాస్మతి బియ్యాన్ని కడిగి పొడిపొడిగా ఉండేలా వండుకోవాలి.
- **ఆరెంజ్ రైస్:** స్టవ్ మీద గిన్నె పెట్టి ఒక చెంచా నెయ్యి వేసి వేడి చేయాలి. అర చెంచా జీలకర్ర, ఒక చెంచా అల్లం వెల్లుల్లి పేస్టు, పావు చెంచా పసుపు, అర కప్పు కేరట్ ప్యూరీ, ఒక చెంచా రెడ్‌చిల్లీ పేస్టు, తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి. తరవాత ఒక కప్పు బాస్మతి అన్నం వేసి కలిపి స్టవ్ మీద నుంచి దించాలి.
- **వైట్ రైస్:** ఒక కప్పు బాస్మతి అన్నంలో ఉప్పు, మిరియాల పొడి వేసి కలపాలి.
- **గ్రీన్ రైస్:** స్టవ్ మీద గిన్నె పెట్టి ఒక చెంచా నెయ్యి, ఒక చెంచా రెడ్ చిల్లీ పేస్టు, ఒక చెంచా గరం మసాల పొడి, ఒక కప్పు పాలక్ ప్యూరీ, తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి. రెండు నిమిషాల తరవాత స్టవ్ మీద నుంచి దించాలి.
- సర్వింగ్ ప్లేట్ మీద ఒక మౌల్డ్‌ను ఉంచాలి. ఇందులో గ్రీన్ రైస్‌ను లేయర్‌లా వేయాలి. తరవాత వైట్ రైస్‌ను వేసి సర్దాలి. పైన ఆరెంజ్ రైస్‌ను వేసి లోపలికి ఒత్తాలి. ఇప్పుడు మెల్లగా మౌల్డ్‌ను తీసివేయాలి. తిరంగా పలావ్ తినడానికి రెడీ..!

చెఫ్: **రూప నబర్,** టిటికె ప్రిస్టేజ్

బాల్కనీలో తోట పెంచుదాం..!

చిన్న చిన్న పూల మొక్కలే కాదు ఆకు కూరలు, కూరగాయల మొక్కలను కూడా బాల్కనీలో పెంచవచ్చని చెబుతున్నారు నిపుణులు. ఉన్న కొద్ది స్థలంలోనే పలు రకాల మొక్కలతో కూడిన తోటను ఎలా పెంచాలో తెలుసుకుందాం...



- ముందుగా ఏయే మొక్కలు పెంచాలనుకుంటున్నారో ఒక జాబితా రాయాలి. ఏ మొక్కలకు ఎండ అవసరమో, వేటికి అవసరం లేదో తెలుసుకోవాలి. బాల్కనీలో ఏ ప్రదేశంలో ఎండ ఎక్కువగా ఉంటుందో పరిశీలించాలి. అసలు ఎండ రాని చోటుని కూడా గుర్తించాలి. అలాగే ఏ ప్రదేశంలో ఏ సమయంలో ఎంతసేపు ఎండ నిలుస్తుందో గమనించాలి.
- ఎండ బాగా తగిలే చోట టమాటా, వంకాయ, పచ్చి మిర్చి మొక్కల కుండీలు పెట్టాలి. మరీ ఎక్కువసేపు కాకుండా కొద్దిసేపు ఎండ నిలిచే చోట పుదీనా, కొత్తిమీర, మెంతి కూర మొక్కల కుండీలు అమర్చాలి. అలాగే పూల మొక్కలకు కూడా కొద్దిసేపు ఎండ తగిలేలా చూసుకోవాలి.
- బాల్కనీలో గోడవారగా ఐరన్ స్టాండ్‌లు పెట్టి వాటిలో గ్రోబ్యాగ్స్ ఏర్పాటు చేసుకుని కూరగాయల మొక్కలు పెంచవచ్చు. అలాగే వివిధ సైజుల్లో లభ్యమయ్యే ట్రేలలో ఆకుకూరల మొక్కలు నాటవచ్చు. తీగజాతి కూరగాయల మొక్కలను బాల్కనీ గ్రిల్‌కి అల్లుకునే ఏర్పాటు చేయవచ్చు.
- బాల్కనీలో పెంచే మొక్కలన్నింటికీ ఒకేసారి ఒకేలా నీళ్లు పోయకూడదు. కుండీ సైజు, మట్టి స్వభావం, మొక్క అవసరం, ఎండ తీవ్రత, వాతావరణం తదితరాలను దృష్టిలో ఉంచుకుని తగురీతిలో మాత్రమే నీళ్లు అందించాలి.
- కుండీల్లో నీటిని ధారగా పోయకుండా పిచికారీచేసే విధానాన్ని అనుసరిస్తే ప్రయోజనకరంగా ఉంటుంది.

మరకలు ఇలా మాయం!

కొన్నిసార్లు దుస్తుల మీద టీ, ఇంకు మరకలు వంటివి పడుతుంటాయి. సబ్బుతో ఎంత శుభ్రం చేసినా ఆ మరకలు పూర్తిగా తొలగిపోవు. అలాంటి మరకలను ఎలా తొలగించాలో తెలుసుకుందాం..



- కాఫీ లేదా టీ మరకలు అంటిన వస్త్రం మీద బేకింగ్ సోడా చల్లి వెనిగర్‌తో తుడవాలి. తరువాత మామూలుగా ఉతికేస్తే ఆ మరకలు పోతాయి.
- నూనె లేదా గ్రీజ్ మరకలు అంటితే అక్కడ బేకింగ్‌సోడా లేదా తెల్ల చాక్‌పీస్ పొడి చల్లాలి. కొంచెంసేపటికి సోడా లేదా చాక్‌పీస్ పొడి వస్త్రం మీద ఉన్న నూనె లేదా గ్రీజ్‌ను పీల్చుకుంటాయి. తరువాత మామూలుగా ఉతికేస్తే సరిపోతుంది.
- ఒక గిన్నెలో పాలు పోసి ఇంక్ మరకలు అంటిన వస్త్రాన్ని అందులో నానబెట్టాలి. కొంచెంసేపటి తరువాత ఉతికేస్తే సరిపోతుంది.
- లిప్‌స్టిక్ మరకలను తొలగించడంలో ఆల్కహాల్ బాగా పనిచేస్తుంది. దూది ఉండను ఆల్కహాల్‌లో ముంచి మరకలున్న చోట తుడిస్తే మరకలు పోతాయి.
- చెమట మచ్చల మీద నిమ్మరసం పిండి ఆ వస్త్రాన్ని కొంచెంసేపు ఎండలో ఉంచాలి. తరువాత శుభ్రం చేస్తే మరకలు పోతాయి.
- ఫౌండేషన్, మస్కారా వంటి మరకలు అంటిన చోట షేవింగ్ క్రీమ్ రాయాలి. అయిదు నిమిషాల తరువాత నీటితో ఉతికేస్తే మరకలు తొలగిపోతాయి.

కౌన్సెలింగ్

చర్మానికి ఆ క్రీమ్స్ వద్దు

Q A

డాక్టర్! నేను గత కొన్నేళ్లుగా చర్మం తెల్లబడడం కోసం క్రీమ్స్ వాడుతున్నాను. వాటితో చర్మం తెల్లబడింది. అయితే గత కొన్ని రోజులుగా చర్మం కొత్త ఇబ్బందులను తెచ్చి పెడుతోంది. ఎండలోకి వెళ్తే చర్మం ఎర్రబడుతోంది. ఎలాంటి క్రీమ్ పూసుకున్నా, చర్మం మండుతోంది. ఇలా ఎందుకు జరుగుతోంది? ఈ క్రీమ్స్ వాడడం వల్లే ఇలా జరిగిందా?

- ఓ సోదరి, హైదరాబాద్.

స్వీయ చికిత్సలో భాగంగా కొత్త చర్మ సమస్యలను కొని తెచ్చుకునే వారి సంఖ్య ఇటీవలి కాలంలో బాగా పెరిగింది. చర్మాన్ని తెల్లబరిచే క్రీమ్‌లు ఆన్‌లైన్‌లో విస్తృతంగా అందుబాటులో ఉండడంతో, ఎవరికి వారు వాటిని కొని వాడేస్తున్నారు. ఇవి తక్షణ ఫలితాన్ని కనబరుస్తూ ఉండడంతో అదే పనిగా ఏళ్ల తరబడి వాటినే వాడుకుంటూ ఉండిపోతున్నారు. కానీ చర్మాన్ని తెల్లబరిచే క్రీమ్స్‌లో స్టిరాయిడ్స్ ఉంటాయి. ఇవి చర్మాన్ని పలుచన చేస్తాయి. దాంతో చర్మం సున్నితంగా మారిపోయి, ఎండలోకి వెళ్లినప్పుడు మంట పెడుతుంది, కందిపోతూ ఉంటుంది. వీటినే ఏళ్ల తరబడి వాడుకోవడం వల్ల చర్మం మరింత దెబ్బతిని, నల్లబడుతుంది. మొటిమలు, రోమాలు కూడా పెరుగుతాయి. ఇలా చర్మం పూర్తిగా దెబ్బతిన్న తర్వాత, వెంటనే చర్మ వైద్యుల చేత చర్మ చికిత్సలు చేయించుకోవడం సాధ్యపడదు. దెబ్బతిన్న చర్మం పూర్తిగా కోలుకోడానికి కనీసం ఆరు నెలల నుంచి ఏడాది సమయం అవసరమవుతుంది. అప్పటివరకూ చర్మ చికిత్సలకు చర్మం అనువుగా మారదు. కాబట్టి ఏదైనా చర్మం తెల్లబడే క్రీమ్ వాడుతూ, ఫలితం సత్వరమే కనిపిస్తుంటే, వెంటనే ఆ క్రీమ్ వాడకాన్ని ఆపేయాలి. స్నేహితుల సలహాల మేరకు వీటిని వాడుకోకూడదు. 'ఈ క్రీమ్‌ను మేమే స్వయంగా తయారుచేశాం, ఇది పూర్తిగా సహజసిద్ధమైనది, ఎలాంటి రసాయనాలు లేని ఈ క్రీమ్ అద్భుతమైన ఫలితాన్నిస్తుంది' అంటూ తప్పుదారి పట్టించే బ్యూటీ పార్లర్ల మాటలు వినకూడదు. చర్మ వైద్యులు సూచించకుండా ఇలాంటి క్రీమ్స్ వాడుకోవడం ప్రమాదకరం.

తెల్లని చర్మం కలిగి ఉండడం కంటే ఆరోగ్యవంతమైన చర్మాన్ని కలిగి ఉండడం ముఖ్యం. తక్కువ సమయంలో చర్మాన్ని తెల్లబరుచుకోవడం కోసం స్టిరాయిడ్ క్రీమ్స్‌ను ఆశ్రయించడం వల్ల తాత్కాలికంగా చర్మం తెల్లబడినట్టు కనిపించినా, దీర్ఘకాలంలో చర్మం పూర్తిగా సరిదిద్దలేనంతగా దెబ్బతింటుంది. కాబట్టి రంగు తక్కువ ఉన్నవారు, పెళ్లి కోసం తెల్లబడాలనుకుంటున్న వాళ్లు, చర్మాన్ని తెల్లబరుచుకోవడం కోసం అనుభవజ్ఞులైన చర్మ వైద్యులనే సంప్రతించి, చర్మ తత్వానికి తగిన చికిత్సలను ఆశ్రయించాలి.

డాక్టర్ స్వప్నప్రియ,
డెర్మటాలజిస్ట్,
కాస్మోస్యూర్, హైదరాబాద్.



గంటల్లోనే చెక్కుల క్లియరెన్స్

అక్టోబరు 4 నుంచి అమలు.. ప్రస్తుతం 2 రోజుల వరకు సమయం



ముంబై: బ్యాంకుల్లో చెక్కుల క్లియరెన్స్ మరింత వేగవంతం కానుంది. ప్రస్తుతం బ్యాంక్‌లో సమర్పించిన చెక్కు క్లియరెన్స్‌కు 2 రోజుల సమయం పడుతుండగా.. ఈ అక్టోబరు 4 నుంచి ఆ ప్రక్రియ కొద్ది గంటల్లోనే పూర్తికానుంది. ఇందుకోసం చెక్కుల ట్రంకేషన్ సిస్టమ్‌ను (సీటీఎస్) ప్రస్తుతం అనుసరిస్తున్న బ్యాచ్ ప్రాసెసింగ్ పద్ధతి నుంచి కంటిన్యుయస్ క్లియరింగ్ అండ్ సెటిల్‌మెంట్ ఆన్ రియలైజేషన్ పద్ధతికి మార్చనున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. బ్యాచ్-ప్రాసెసింగ్ విధానంలో నిర్దిష్ట సమయం వరకు వచ్చిన చెక్కులన్నింటినీ ఒక బ్యాచ్‌గా ప్రాసెస్ చేసి, క్లియర్ చేస్తారు. ఈ విధానంలో చెక్కు క్లియరెన్స్‌కు రెండు రోజుల వరకు సమయం పడుతుంది. కొత్తగా ప్రవేశపెడుతున్న కంటిన్యుయస్ క్లియరింగ్ అండ్ సెటిల్‌మెంట్ ఆన్ రియలైజేషన్ పద్ధతిలో బ్యాంక్‌లు ప్రజెంటేషన్ సెషన్‌లో (ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటలు) కస్టమర్లు సమర్పించిన చెక్కులను ఎప్పటికప్పుడు స్కాన్ చేసి, క్లియరింగ్ హౌస్‌కు పంపుతాయి. తద్వారా కొన్ని గంటల సమయంలోనే చెక్కు క్లియర్ కానుంది. చెక్కు ద్వారా చెల్లింపులు జరిపేవారికి, సొమ్ము అందుకునేవారికీ ఈ విధానం లాభదాయకం కానుంది.

రెండు దశల్లో అమలు

కంటిన్యుయస్ క్లియరింగ్‌కు మారే ప్రక్రియ రెండు విడతల్లో జరగనుంది. అక్టోబరు 4 నుంచి తొలి విడత, 2026 జనవరి 3 నుంచి రెండో విడతను అమలు చేయనున్నట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. తొలి విడతలో డ్రాయీ బ్యాంక్‌లు తమ వద్దకు వచ్చిన చెక్కులకు అంగీకారం లేదా తిరస్కారాన్ని కన్ఫర్మేషన్ సెషన్ ముగిసే లోపు (రాత్రి 7 గంటలు) తెలియజేయాల్సి ఉంటుంది. లేదంటే ఆ చెక్కును అంగీకరించినట్లుగా భావించి, పరిష్కరించడం జరుగుతుంది. రెండో విడతలో డ్రాయీ బ్యాంక్‌లు తమకు అందిన చెక్కుల సెటిల్‌మెంట్‌పై అంగీకారం లేదా తిరస్కారాన్ని 3 గంటల్లో తెలియజేయాల్సి ఉంటుంది. చెక్కు సెటిల్‌మెంట్ అనంతరం క్లియరింగ్ హౌస్ ఆ చెక్కు అంగీకారం లేదా తిరస్కార సమాచారాన్ని ప్రజెంటింగ్ బ్యాంక్‌కు (కస్టమరు చెక్కు సమర్పించిన బ్యాంక్) వెల్లడించాల్సి ఉంటుంది. నిర్దేశిత తేదీ నుంచి కొత్త విధానంలోకి మారేందుకు బ్యాంక్‌లు తమ సీటీఎస్‌ను సిద్ధం చేసుకోవాలని ఆర్‌బీఐ కోరింది.



మార్కెట్లోకి కొత్త బెంజ్

ధర రూ. 1.35 కోట్లు

న్యూఢిల్లీ: జర్మనీ లగ్జరీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ భారత్‌లో తన కార్ల పోర్ట్‌ఫోలియోను మరింత విస్తరించింది. 'మెర్సిడెస్ ఏఎంజీ సీఎల్‌ఈ 53 4మ్యాటిక్‌ప్లస్ కూపే'ను బుధవారం మన మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. దీని ధర రూ.1.35 కోట్లు. ఈ కారు జీరో నుంచి 100 కి.మీ వేగాన్ని కేవలం 4.2 సెకన్లలో అందుకోగలదని, గంటకు గరిష్ఠంగా 250 కి.మీ వేగంతో దూసుకెళ్లగలదని కంపెనీ వెల్లడించింది.

డీహెచ్‌ఎఫ్‌ఎల్ కేసులో వధావన్ సోదరులపై సెబీ నిషేధం

న్యూఢిల్లీ: దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (డీహెచ్‌ఎఫ్‌ఎల్) మాజీ సీఎండీ కపిల్ వధావన్, మాజీ డైరెక్టర్ ధీరజ్ వధావన్‌తో పాటు మరో నలుగురిపై సెబీ భారీ వేటు వేసింది. కంపెనీ నిధులను మళ్లించడంతో పాటు అకౌంటింగ్ అక్రమాలకు పాల్పడినందుకుగాను వారిని సెక్యూరిటీస్ మార్కెట్ నుంచి ఐదేళ్ల వరకు నిషేధించడమే కాకుండా రూ.120 కోట్ల జరిమానా కూడా విధించింది. అంతేకాదు, వారిని ఐదేళ్లపాటు ఏ లిస్టెడ్ కంపెనీలోనూ కీలక పదవిని చేపట్టకుండా నిషేధిస్తున్నట్లు మంగళవారం సెబీ ఆదేశాలు జారీ చేసింది. కపిల్, ధీరజ్‌లతోపాటు డీహెచ్‌ఎఫ్‌ఎల్ మాజీ నాన్-ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ రాకేశ్ వధావన్, నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సారంగ్ వధావన్, మాజీ జాయింట్ ఎండీ, సీఈఓ హర్షిల్ మెహతా, మాజీ సీఎఫ్ఓ సంతోష్ శర్మపైనా సెబీ వేటు పడింది.

ఎస్‌బీఐ ఐఎంపీఎస్ ఛార్జీలు పెంపు

రేపటి నుంచి అమలు

న్యూఢిల్లీ: వడ్డీయేతర ఆదాయం పెంచుకునే ప్రయత్నంలో భాగంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఆగస్టు 15 నుంచి ఇమీడియెట్ పేమెంట్ సర్వీస్ (ఐఎంపీఎస్) ఛార్జీలను సవరిస్తోంది. ఈ సవరణ ఆన్‌లైన్ చెల్లింపులకు ఒకలా, బ్రాంచ్ నెట్‌వర్క్ ద్వారా చేసే చెల్లింపులకు ఒకలా ఉంటుందని బ్యాంకు తెలిపింది. ఇప్పటి వరకు ఉన్న ఉచిత ఐఎంపీఎస్ చెల్లింపుల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25,000కు కుదించారు. ఆగస్టు 15 నుంచి ఆన్‌లైన్ ద్వారా రూ.25,000 నుంచి రూ.లక్ష వరకు జరిగే ఐఎంపీఎస్ చెల్లింపులపై రూ.2+జీఎస్‌టీ, రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు జరిగే చెల్లింపులపై రూ.6+జీఎస్‌టీ, రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు జరిగే చెల్లింపులపై రూ.10+జీఎస్‌టీ వసూలు చేయనున్నట్టు ఎస్‌బీఐ తెలిపింది. ఇక బ్రాంచిల ద్వారా జరిగే ఐఎంపీఎస్ చెల్లింపులపై వసూలు చేసే ఛార్జీల్లో మాత్రం ఎలాంటి మార్పులు లేవు. ఎప్పటిలానే ఈ చెల్లింపులపై కనిష్ఠంగా రూ.2+జీఎస్‌టీ, గరిష్ఠంగా రూ.20+జీఎస్‌టీ వసూలు చేస్తారు. అయితే వేతన ఖాతాదారులకు మాత్రం ఎప్పటిలా ఈ సేవలు ఉచితమని ఎస్‌బీఐ తెలిపింది. కెనరా బ్యాంకు, పంజాబ్ నేషనల్ బ్యాంకు కూడా ఆగస్టు 15 నుంచి తమ ఐఎంపీఎస్ ఛార్జీలను సవరిస్తున్నాయి.

ఎల్ఐసీలో 3% వాటా విక్రయం?

రూ. 17,000 కోట్ల వరకు సమీకరణ!!



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌లో కేంద్రం 2.5-3 శాతం వాటా విక్రయించాలని భావిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియలో భాగంగా ఎల్ఐసీలో తొలి విడతగా మోదీ సర్కారు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా ఈ వాటాను విక్రయించాలనుకుంటోంది. ఇందుకు సంబంధించి వచ్చే రెండు వారాల్లోగా రోడ్‌షోలను ప్రారంభించనున్నట్లు తెలిసింది. మోతీలాల్ ఓస్వాల్, ఐడీబీఐ క్యాపిటల్ ఈ ప్రక్రియకు మర్చంట్ బ్యాంకర్లుగా వ్యవహరించే అవకాశం ఉంది. రోడ్‌షో అనంతరం విక్రయించనున్న వాటా, ధరలపై ప్రభుత్వం తుది నిర్ణయానికి రానుందని తెలిసింది. బుధవారం ఎల్ఐసీ షేరు 3.50% తగ్గి రూ.884.30 వద్ద ముగిసింది. ఈ లెక్కన కంపెనీలో వాటా విక్రయం ద్వారా ప్రభుత్వం రూ.14,000-17,000 కోట్ల వరకు సమీకరించే అవకాశం ఉంది. ప్రస్తుతం ఎల్ఐసీలో కేంద్ర ప్రభుత్వం 96.5% వాటా కలిగి ఉంది. ఎల్ఐసీ తన పబ్లిక్ షేర్‌హోల్డింగ్ వాటాను ప్రస్తుతమున్న 3.5% నుంచి 2027 మార్చి 16 నాటికి 10 శాతానికి పెంచుకోవాలని సెబీ ఆదేశించింది. ఈ నేపథ్యంలో కేంద్రం ఎల్ఐసీలో వాటాల ఉపసంహరణకు సిద్ధమయింది. ఈ ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ.47,000 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకోవాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో మూడో వంతు వరకు ఎల్ఐసీ వాటా ద్వారానే సమకూరే అవకాశం ఉంది.

హైదరాబాద్‌లో 800 పడకల ఆస్పత్రి

● ఎస్ఎల్‌జీ హాస్పిటల్స్, అజింక్యా డివై పాటిల్ హెల్త్‌కేర్ భాగస్వామ్యం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : హైదరాబాద్‌లోని నిజాంపేటలో 800 పడకల మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఉమ్మడి నిర్వహణపై ఎస్ఎల్‌జీ హాస్పిటల్స్, అజింక్యా డీవై పాటిల్ హెల్త్‌కేర్ వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో హెల్త్‌కేర్ సర్వీసుల ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చివేయాలన్న ఉమ్మడి లక్ష్యంతో చేతులు కలిపిన రెండు సంస్థలు అందుబాటు ధరల్లో అత్యున్నత ప్రమాణాలతో కూడిన వైద్య సంరక్షణ సేవలందించేందుకు కృషి చేయనున్నట్టు తెలిపాయి. ఉభయ సంస్థలకు ఆయా విభాగాల్లో గల నైపుణ్యాలను జోడించి నిర్వహించనున్న ఈ ఆస్పత్రి క్రిటికల్, ఎమర్జెన్సీ కేర్; కార్డియాక్ సైన్సులు, ఆంకాలజీ, రేడియేషన్ ఆంకాలజీలపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరిస్తుంది. దశలవారీగా జరిగే ఈ అభివృద్ధి క్రమంలో ఒక్కో దశ అందుబాటులోకి వస్తున్న కొద్ది అత్యాధునిక ఆరోగ్య సంరక్షణ సేవలు అందుబాటులోకి వస్తాయని ఎస్ఎల్‌జీ హాస్పిటల్స్ ఛైర్మన్ దండు శివరామరాజు తెలిపారు. ఉభయ సంస్థలు తమ పరిధిని విస్తరించుకుంటూ సమగ్ర ఆరోగ్య సంరక్షణ సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు ఈ భాగస్వామ్యం దోహదపడుతుందని అజింక్యా డీవై పాటిల్ హెల్త్‌కేర్ ఛైర్మన్ డాక్టర్ అజింక్యా పాటిల్ అన్నారు.

'అరాజెన్'లో ఎస్‌బీఐ లైఫ్, అవెండస్‌కు వాటా

● రూ.300 కోట్లతో 2.5 శాతం కొనుగోలు

హైదరాబాద్: కాంట్రాక్టు పద్ధతిలో ఔషధ పరిశోధన, అభివృద్ధి, తయారీ (సీఆర్‌డీఎంఓ) రంగంలో ఉన్న అరాజెన్ లైఫ్ సైన్సెస్ కంపెనీ ఈక్విటీలో తాజాగా అవెండస్ ఫ్యూచర్ లీడర్స్ ఫండ్ 3, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ 2.5 శాతం వాటా కొనుగోలు చేశాయి. ఇందుకోసం ఈ రెండు సంస్థలు రూ.300 కోట్ల వరకు చెల్లించినట్టు సమాచారం. జీవీకే రెడ్డి కుటుంబంనుంచి ఈ వాటాను కొనుగోలు చేసినట్టు అవెండస్ కంపెనీ వర్గాలు చెప్పాయి. చైనా+1 వ్యూహంలో భాగంగా అనేక అంతర్జాతీయ ఫార్మా కంపెనీలు పరిశోధన, అభివృద్ధి, తయారీ కార్యాకలాపాలను భారత్‌కు తరలిస్తున్నాయి. ఈ చర్య 'అరాజెన్ లైఫ్ సైన్సెస్‌కు ఉపయోగపడుతుందనే అంచనాతో ఎస్‌బీఐ లైఫ్, అవెండస్ గ్రూప్ ఈ వాటా కొనుగోలు చేసినట్టు భావిస్తున్నారు.

ఆర్ అండ్ డీలో పెట్టుబడులు కీలకం: ఫార్మెక్సిల్

న్యూఢిల్లీ: ప్రపంచ ఫార్మా మార్కెట్ మరింత అనుసంధానం అవుతున్న దశలో పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలపై మరిన్ని పెట్టుబడులు పెట్టడం పైనే భారత ఫార్మా భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని భావిస్తున్నట్టు ఫార్మెక్సిల్ ఛైర్మన్ నమిత్ జోషి చెప్పారు. దీనికి తోడు ఏఐ ఆధారిత ఔషధ డిస్కవరీ, డిజిటల్ హెల్త్ టెక్నాలజీలు, సుస్థిర తయారీ విధానాలు అభివృద్ధి చేసుకోవడం కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. అధిక విలువ గల బయో సిమిలర్లు, ఆర్ఫాన్ ఔషధాలు, ఆధునిక డెలివరీ వ్యవస్థలకు మనం కల్పిస్తున్న ప్రాధాన్యత వల్ల ఆర్థికంగా మన స్థితి బలోపేతం కావడంతో పాటు ఫార్మా సేవలు అంతగా అందుబాటులో లేని మార్కెట్లకు జీవనాధార ఔషధాల సరఫరాను విస్తరించవచ్చునని సంస్థ డైరెక్టర్ జనరల్ రాజా భాను చెప్పారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,350 ▼	92,900 ▼	1,25,000 ▼
విజయవాడ	1,03,200 ▲	97,000 ▲	1,18,750 ▲
విశాఖపట్నం	1,02,980 ▼	93,750 ▼	1,25,000 ▼
రాజమండ్రి	1,01,400 ▼	92,950 ▼	1,18,000 ▲
ప్రొద్దుటూరు	1,00,550 ▲	92,510 ▲	1,17,500 ▲
ముంబై	1,00,100 ▲	91,690 ▲	1,15,275 ▲

సెన్సెక్స్ 304 పాయింట్లు అప్

ముంబై: ఈక్విటీ మార్కెట్ బుధవారం లాభాల బాట పట్టింది. సెన్సెక్స్ 304.32 పాయింట్ల వృద్ధితో 80,539.91 వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 131.95 పాయింట్లు పెరిగి 24,619.35 వద్ద ముగిసింది. జూలై నెలలో ద్రవ్యోల్బణం ఎనిమిదేళ్ల కనిష్ఠానికి జారుకోవడంతో వినియోగం మళ్లీ పుంజుకోనుందన్న అంచనాలు ఇందుకు దోహదపడ్డాయి.ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 16 పైసలు పెరిగి రూ.87.47 వద్ద ముగిసింది.

ఫ్రాక్టల్ అనలిటిక్స్ రూ.4,900 కోట్ల ఐపీఓ: కృత్రిమ మేధ (ఏఐ) సేవలందించే ఫ్రాక్టల్ అనలిటిక్స్ పబ్లిక్ ఆఫరింగ్‌కు (ఐపీఓ) అనుమ తి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. దేశంలో ఐపీఓ ద్వారా స్టాక్ మార్కెట్లో లిస్ట్ కావాలనుకుంటున్న తొలి ఏఐ కంపెనీ ఇదే. ముంబై కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ కంపెనీ ఐపీఓలో భాగంగా రూ.1,279.3 కోట్ల తాజా ఈక్విటీ జారీతోపాటు ప్రస్తుత ఇన్వెస్టర్లకు చెందిన రూ.3,620.7 కోట్ల ఈక్విటీ వాటా షేర్ల విక్రయం ద్వారా మొత్తం రూ.4,900 కోట్లు సమీకరించాలనుకుంటోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



14వ తేదీ			
హైదరాబాద్	485	విజయవాడ	520
వరంగల్	487	గోదావరి	510
చిత్తూరు	548	విశాఖపట్నం	515
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	114
వరంగల్	100	గుంటూరు	119
కరీంనగర్	100	ఒంగోలు	119
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	95
కర్నూలు	100	నెల్లూరు	100
విశాఖపట్నం	108	అనంతపురం	100
గోదావరి	114		

స్పోర్ట్స్

మెరిసిన యాస్తిక, రాధ

● తొలి వన్డేలో భారత్ 'ఏ' గెలుపు



యాస్తిక (59)

బ్రిస్బేన్: ఓపెనర్ యాస్తికా భాటియా (59) హాఫ్ సెంచరీతో, స్పిన్నర్ రాధా యాదవ్ (3/45)తో మూడు వికెట్లతో సత్తా చాటడంతో ఆస్ట్రేలియా 'ఏ' జట్టుతో జరిగిన తొలి వన్డేలో భారత్ 'ఏ' మూడు వికెట్లతో నెగ్గింది. బుధవారం జరిగిన పోరులో తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా మహిళలు 47.5 ఓవర్లలో 214 పరుగులకు ఆలౌటయ్యారు. అనికా (92 నాటౌట్), ట్రెనమన్ (51) రాణించారు. టిటాస్, మిన్ను మణి చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం భారత మహిళలు 42 ఓవర్లలో 215/7తో లక్ష్యాన్ని ఛేదించారు. షఫాలీ (36), ధారా (31), రాఘవీ (25 నాటౌట్), కెప్టెన్ రాధా యాదవ్ (19) తలో చేయి వేశారు.

అర్జున్‌కు ఇంకో డ్రా

చెన్నై: తెలుగు జీఎం అర్జున్ ఇరిగేసికి చెన్నై గ్రాండ్ మాస్టర్స్ టోర్నీలో వరుసగా మూడో డ్రా ఎదురైంది. బుధవారం జరిగిన ఏడో రౌండ్ గేమ్‌లో జీఎం అనీష్ గిరి (నెదర్లాండ్స్)తో అర్జున్ పాయింట్ పంచుకొన్నాడు. తెల్లపావులతో ఆడిన ఇరిగేసి 35 ఎత్తుల అనంతరం డ్రాకు అంగీకరించాడు. రే రాబ్సన్ (అమెరికా)పై నిహాల్ సరీన్, విదిత్ గుజరాతీపై కార్తికేయన్ గెలిచారు. ఏడు రౌండ్లు ముగిసే సరికి అర్జున్ మొత్తం 4 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. కాగా, చాలెంజర్స్ విభాగంలో జీఎం హారిక ద్రోణవల్లి ఐదో ఓటమి చవిచూసింది. సహచరుడు హర్షవర్ధన్ చేతిలో హారిక, ప్రణేష్ చేతిలో వైశాలి పరాజయం పాలయ్యారు.

భారత షట్లర్లకు కఠిన డ్రా



పేలవ ఫామ్‌లో సింధు, లక్ష్య సేన్

వరల్డ్ చాంపియన్‌షిప్స్


పారిస్: బ్యాడ్మింటన్ వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో భారత షట్లర్లకు కఠిన సవాళ్లు ఎదురుకానున్నాయి. ఈ నెల 25 నుంచి 31 వరకు జరిగే మెగా టోర్నీ డ్రాను బుధవారం విడుదల చేశారు. పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్‌కు తొలి రౌండ్‌లోనే వరల్డ్ నెం:1 షి యు కి (చైనా) రూపంలో గండం ఎదురుకానుంది. పారిస్ ఒలింపిక్స్ సెమీస్‌లో ఓటమి తర్వాత లక్ష్య సేన్ మళ్లీ పుంజుకోలేకపోయాడు. 2021 ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో సేన్ కాంస్యం సాధించాడు. మరో భారత షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్ కూడా ఫామ్‌లో లేడు. తొలి రౌండ్ గట్టెక్కినా.. రెండో రౌండ్‌లో వరల్డ్ నెం:2 ఆండ్రెస్ అంటాన్‌సెన్ రూపంలో ముప్పు పొంచి ఉంది. కాగా, 2019 చాంపియన్ పీవీ సింధు మాత్రమే మహిళల సింగిల్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తోంది. తొలి రౌండ్‌లో కలోయనా నల్‌బంటోవా (బల్గేరియా)తో సింధు తలపడనుంది. ఫామ్ కోసం తంటాలు పడుతున్న సింధు.. ప్రీక్వార్టర్స్‌లో రెండో సీడ్ వాంగ్ జి యి (చైనా)ను ఢీకొనాల్సి రావచ్చు. ఈ టోర్నీలో సింధు స్వర్ణం, రెండు రజతాలు, రెండు కాంస్యాలు సాధించింది. ఈ ఏడాది ఇండియా ఓపెన్ క్వార్టర్స్ చేరడమే సింధు అత్యుత్తమ ప్రదర్శన. కాగా, పురుషల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి జంటకు తొలి రౌండ్ బై లభించింది. మహిళల డబుల్స్‌లో ట్రీసా జాలీ-గాయత్రి జోడీ టోర్నీ నుంచి తప్పుకోగా.. రితుపర్ణ-శ్వేతపర్ణ, ప్రియ కొన్‌జెంగ్‌బమ్-శ్రుతి మిశ్రా జంటలు బరిలో నిలవనున్నాయి. మిక్స్‌డ్‌లో రుత్విక గద్దె-రోహన్ కపూర్, ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో ద్వయాలు ఆడనున్నాయి.



గుల్వీర్ తన రికార్డును తానే..

న్యూఢిల్లీ : గుల్వీర్ సింగ్ పురుషుల మూడు వేల మీటర్ల రేస్‌లో తన జాతీయ రికార్డును తానే అధిగమించాడు. మంగళవారం రాత్రి బుడాపెస్ట్‌లో జరిగిన హంగేరియన్ అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రీలో గుల్వీర్ 7 నిమిషాల 34.49 సె.లలో గమ్యం చేరి ఐదో స్థానంలో నిలిచాడు. ఈ క్రమంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో ఏడు నిమిషాల 38.26 సె.లలో నెలకొల్పిన గత జాతీయ రికార్డును గుల్వీర్ అధిగమించాడు. కాగా..పురుషుల ఐదు వేల మీటర్లు, 10 వేల మీటర్ల జాతీయ రికార్డులు కూడా 27 ఏళ్ల గుల్వీర్ పేరిటే ఉండడం విశేషం.

సుశీల్ బెయిల్ రద్దు



వారం రోజుల్లో లొంగిపోవాలి..

సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ : జాతీయ జూనియర్ రెజ్లింగ్ మాజీ చాంపియన్ సాగర్ ధన్కడ్ హత్య కేసులో..ఒలింపిక్ పతక విజేత రెజ్లర్ సుశీల్ కుమార్ బెయిల్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఈమేరకు జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత సుశీల్‌కు బెయిల్ ఇస్తూ మార్చి నాలుగున ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను పక్కనబెట్టింది. సుశీల్ కుమార్ వారం రోజుల్లో లొంగిపోవాలని సూచించింది. సాగర్ ధన్కడ్ హత్య కేసులో సుశీల్ తోపాటు మరో 17 మంది అభియోగాలు ఎదుర్కొంటున్నారు.

ఏమిటీ కేసు?

ఆస్తి వివాదం నేపథ్యంలో..మే, 2021న న్యూఢిల్లీలోని ఛత్రసాల్ స్టేడియంలో సాగర్ ధన్కడ్, అతడి స్నేహితులు ఇద్దరిపై సుశీల్ కుమార్ తదితరులు దాడి చేసినట్టు కేసు నమోదైంది. తీవ్ర గాయాలతో సాగర్ మరణించినట్టు పోస్ట్‌మార్టంలో తేలింది. దాంతో అదే నెలలో పోలీసులు సుశీల్‌ను అరెస్ట్ చేశారు. సాగర్ హత్య కేసులో సుశీల్ కీలక పాత్ర పోషించినట్టు 2022 అక్టోబరులో ఢిల్లీ ట్రయల్ కోర్టులో దాఖలు చేసిన చార్జ్‌షీట్‌లో పోలీసులు పేర్కొన్నారు. కాగా..మూడున్నర సంవత్సరాలు జైలులో ఉన్న సుశీల్ గత మార్చిలో బెయిల్ కోసం ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. అతడి వాదనలు విన్న హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే సుశీల్‌కు బెయిల్ ఇవ్వడాన్ని సాగర్ తండ్రి అశోక్ ధన్కడ్ సుప్రీంకోర్టులో సవాలు చేశాడు.



కామన్వెల్త్ క్రీడల

బిడ్ దాఖలుకు ఐఓఏ గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ: కామన్వెల్త్ క్రీడల (2030) నిర్వహణ కోసం బిడ్‌లు దాఖలు చేయడానికి భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధికారికంగా ఆమోదం తెలిపింది. బుధవారం జరిగిన ప్రత్యేక సర్వసభ్య సమావేశం (ఎస్‌జీఎం)లో ఈ నిర్ణయం తీసుకొంది. అహ్మదాబాద్ వేదికగా 2030 క్రీడల నిర్వహణ కోసం ఆసక్తి వ్యక్తీకరణ లేఖను భారత్ ఈపాటికే అందజేసింది. అయితే, ఫైనల్ బిడ్‌ను ఈనెల 31లోపు దాఖలు చేయాల్సి ఉంది. నవంబరులో ఆతిథ్య హక్కులను ఖరారు చేయనున్నారు. భారత్‌కు పతకాల పంట పండించే అన్ని క్రీడా విభాగాలతో గేమ్స్‌ను సమగ్రంగా నిర్వహించాలనుకొంటున్నట్టు ఐఓఏ వర్గాలు తెలిపాయి. కాగా, ఈ క్రీడల నిర్వహణ కోసం రేసులో ఉన్న కెనడా తప్పుకోవడంతో.. భారత్‌కే ఆతిథ్య హక్కులు దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. 2010 క్రీడలకు ఆతిథ్యమిచ్చిన ఢిల్లీతోపాటు భువనేశ్వర్‌ను కూడా పోటీల నిర్వహణకు పరిశీలిస్తున్నట్టు ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష తెలిపింది. 2026 గ్లాస్గో క్రీడలను నామమాత్రంగా నిర్వహిస్తున్నారు. ఖర్చు నియంత్రణలో భాగంగా హాకీ, రెజ్లింగ్, షూటింగ్, బ్యాడ్మింటన్ లాంటి అంశాలను తొలగించారు. అయితే, భారత్ ఆతిథ్యమిచ్చే క్రీడల్లో మాత్రం అన్నింటికీ చోటు కల్పించాలనుకొంటున్నారు. దేశవాళీ క్రీడలైన కబడ్డీ, ఖో-ఖోకు కూడా స్థానం కల్పించే అవకాశాలున్నాయని ఐఓఏ సంయుక్త కార్యదర్శి కళ్యాణ్ చౌబే చెప్పాడు.

2030 కామన్వెల్త్ క్రీడల బిడ్డింగ్

ప్రతిపాదిత వేదిక: అహ్మదాబాద్ (గుజరాత్)

ఆఖరి తేదీ : ఆగస్టు 31

తుది నిర్ణయం: నవంబరు, గ్లాస్గోలో

అదరగొట్టిన రషీద్




రషీద్ (67)

రాయల్స్ విజయం

విశాఖపట్నం, స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): రాయల్స్ ఆఫ్ రాయలసీమ కెప్టెన్ షేక్ రషీద్ హాఫ్ సెంచరీ (67; 6 ఫోర్లు, 2 సిక్సర్లు), బౌలింగ్‌లో గిరినాథరెడ్డి (3/21), సాకేత్‌రామ్ (3/8) ధాటికి తుంగభద్ర వారియర్స్ చతికిలపడింది. ఇక్కడి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో బుధవారం జరిగిన ఆంధ్ర ప్రీమియర్ లీగ్ తొలి మ్యాచ్‌లో రాయల్స్ ఆఫ్ రాయలసీమ 51 పరుగుల తేడాతో తుంగభద్రపై నెగ్గింది. తొలుత రాయల్స్ నిర్ణీత 6 వికెట్లకు 191 రన్స్ చేసింది. రషీద్, సత్యసాయి (45), హర్షవర్ధన్ (34 నాటౌట్) రాణించారు. ఛేదనలో తుంగభద్ర 17.2 ఓవర్లలో 140రన్స్‌కే కుప్పకూలింది. కెప్టెన్ మహీప్ (34), దత్తారెడ్డి (37), రోహిత్ (32) పర్వాలేదనిపించారు. రషీద్ ఏకంగా ఐదు క్యాచ్‌లు అందుకున్నాడు. ఇక రాయల్స్ బౌలర్లలో గిరినాథరెడ్డి, సాకేత్ రామ్ చెరో మూడు, వేణు, మాధవ్ రాయుడు రెండేసి వికెట్లు తీశారు. కాగా విజయవాడ సన్‌షైనర్స్-భీమవరం బుల్స్ జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్ వర్షంతో రద్దయింది. తొలుత బ్యాటింగ్ చేసిన విజయవాడ 19 ఓవర్లలో 204/7 చేసింది. ఆ తర్వాత వర్షంతో మ్యాచ్ సాధ్యంకాలేదు.

పాకిస్థాన్ చెత్తాట



సీల్స్ (6/18)


● 92 పరుగులకే ఆలౌట్

● విండీస్‌తో మూడో వన్డే

తరౌబా (ట్రినిడాడ్-టుబాగో): అనిశ్చితికి మారుపేరైన పాకిస్థాన్ మరోసారి చెత్త ప్రదర్శన కనబరచింది. వెస్టిండీస్‌పై టీ20 సిరీస్‌ను సొంతం చేసుకున్న ఆ జట్టు.. మంగళవారం జరిగిన సిరీస్ నిర్ణాయక మూడో వన్డేలో కేవలం 92 పరుగులకే కుప్పకూలింది. తద్వారా 202 పరుగుల భారీ పరాజయాన్ని మూటగట్టుకుంది. తొలుత వెస్టిండీస్ 50 ఓవర్లలో 294/6 స్కోరు చేసింది. కెప్టెన్ షాయ్ హోప్ (120 నాటౌట్) సెంచరీతో కదం తొక్కాడు. జస్టిన్ గ్రీవ్స్ (43 నాటౌట్)తో కలిసి ఎనిమిదో వికెట్‌కు హోప్ అభేద్యంగా 110 పరుగులు జోడించాడు. ఛేదనలో యువ పేసర్ జేడెన్ సీల్స్ (6/18) ధాటికి పాకిస్థాన్ 29.2 ఓవర్లలో 92 పరుగులకే చాప చుట్టేసింది. సల్మాన్ ఆఘా (30), నవాజ్ (23 నాటౌట్) ఆదుకోకపోయుంటే పాకిస్థాన్ పరిస్థితి మరీ దారుణంగా ఉండేది. ఈ విజయంతో..1991 తర్వాత పాకిస్థాన్‌పై వెస్టిండీస్ తొలిసారి ద్వైపాక్షిక వన్డే సిరీస్ గెల్చుకున్నట్టయింది.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

విడుదలకు సిద్ధం



హీరో విజయ్ ఆంటోని నటిస్తున్న 25వ చిత్రం 'భద్ర కాళి'. పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా అరుణ్ ప్రభు తెరకెక్కిస్తున్నారు. మీరా విజయ్ ఆంటోని సమర్పణలో రామాంజనేయులు జవ్వాజి నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదలైన టీజర్ ఆకట్టుకుంది. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించారు మేకర్స్. వచ్చే నెల 19న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుందని తెలిపారు. ఈ సినిమాను తెలుగులో ఏషియన్ సురేశ్ ఎంటర్టైన్‌మెంట్స్, స్పిరిట్ మీడియా సంయుక్తంగా విడుదల చేస్తున్నాయి. వాగై చంద్రశేఖర్, సునీల్ కృపలాని తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

అక్కినేని కలల సౌధ నిర్మాణానికి యాభై ఏళ్లు!





అక్కినేని నాగేశ్వరరావు కలల సౌధం అన్నపూర్ణ స్టూడియో. చుట్టూ కొండలు, బండరాళ్లు, చెట్ల పొదలతో నిండిన ఎత్తయిన ప్రదేశంలో ఒక అద్భుతమైన స్టూడియో నిర్మించి తెలుగు చిత్ర పరిశ్రమకు తనవంతు కానుకగా అందించారు అక్కినేని. 'ఈ నిర్జన ప్రదేశంలోకి ఎవరు వస్తారు!' అని చాలామంది వ్యంగ్యంగా మాట్లాడినా ఆయన పట్టించుకోలేదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తనకు కేటాయించిన 22 ఎకరాల స్థలంలో సరిగ్గా ఇదే రోజున అంటే 1975 ఆగస్టు 14న (ఆ రోజు అక్కినేని అన్నపూర్ణ పుట్టినరోజు కావడం గమనార్హం) భూమి పూజ చేసి స్టూడియో నిర్మాణానికి శ్రీకారం చుట్టారు ఏయన్నార్. తన మనవడు, నేటి నటుడు సుమంత్ చేతుల మీదుగా భూమి పూజ జరిపించారు అక్కినేని అన్నపూర్ణ. ఈ కార్యక్రమంలో అక్కినేని వెంకట్ కూడా పాల్గొన్నారు. కొండలు ఛేదించి, బండలు పగులకొట్టి భూమిని చదును చేసి చకచకా నిర్మాణం జరిపి మొదట రెండు ఫ్లోర్లు సిద్ధం చేశారు 1976 జనవరి 14న అన్నపూర్ణ స్టూడియోను ఆనాటి రాష్ట్రపతి ఫకృద్దీన్ అలీ అహ్మద్ ప్రారంభించారు. ఈ స్టూడియోలో నిర్మాణం జరుపుకొన్న తొలి చిత్రం అక్కినేని, వాణిశ్రీ జంటగా నటించిన 'సెక్రటరీ'. కె.ఎస్.ప్రకాశరావు దర్శకత్వంలో రామానాయుడు ఆ చిత్రాన్ని నిర్మించారు.

బెంగాలీ సినిమాకు ప్రోత్సాహం

● బెంగాల్ ప్రభుత్వం తాజా నిర్ణయం

బెంగాలీ చిత్ర పరిశ్రమను ప్రోత్సహించడానికి, పరిరక్షించడానికి ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సారథ్యంలోని తృణ మూల్ కాంగ్రెస్ ప్రభుత్వం ఓ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రతీ థియేటర్లో బెంగాలీ సినిమాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని.. ఏడాదంతా బెంగాలీ సినిమాలు ఆడాల్సిందేనని బుధవారం ఆదేశించింది. 'బెంగాల్లోని ప్రతీ థియేటర్లో రోజూ తప్పనిసరిగా ఒక బెంగాలీ సినిమా ప్రదర్శించాలి. అది కూడా ప్రైమ్ టైమ్ షోల్లో అంటే మధ్యాహ్నం మూడు నుంచి రాత్రి తొమ్మిది గంటల మధ్య ప్రదర్శించాలి. ఇది రాష్ట్రంలోని మల్టీప్లెక్స్‌లు సహా ప్రతీ సినిమా థియేటర్‌కూ వర్తిస్తుంది' అని పేర్కొంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి రానుంది. బెంగాలీ సినిమాకు ఇది ఒక గొప్ప విజయంగా అక్కడి చిత్ర ప్రముఖులు భావిస్తున్నారు.

నిర్మాతల షరతులకు ఫెడరేషన్ అంగీకరించాలి



దిల్ రాజు

సినీ కార్మికుల వేతన సమస్యకు ఓ పరిష్కారం తెచ్చేందుకు బుధవారం నిర్మాతల మండలి సభ్యులు, ఫిల్మ్ ఫెడరేషన్ నాయకులు మరోసారి ఫిల్మ్ ఛాంబర్‌లో సమావేశమయ్యారు. చర్చల్లో వేతనాల పెంపు అంశం ఇంకా కొలిక్కి రాలేదని, మరో రెండు మూడు సార్లు నిర్మాతలు, ఫెడరేషన్ నాయకుల మధ్య చర్చలు జరగాల్సి ఉందని ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "వేతనాలు పెంచాలంటే ఫెడరేషన్ నాయకులు, నిర్మాతలు కోరుతున్న కొన్ని షరతులకు అంగీకరించాలి. ఇదే విషయాన్ని ఛాంబర్ దృష్టికి తీసుకువచ్చాం. వాటిపై చర్చించి తుది నిర్ణయం తీసుకుంటే నిర్మాతలు వేతనాలు పెంచడానికి సిద్ధంగా ఉన్నారు. రూ.2 వేల కంటే తక్కువకి పనిచేసే వారికి ఒక పర్సెంటేజీ ఆఫర్ చేశాం. అంతకంటే ఎక్కువ తీసుకునే వారికి మరో పర్సెంటేజీ ఆఫర్ ప్రతిపాదించాం. ఫెడరేషన్‌లోని అన్ని యూనియన్లతో మాట్లాడుకుని వస్తే, దీనిని పరిష్కరిస్తాం. ప్రస్తుతం సానుకూల ధోరణిలోనే చర్చలు సాగిస్తున్నాం' అని చెప్పారు. 'నిర్మాతలు వారి షరతులు చెప్పారు. మరో రెండు మూడు రోజుల పాటు చర్చలు సాగుతాయి' అని నిర్మాత సి.కల్యాణ్ పేర్కొన్నారు. 'ఈ రోజు జరిగిన చర్చలు సరిగ్గా సాగలేదు. నిర్మాతలు కాలయాపన ధోరణి ప్రదర్శిస్తున్నారు. మేము ఇరువైపులా న్యాయం జరగడానికి అన్ని విధాలుగా సహకరిస్తున్నా, నిర్మాతలు దాటవేత ధోరణితో వ్యవహరిస్తున్నారు' అని ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ అసంతృప్తి వ్యక్తం చేశారు. 'గతంలో మేము చెప్పిన షరతులపై ఈ సమావేశంలో మాట్లాడాం. మేము చెప్పిన షరతులను అంగీకరిస్తే ఎలాంటి న్యాయం చేస్తారో చెప్పాలని కోరాం. ఏ రోజుకు ఆ రోజు వేతనాల చెల్లింపు గురించి చర్చించలేదు' అని ఫెడరేషన్ కార్యదర్శి అమ్మిరాజు అన్నారు.

ధర్మ ధ్వజం రెపరెపలాడాలంటే..

సత్యరాజ్ ప్రధాన పాత్రలో మోహన్ శ్రీవత్స తెరకెక్కించిన చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్'. వశిష్ఠ.ఎన్.సింహా, సత్యం రాజేశ్, ఉదయభాను కీలక పాత్రలు పోషించారు. దర్శకుడు మారుతి సమర్పణలో విజయ్‌పాల్ రెడ్డి ఆడిదాల నిర్మించారు. ఈనెల 22న చిత్రం విడుదలవుతోంది.



బుధవారం చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. 'చూడు బార్బరికా, ఈ యుద్ధం నీది. ధర్మ ధ్వజం రెపరెపలాడాలంటే అధర్మం చేసేవారికి దండన లభించాలి' వంటి సంభాషణలు, లవ్‌స్టోరీ, విజువల్స్ ఆకట్టుకున్నాయి. ఓ పురాణ కథకి, ప్రస్తుత సామాజిక సమస్యల్ని లింక్ చేస్తూ సినిమాను రూపొందించినట్లు తెలుస్తోంది.

2028 నాటికి బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి

- 21 ఎకరాల్లో 500 పడకలతో హాస్పిటల్ నిర్మాణం
- 750 కోట్లతో అత్యాధునిక వసతులతో ఏర్పాటు
- శంకుస్థాపన చేసిన ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ



అమరావతిలో బసవతారకం ఇండో అమెరికన్ ఆసుపత్రికి భూమి పూజ చేస్తున్న ఆసుపత్రి ఛైర్మన్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, చిత్రంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు తదితరులు

గుంటూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): 2028 నాటికి అమరావతిలో బసవతారకం క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ని అందుబాటులోకి తీసుకువస్తామని బసవతారకం ట్రస్టు ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ చెప్పారు. అమరావతిలోని ఈ-7 రోడ్డును ఆనుకుని కేటాయించిన స్థలంలో బుధవారం ఆయన హస్పిటల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, మంత్రులు పొంగూరి నారాయణ, సత్యకుమార్ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ... తుళ్లూరులో 21 ఎకరాల సువిశాల ప్రాంగణంలో బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రిని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 500 పడకలు అందుబాటులో ఉండేలా రూ.750 కోట్ల వ్యయంతో అత్యాధునిక వసతులతో ఈ ఆస్పత్రిని నిర్మిస్తున్నామని తెలిపారు. 25 సంవత్సరాలుగా క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు సేవలందిస్తున్న బసవతారకం రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఇప్పుడు కొత్త అధ్యాయాన్ని ప్రారంభించడం గర్వకారణంగా ఉందని బాలకృష్ణ చెప్పారు. మంత్రి లోకేశ్ సతీమణి నారా బ్రాహ్మణి, సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, ఏడీసీ ఛైర్మన్ లక్ష్మీ పార్థసారథి, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ ఉండవల్లి శ్రీదేవి, రాజధాని రైతులు, మహిళలు కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కువైత్‌లో కల్తీ మద్యం తాగి 13 మంది మృతి

- మృతుల్లో నలుగురు ఆంధ్రులు.. 21 మందికి శాశ్వత అంధత్వం

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి

కువైత్‌లో కల్తీ మద్యం సేవించి 13 మంది విదేశీయులు మరణించారు. వారిలో నలుగురు ఆంధ్రులు ఉన్నట్టు సమాచారం. జ్లీబ్‌లోని ఒక ప్రాంతంలో శనివారం కల్తీ మద్యం సేవించి 63 మంది అస్వస్థతకు గురయ్యారు. బుధవారం నాటికి వారిలో 13 మంది మృతి చెందారని, 21 మంది శాశ్వతంగా చూపు కోల్పోయారని కువైత్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. బాధితులు ప్రస్తుతం ఇంటెన్సివ్ కేర్ యూనిట్లలో చికిత్స పొందుతున్నారని, 31 మంది వెంటిలేటర్‌పై ఉన్నారని బాధితుల సంఖ్య మరింత పెరగవచ్చని పేర్కొంది. మరణించిన వారిలో నలుగురు ఆంధ్రులు ఉండగా, వారిలో ఒకరిని పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మిగిలిన ముగ్గురి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా.. కువైత్‌లో మద్య నిషేధం అమల్లో ఉంది. మద్యం కొనుగోళ్లు. విక్రయాలు, వినియోగం చేయరాదని కఠిన నిబంధనలున్నా.. ఆ దేశంలో పెద్ద సంఖ్యలో పని చేస్తున్న విదేశీ కార్మికులు చాటుగా నాటు సారా తయారు చేస్తూ రహస్యంగా విక్రయిస్తుంటారు. 330 మిల్లీ లీటర్ల బాటిల్ దీనారుకు, ఒకటిన్నర లీటరు బాటిల్‌ను 3 నుంచి 5 దీనార్లకు విక్రయిస్తుంటారు. నాటు సారా వినియోగించే వారిలో ఆంధ్రులు, తమిళులే అధిక సంఖ్యలో ఉన్నారు. గత కొన్ని వారాలుగా దేశ వ్యాప్తంగా జరుగుతున్న వీసాల తనిఖీల్లో పలు ప్రాంతాల్లో ఈ రకమైన అక్రమాలకు ప్రభుత్వం కళ్లెం వేసింది.

చత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

- ఇద్దరు మావోయిస్టు అగ్రనేతలు మృతి

దుమ్ముగూడెం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): చత్తీస్‌గఢ్ రాష్ట్రం మోహ్లా-మన్పూర్-అంబర్గ్ చౌక్ జిల్లా మదన్‌వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అటవీప్రాంతంలో బుధవారం పోలీసులు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టు అగ్రనేతలు మృతిచెందారు. వీరిని విజయ్‌రెడ్డి, లోకేష్ సలామిలుగా గుర్తించారు. వీరివురిపై రూ.35లక్షల రివార్డు ఉంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విజయ్‌రెడ్డి స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు కాగా, సలామి.. డివిజన్ కమిటీ సభ్యుడిగా వ్యవహరిస్తున్నారు. మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారం మేరకు బందాపహాడ్ కొండను నలువైపులా పోలీసు బలగాలు చుట్టుముట్టాయి. జోరు వర్షం పడుతుండగానే ఇరు వర్గాల మధ్య కాల్పులు జరిగాయి. ఈ విషయాన్ని మోహ్లా-మన్పూర్-అంబర్గ్ చౌక్ ఎస్పీ వైపీ సింగ్ ధ్రువీకరించారు.

ప్రేమికుడి కోసం...శ్రీలంక నుంచి ప్లాస్టిక్ పడవలో ధనుష్కోటికి

- జాలరికి డబ్బులు ఇచ్చి వచ్చిన యువతి
- అదుపులోకి తీసుకున్న పోలీసులు
- శ్రీలంక శరణార్థుల శిబిరానికి తరలింపు



అరెస్టయిన విదుర్షియా

చెన్నై, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన వ్యక్తి కోసం శ్రీలంక నుంచి భారత్‌కు ఓ ప్లాస్టిక్ పడవలో వచ్చిందో యువతి. ఒంటిపై నగలను తెగనమ్మి ఓ జాలరి సాయంతో ధనుష్కోటికి చేరుకుంది. కానీ ఎటుపోవాలో తెలియక తచ్చాడుతుండడతో స్థానికులు అనుమానించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వివరాలు....మంగళవారం వేకువజామున రామేశ్వరం సమీపంలోని ధనుష్కోటి అరిచ్చల్‌మునై ప్రాంతం వద్ద ఓ యువతి ఒంటరిగా సంచరిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. ఆ యువతి శ్రీలంక మన్నార్ ఆండకుళం ప్రాంతానికి చెందిన విదుర్షియా (25)గా గుర్తించారు. గతంలో తమిళనాడులోని పళని శ్రీలంక శరణార్థుల శిబిరంలో తన తల్లిదండ్రులతో కలిసి ఉన్న విదుర్షియా.. స్థానికంగా ఓ యువకుడితో ప్రేమలో పడింది. తర్వాత కుటుంబంతో కలిసి గత ఏడాది శ్రీలంక వెళ్లిపోయింది. ఎన్నిరకాలుగా ప్రయత్నించినా మళ్లీ భారత్‌కు వచ్చేందుకు ఆమెకు వీసా లభించలేదు. దీంతో ఓ జాలరిని ఆశ్రయించింది. అతను భారత్ తీరానికి చేర్చేందుకు రూ.2 లక్షలు అడగడంతో తన ఒంటిపై ఉన్న నగల్ని తెగనమ్మి అతనికి ఇచ్చింది. అనంతరం అతను ఏర్పాటు చేసిన ఓ సాధారణ ప్లాస్టిక్ పడవలో సోమవారం రాత్రి బయలుదేరింది. ధనుష్కోటి తీరంలో ఆమెను దింపిన అనంతరం ఆ జాలరి వెనుదిరిగివెళ్లిపోయాడు. అనంతరం ఎక్కడికెళ్లాలో, ఎలా వెళ్లాలో తెలియక విదుర్షియా తీరంలో తచ్చాడుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం ఆమెను రామేశ్వరం సమీపంలోని మండపం శ్రీలంక శరణార్థుల శిబిరానికి తరలించారు.

40 రోజుల్లో 1.20 కోట్ల ఇళ్లకు!

దేశంలో ఏ అధికార పార్టీ ఈ స్థాయిలో జనంలోకి వెళ్లలేదు: సీఎం

- 'సుపరిపాలనలో తొలి అడుగు'తో రికార్డు సాధించాం
- 13 నియోజకవర్గాల్లో వెనుకబాటు
- అక్కడి ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులను సంజాయిషీ కోరాలి
- 'స్త్రీ శక్తి'తో 90% హామీలు నెరవేర్చినట్లే
- 18 నుంచి 5 రోజులపాటు ప్రచారం
- 'సూపర్ సిక్స్ సూపర్ హిట్' పేరుతో 25న అనంతలో భారీ సభ: చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రవ్యాప్తంగా 1.50 కోట్ల ఇళ్లు ఉంటే 40 రోజుల్లో 1.20 కోట్ల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని మన పార్టీ శ్రేణులు తెలియజేశాయి. దేశంలో ఏ అధికార పార్టీ కూడా ఈ స్థాయిలో ప్రజల్లోకి వెళ్లిన దాఖలా లేదు. మంచి చేశాం కాబట్టే ధైర్యంగా వారిలోకి వెళ్లగలిగాం' అని టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయానికి వచ్చిన ఆయన రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి లోకేశ్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్టీ నిర్దేశించిన కార్యక్రమం 'సుపరిపాలనలో తొలి అడుగు'పై సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమం చాలా చోట్ల ఎంతో బాగా జరిగినా 13 నియోజకవర్గాల్లో సరిగా జరగలేదని.. అక్కడి ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులకు లేఖలు రాసి ఏ కారణాలతో తిరగలేకపోయారో, ఎందుకు వెనుకబడ్డారో సంజాయిషీ కోరాలని చంద్రబాబు పల్లాను ఆదేశించారు. నామినేటెడ్ పదవుల్లో ఎమ్మెల్యేలు సిఫారసు చేసిన వారితోపాటు పార్టీ కోసం పనిచేసే వారికీ ప్రాధాన్యం ఉండేలా చూడాలని సూచించారు. 15న స్త్రీశక్తి పథకం ప్రారంభిస్తే సూపర్ సిక్స్ హామీల్లో 90 శాతం అమలు చేసినట్లేనన్నారు. ఈ స్కీమును మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆగస్టు 18 నుంచి ఐదు రోజులపాటు ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ నెల 25న అనంతపురంలో 'సూపర్ హిట్ సూపర్ సిక్స్' పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించాలని ఈ సందర్భంగా నిర్ణయించారు.

100 మంది కార్యకర్తల ఇళ్లకేనా వెళ్లేది!

టీడీపీ కార్యకర్తల సంక్షేమంపైనా చంద్రబాబు సమీక్షించారు. కార్యకర్తలకు బీమా అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. 400 మంది కార్యకర్తలు ప్రమాదాల్లో చనిపోతే వారందరికీ బీమా వర్తింపజేశామని, సుమారు రూ.20 కోట్లు వారి కుటుంబాలకు అందించామని పల్లా తెలిపారు. అయితే ప్రజాప్రతినిధులు గానీ, పార్టీ నాయకులు గానీ 100 మంది కార్యకర్తల ఇళ్లకు మాత్రమే వెళ్లారని ఆయన చెప్పడంతో సీఎం సీరియస్ అయ్యారు. 'కార్యకర్తల విషయంలో ఇంత ఉదాశీనంగా వ్యవహరిస్తే ఎలా? ఇకపై అలాంటి వారిపై సీరియస్‌గా దృష్టి పెట్టండి' అని ఆదేశించారు.

1.08 లక్షల మంది కార్యకర్తలు ప్రజల వద్దకు!

చంద్రబాబు సమీక్ష వివరాలను పల్లా విలేకరులకు తెలియజేశారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా 40 రోజులపాటు ప్రతిరోజూ 1.08 లక్షల మంది పార్టీ కార్యకర్తలు జనం వద్దకు వెళ్లి.. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేసిన మంచిని వివరించారని చెప్పారు. అలాగే పాలనపై ప్రజలు ఏమనుకుంటున్నారో కూడా తెలుసుకున్నారని.. కూటమి ప్రభుత్వ పాలనలో ప్రశాంతంగా ఉంటున్నామని, గత ఐదేళ్లు రాక్షస పాలన సాగిందని అధిక శాతం మంది అభిప్రాయపడ్డారని తెలిపారు. 'గతంలో ఎమ్మెల్యేలు మాత్రమే నియోజకవర్గంలో తిరిగేవారు. ఈసారి పార్టీ శ్రేణులు ప్రజల్లోకి వెళ్లాయి. జూన్ 2 నుంచి ఆగస్టు 10 వరకు 40 రోజులపాటు నిర్వహించిన తొలి అడుగు కార్యక్రమంలో 13 నియోజకవర్గాలు మాత్రమే 30వేల ఇళ్లలోపు తిరిగిన జాబితాలో ఉన్నాయి. ఎందుకు తిరగలేకపోయారో ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జుల నుంచి వివరణ కోరతాం. మంత్రి లోకేశ్ సలహాతో ఈ కార్యక్రమానికి సాంకేతికతను జోడించడంతో తూతూ మంత్రంగా ముగించడానికి ఆస్కారం లేకుండా పోయింది. పార్టీ కొత్తగా ఏర్పాటు చేసుకున్న క్లస్టర్, యూనిట్, బూత్ విభాగాలు దీని విజయవంతానికి బాగా కృషిచేశాయి. వైసీపీ పాలనలో ఇబ్బందులు పడి, పార్టీ కోసం పోరాడిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని పార్టీ అధినేత ఆదేశించారు. ఆయన సూచనల మేరకు నామినేటెడ్ పదవుల్లో వారికే ప్రాధాన్యం ఇస్తున్నాం. కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నాం. దేశంలో ఏ పార్టీ చేపట్టని విధంగా వారికి ప్రమాద బీమా అమలు చేస్తున్నాం. ఏడాది కాలంలో 400 మంది కార్యకర్తలు ప్రమాదవశాత్తూ మృత్యువాత పడితే వారికి రూ.20 కోట్లు చెల్లించాం' అని తెలిపారు.



మంగళగిరిలోని టీడీపీ కేంద్రకార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న సీఎం చంద్రబాబు

నియోజకవర్గాల్లోనే ఫిర్యాదుల స్వీకరణ

ప్రతి నియోజకవర్గంలో శుక్ర, శనివారాల్లో స్థానిక ఎమ్మెల్యేలు ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పామని, ఇకపై దీనిపై పార్టీ అధిష్ఠానం మరింత సీరియస్‌గా ఉంటుందని పల్లా తెలిపారు. ఆ రోజుల్లో ప్రజలకు అందుబాటులో ఉండి వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించాలని ఎమ్మెల్యేలందరికీ స్పష్టంగా చెప్పాల్సిందిగా చంద్రబాబు ఆదేశించారని చెప్పారు. 10 నెలల కాలంలో కేంద్ర కార్యాలయానికి సుమారు 9 లక్షల ఫిర్యాదులు వస్తే వాటిలో 6 లక్షల వరకు రెవెన్యూ సంబంధిత సమస్యలేనన్నారు. వీటిలోనూ ఎక్కువ ఆస్తి తగాదాలేనని చెప్పారు.

సీఎంకు చైర్మన్ల కృతజ్ఞతలు

కార్పొరేషన్లకు కొత్తగా నియమితులైన పలువురు చైర్మన్లు బుధవారం పార్టీ కార్యాలయానికి వచ్చి సీఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వీరిలో సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చిరాం ప్రసాద్ తదితరులు ఉన్నారు.

అర్జీలు స్వీకరించిన బాబు, లోకేశ్

టీడీపీ కేంద్ర కార్యాలయానికి తరలివచ్చిన ప్రజల నుంచి చంద్రబాబు, లోకేశ్ ఫిర్యాదులు స్వీకరించారు. వారందరినీ ఆత్మీయంగా పలుకరించి.. సమస్యలను తెలుసుకుని అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు.

వ్యవసాయానికి స్మార్ట్ మీటర్లు వద్దు

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఇంధన రంగంలో వేగంగా మారుతున్న పరిణామాలకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. ఇంధన రంగంలో స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ను ఆదేశించారు. పునరుద్పాదక ఇంధన ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించే అంశంపై అధ్యయనం చేయాలన్నారు. వచ్చే రెండు, మూడేళ్లలో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం మరో 8.9 శాతం మేర పెరిగే వీలుందని అన్నారు. విద్యుత్ ఉత్పత్తి ధర యూనిట్‌కు రూ.5-6 వరకూ తగ్గేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీలో 65 గిగావాట్ల పవన విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసే వీలుందని సీఎం తెలిపారు. ఇంధనోత్పత్తిలో కృత్రిమ మేధ (ఏఐ) సేవలను వినియోగించుకోవాలని సూచించారు. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిలో ఖర్చు తగ్గించడం కీలకమని చెప్పారు. మరోవైపు వినియోగదారులపై విద్యుత్ చార్జీల భారం వేసేందుకు వీల్లేదని సీఎస్ విజయానంద్‌కు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఏపీ ట్రాన్స్‌కో వేసిన ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్‌ను లీజుకివ్వడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందాలని చెప్పారు. ఈ మార్గం ద్వారా ఏటా దాదాపు రూ.7 వేల కోట్ల దాకా ఆదాయం వచ్చే వీలుందని సీఎం అంచనా వేశారు. సమీక్షలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి, జెన్కో, ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బహిరంగ మార్కెట్లో విద్యుత్ కొనుగోళ్లు తగ్గించండి

రాష్ట్రంలో 9 శాతంగా ఉన్న విద్యుత్ పంపిణీ నష్టాలు గణనీయంగా తగ్గించాలని సీఎం ఆదేశించారు. బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ కొనుగోళ్లను తగ్గించాలన్నారు. వివిధ ప్రాంతాల్లో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను సాధ్యమైనంతవరకూ స్థానికంగానే వినియోగిస్తే ప్రవాహ నష్టాలు తగ్గుతాయని చెప్పారు. యూనిట్ కొనుగోలు వ్యయాన్ని రూ.4.89కు తగ్గించేలా లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలన్నారు. మరోవైపు సెన్సర్లు, డ్రోన్లు ఇతర సాంకేతిక సహకారంతో ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితులను అధ్యయనం చేసి తదనుగుణంగా విద్యుత్ సరఫరాపై చర్యలు చేపట్టాలన్నారు. సెప్టెంబరు నుంచి వచ్చే ఏడాది మార్చి దాకా 12,700 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉంటుందని అంచనా వేశామని అధికారులు చెప్పగా.. డిమాండ్‌కు తగ్గట్టు ఉత్పత్తిని పెంచేలా చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు.

సోలార్‌పై దృష్టి పెట్టాలి..: సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టును వేగవంతం చేయాలని డిస్కమ్‌లను సీఎం ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు ఇతర వర్గాలకూ సోలార్ రూఫ్‌టాప్ కింద ఎన్ని యూనిట్లు మంజూరు చేశారని ఆరా తీశారు. ఈ ప్రాజెక్టుపై ప్రతినెలా సమీక్షిస్తానని చెప్పారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ పదివేల ఇళ్లకు తగ్గకుండా సోలార్ రూఫ్ టాప్‌ను బిగించాలని ఆదేశించారు. వాట్సాప్ మన మిత్ర యాప్ ద్వారా డిస్కమ్‌లు సేవలందించాలని తెలిపారు. రాష్ట్రంలో లో వోల్టేజీ సమస్యను పరిష్కరించాలన్నారు.

ఆక్వా లైసెన్సుల ప్రక్రియ సులభతరం

- అప్సడా చట్ట ప్రకారం సాగు ధ్రువీకరణ తప్పనిసరి
- అమెరికా సుంకాలపై కేంద్రంతో సీఎం చర్చలు: మంత్రి అచ్చెన్న

అమరావతి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆక్వా సాగుకు లైసెన్సుల జారీ ప్రక్రియను సులభతరం చేశామని వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. ఆక్వా రైతులు ప్రభుత్వ ప్రయోజనాలను పొందేందుకు రొయ్యలు, చేపల చెరువులను ఏపీఎస్ఏడీఏ చట్టం కింద ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. బుధవారం అమరావతి సచివాలయంలో మంత్రి అచ్చెన్నాయుడు అధ్యక్షతన ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ(అప్సడా) ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆక్వా రైతులకు మేలు జరిగేలా అమెరికా సుంకాల భారంపై సీఎం చంద్రబాబు కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నారని తెలిపారు. సుంకం తక్కువ ఉన్న దేశాలకు రొయ్యల్ని ఎగుమతి చేస్తే రైతులకు నష్టం వాటిల్లదన్నారు. రొయ్యల రైతులకు కూటమి ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఇస్తుందని చెప్పారు. ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. డీ పట్టా, అసైన్డ్, సీజేఎఫ్ఎస్ భూముల్లో చేపలు పెంచే రైతులు అప్సడా చట్టం ప్రకారం సాగు ధ్రువీకరణ పత్రాన్ని పొందితే ప్రభుత్వ ప్రయోజన పథకాల పరిధిలోకి వస్తారని పేర్కొంది. కొన్ని జిల్లాల్లో రొయ్యలు, చేపలకు ఆహారంగా వాడుతున్న పౌల్ట్రీ, ఇతర జంతువుల వ్యర్థాలు నీటి కాలుష్యానికి, ప్రజారోగ్యానికి హానికరమైనందున వీటిని తక్షణం నిలిపివేయాలని, లేకపోతే ఏపీ ఫిష్ ఫీడ్ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. మహిళా మత్స్యకారులకు జీవనోపాధి లక్ష్యంగా సముద్ర నీటిలో, జలాశయాల్లో చేపల పెంపకాన్ని ప్రోత్సహించడానికి మారికల్చర్ విధానం, రిజర్వాయర్ కేజ్ కల్చర్ విధానాన్ని ఆమోదించింది. 'రిజర్వాయర్లలో కేజ్ కల్చర్ ద్వారా 5 లక్షల టన్నుల చేపల ఉత్పత్తి పెంచే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలి. అదనంగా సముద్ర తీర ప్రాంతాల్లో 4-5 ఎంపిక చేసిన ప్రదేశాల్లో సముద్ర నాచు సాగును ప్రోత్సహించాలిఈ నెల 27 నుంచి భారత రొయ్యల ఎగుమతులపై అమెరికా విధించిన 60 శాతం టారిఫ్‌లను దృష్టిలో ఉంచుకుని, సుంకాల ప్రభావాన్ని తగ్గించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. దక్షిణ కొరియా, యూకే, యూరప్, మిడిల్ ఈస్ట్, రష్యా, ఆఫ్రికా దేశాల్లో కొత్త ఎగుమతి మార్కెట్లను ఎంపెడా సహకారంతో అన్వేషించాలి. యూకేతో ఫ్రీట్రేడ్ అగ్రిమెంట్‌ను వినియోగించుకోవాలి. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లను లక్ష్యంగా ఆక్వా ఎగుమతిదారులు, ప్రాసెసర్లు విలువ ఆధారిత ఉత్పత్తులపై దృష్టి పెట్టాలి. ఆంధ్రప్రదేశ్ ప్రాన్ ప్రొడ్యూసర్స్ కో-ఆర్డినేషన్ కమిటీని కంపెనీ చట్టం కింద ఏర్పాటు చేయాలి. ఈ కమిటీలో ఆక్వా రంగ భాగస్వాములు సభ్యులుగా ఉండాలి' అని నిర్ణయించారు. నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ(నెక్) తరహాలో ఈ కమిటీ దేశీయ వినియోగాన్ని పెంచేందుకు ఉపయోగపడాలి' అని నిర్ణయించారు. కో-వైస్‌చైర్మన్ ఆనం వెంకట రమణారెడ్డి, ఎక్స్ అఫీషియో స్పెషల్ సీఎస్ రాజశేఖర్, మత్స్యశాఖ కమిషనర్ రామ్‌శంకర్‌నాయక్ హాజరయ్యారు.

రేషన్ డీలర్ల కమీషన్ ఇక నేరుగా ఖాతాల్లోకి

అమరావతి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పేదలకు రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న డీలర్లకు ప్రతి నెలా సప్లయ్ చైన్ మెనేజ్‌మెంట్ ద్వారా చెల్లిస్తున్న కమీషన్ సొమ్మును ఇక నుంచి డీలర్ల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం డీలర్ల బ్యాంకు ఖాతాలు, పాన్‌కార్డు వివరాలను అత్యవసరంగా సేకరించాలని ఆదేశిస్తూ సివిల్ సప్లయిస్ కమిషనర్ సౌరభ్ గౌర్ డీఎస్‌వోలందరికీ సర్క్యులర్ జారీ చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే 'ఎస్ఎన్ఏ-స్పార్ష్' పోర్టల్ కింద నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు డబ్బు జమ చేసేందుకు ఈ నెల 14వ తేదీలోగా డీలర్ల డేటాను సేకరించి ఎస్‌సీఎం డేటా బేస్‌తో అనుసంధానం చేయాలని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే డీలర్ల కమీషన్, ఇతర చెల్లింపులు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని వివరించారు.

ఓఎంసీ కేసులో సబిత, కృపానందాన్ని నిర్దోషులుగా ప్రకటించడం చెల్లదు: సీబీఐ

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఓబులాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) కేసులో అప్పటి పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి బీ కృపానందం, అప్పటి మంత్రి సబితా ఇంద్రారెడ్డిని నిర్దోషులుగా ప్రకటించడం చెల్లదని సీబీఐ పేర్కొంది. ఈ కేసులో వీరిద్దరిపై కేసు రుజువు కాకపోవడంతో వారిని నిర్దోషులుగా ప్రకటిస్తూ నాంపల్లి సీబీఐ ప్రత్యేక కోర్టు ఇటీవల తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ తీర్పును కొట్టేయాలని హైకోర్టులో సీబీఐ అప్పీల్ దాఖలు చేసింది. న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి.. విచారణను ఈ నెల 18కి వాయిదా వేశారు.

న్యూ డెమోక్రసీ పార్టీల విలీనం

రాంనగర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): సీపీఐ(ఎంఎల్)తో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీలు విలీనమయ్యాయి. పశ్చిమబెంగాల్‌లో ఇటీవల జరిగిన సమావేశంలో ఈ విప్లవ పార్టీలు విలీనమయ్యాయి. ఈ విలీనం భవిష్యత్‌లో విప్లవ సంస్థల మధ్య ఐక్యతను పెంచేందుకు బలమైన పునాది ఏర్పరుస్తుందని సీపీఐఎంఎల్‌న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ అభిప్రాయపడింది. హైదరాబాద్ విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆ సంస్థ కేంద్ర కమిటీ సభ్యులు వేముల వెంకట్రామయ్య, జేవీ చలపతిరావు, సాదినేని వెంకటేశ్వర్‌రావు, బీ.ప్రదీప్, రాష్ట్ర కార్యదర్శి కార్యవర్గ సభ్యులు కే.గోవర్ధన్ విప్లవ పార్టీల విలీనం వివరాలు వెల్లడించారు. 1969లో ఏర్పడిన సీపీఐ (ఎంఎల్) ప్రభావంతో అనేక ప్రాంతాలలో పీడనలు తగ్గాయని.. రైతులకు గిట్టుబాటు ధర, కార్మికులకు పనికి తగిన వేతనం, రైతు కూలీల భాగస్వామ్యం, మహిళా సమస్యలపై ఉద్యమించి అనేక విజయాలు సాధించామన్నారు.

పులివెందుల.. అరాచకం నుంచి బయటపడుతోంది

- ప్రజలు ధైర్యంగా ఓట్లేశారు
- తానెప్పుడూ చేసే అరాచకాలు జరగలేదనే జగన్‌లో అసహనం: చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ప్రజలు ఇప్పుడిప్పుడే అరాచకం నుంచి బయటపడుతున్నారని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో కాసేపు మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. 'పులివెందులలో ఎప్పుడూ తాను చేసే అరాచకాలు ఈసారి జరగలేదని జగన్ అసహనంతో ఉన్నారు. వైఎస్ హయాం నుంచీ అక్కడ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నిక జరగలేదు. నామినేషన్ వేయడానికే భయపడే పరిస్థితుల నుంచి 11 మంది నామినేషన్లు వేసే పరిస్థితికి తీసుకొచ్చాం. శాంతిభద్రతల నిర్వహణ పటిష్ఠంగా జరిగింది కాబట్టే ప్రజలు ధైర్యంగా బయటకు వచ్చి ఓటేశారు' అని తెలిపారు. విస్తారంగా కురుస్తున్న వర్షాలపై పూర్తి అప్రమత్తంగా ఉన్నామని, ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లో భారీ వర్షాలు ఉన్నా.. రాష్ట్రవ్యాప్తంగా ఇంకా 17 శాతం లోటు ఉందన్నారు.

పదవులు రాలేదని నిరాశపడొద్దు: లోకేశ్

మంత్రి లోకేశ్ కూడా కాసేపు మీడియాతో మాట్లాడారు. నామినేటెడ్ పదవులు రాని ఆశావహులు నిరాశ పడాల్సిన అవసరం లేదని, అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. పులివెందులలో 45 ఏళ్ల తర్వాత ప్రజాస్వామ్యం నిలబడిందని, ఎప్పుడూ బలవంతపు ఏకగ్రీవం జరిగే చోట విచిత్రంగా సరిగ్గా 11 మంది పోటీలో నిలబడ్డారని అన్నారు. పులివెందులలో ప్రజాస్వామ్యం చూసి వైసీపీ ఓర్వలేకపోతోందని వ్యాఖ్యానించారు.

ప్రధాని మోదీ ఓట్ల దొంగ!

ఎన్నికల సంఘం ప్రధానికి తొత్తుగా మారింది.. ఆర్ఎస్ఎస్, బీజేపీ రాసిచ్చిన స్క్రిప్టునే ఈసీ చదువుతోంది

- దొంగ ఓట్లతో బీజేపీ 70 స్థానాలను గెలుచుకుంది
- మూడోసారి అధికారంలోకి రావడానికి అదే కారణం
- మారుమూల లోక్‌సభ నియోజకవర్గాలే వారి లక్ష్యం
- 30ఏళ్లుగా దొంగ ఓట్లను పెంచుకుంటూ పోతోంది
- దేశ ప్రజల కోసం పోరాడుతున్న రాహుల్ గాంధీకి ఏపీ, తెలంగాణ ప్రజలు మద్దతుగా నిలవాలి
- చంద్రబాబు, జగన్ ఇద్దరూ మోదీకి దత్తపుత్రులు
- మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి లీడర్ కాదు.. రీడర్
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాశ్‌రెడ్డి



విజయవాడలో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి; చిత్రంలో మస్తాన్ వలీ తదితరులు

అమరావతి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ ఓట్ల దొంగ అని, కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం వరుసగా మూడోసారి అధికారంలోకి రావడానికి దొంగ ఓట్లే కారణమని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాశ్‌రెడ్డి (జగ్గారెడ్డి) ఆరోపించారు. ఈ ఓట్ల చోరీపై ఎన్నికల సంఘానికి, బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు దేశ ప్రజలంతా మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. బుధవారం విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. బీజేపీ మూడు దశాబ్దాలుగా మారుమూల ప్రాంతాల్లోని లోక్‌సభ నియోజకవర్గాలను ఎంపిక చేసుకుని దొంగ ఓట్లను పెంచుకుంటూ పోతోందని ఆరోపించారు. అలా దేశవ్యాప్తంగా 70వరకు లోక్‌సభ స్థానాలను చేజిక్కించుకుందని పేర్కొన్నారు. ఈ ఓట్ల చోరీలో ఏబీవీపీ, స్వదేశీ జాగరణ్ మంచ్, ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్ భాగస్వామ్యం అవుతున్నాయని వ్యాఖ్యానించారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ రాసిచ్చిన స్క్రిప్టునే ఎన్నికల సంఘం చదువుతోందని విమర్శించారు. బీజేపీ ప్రముఖ్ రాసిచ్చిన స్క్రిప్టునే ఇటీవల ఏపీ మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి చదివారని.. ఆయన లీడర్ కాదని రీడర్ అని ఎద్దేవా చేశారు.

ఎన్నికల సంఘం సమాధానం చెప్పడం లేదేం?

ఓట్ల చోరీపై రాహుల్‌గాంధీ ఆధారాలతో సహా లేవనెత్తిన సందేహాలపై కేంద్ర ఎన్నికల సంఘం నేరుగా ఎందుకు స్పందించడం లేదని జగ్గారెడ్డి నిలదీశారు. ప్రధాని మోదీ, ఆర్ఎస్ఎస్ గొంతునే ఈసీ వినిపిస్తోందని ఆరోపించారు. ప్రధాని కావాలన్న కాంక్షతో రాహుల్ పోరాటం చేయడం లేదని, దేశ ప్రయోజనాల కోసమే చేస్తున్నారని చెప్పారు. అసలు నెహ్రూ నుంచి రాజీవ్‌గాంధీ దాకా ప్రధాని పదవి వారి ఇంట్లోనే పుట్టిందని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. దొంగ ఓట్ల వ్యవహారాన్ని రాహుల్ సాక్ష్యాధారాలతో బయటపెట్టారని, కాంగ్రెస్ పార్టీకి దమ్ముందని చెప్పేందుకు ఇంతకంటే నిదర్శనం ఏం కావాలని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు, వైఎస్ జగన్‌లలో ఎవరు అధికారంలోకి వచ్చినా అది బీజేపీ ఖాతాలోకే వెళ్తుందని పేర్కొన్నారు. ప్రధాని మోదీకి చంద్రబాబు, జగన్ దత్తపుత్రులని.. బయటికి ఎంత కొట్టుకున్నా చివరికి మోదీ వద్దకు వెళ్లి ఉపశమనం పొందుతారని వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ కాంగ్రెస్ పార్టీ బలాన్ని పెంచుకుని ప్రత్యామ్నాయశక్తిగా ఎదుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలీ తదితరులు పాల్గొన్నారు.

లిక్కర్ నిందితులకు రిమాండ్ పొడిగింపు

26 వరకు పొడిగిస్తూ ఏసీబీ కోర్టు ఉత్తర్వులు.. కసిరెడ్డి బెయిల్‌పై వాదనలు 18కి వాయిదా

- కోర్టు హాల్ వద్ద వైసీపీ శ్రేణుల హడావుడి
- అసహనం వ్యక్తం చేసిన న్యాయవాదులు
- పోలీసులపై చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చిందులు



మిథున్ రెడ్డి



చాణక్య



బాలాజీ



చెవిరెడ్డి భాస్కర్

విజయవాడ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో 12 మంది నిందితుల రిమాండ్‌ను విజయవాడ ఏసీబీ కోర్టు పొడిగించింది. 26వ తేదీ వరకు వారి రిమాండ్‌ను పొడిగిస్తూ న్యాయవాధికారి పి.భాస్కరరావు బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. రాజమహేంద్రవరంలోని కేంద్ర కారాగారం నుంచి ఎంపీ మిథున్‌రెడ్డి, గుంటూరు జిల్లా జైలు నుంచి బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ కృష్ణ, విజయవాడ జిల్లా జైలు నుంచి కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, పి.కృష్ణమోహన్‌రెడ్డి, కె.ధనుంజయ్‌రెడ్డి, పైలా దిలీప్, బూనేటి చాణక్య, బాలాజీ గోవిందప్ప, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చెరుకూరి వెంకటేశ్ నాయుడును వేర్వేరు వాహనాల్లో కోర్టుకు తీసుకొచ్చారు. రిమాండ్ ఉత్తర్వులకు ముందు నిందితులు వారి సమస్యలను న్యాయాధికారికి వివరించారు. తన వెన్నెముక నొప్పికి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అవసరమని చెవిరెడ్డి చెప్పారు. కేసుకు సంబంధంలేని పోలీసులు తన తల్లిని బెదిరిస్తున్నారని పైలా దిలీప్ న్యాయాధికారికి తెలిపారు. కాగా, సిట్ అధికారులు సీజ్ చేసిన రూ. 11 కోట్లపై కోర్టులో వాదనలు జరిగాయి. ఈ నగదు విషయంలో కోర్టు ఆదేశాలను సిట్ అధికారులు పాటించడం లేదంటూ కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి కోర్టుకు వివరించారు. కోర్టు ఆదేశాల ఉల్లంఘనకు సంబంధించి పిటిషన్ దాఖలు చేయాలని న్యాయాధికారి వారికి సూచించారు. కాగా, రాజ్ కసిరెడ్డి బెయిల్ పిటిషన్‌పై వాదనలను కోర్టు 18వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. సజ్జల శ్రీధర్‌రెడ్డి బెయిల్‌పై ప్రాసిక్యూషన్ వాదనలు గురువారానికి వాయిదా పడ్డాయి.

మిథున్‌తో ములాఖత్‌కు మరో ఇద్దరు లాయర్లు

ఎంపీ మిథున్‌రెడ్డితో ములాఖత్ అయ్యేందుకు మరో ఇద్దరు న్యాయవాదులకు కోర్టు అనుమతి ఇచ్చింది. ప్రస్తుతం నలుగురు న్యాయవాదులకు ఈ అనుమతి ఉంది. రాజమహేంద్రవరంలో ఉండే ఇద్దరు న్యాయవాదులు ములాఖత్ అయ్యేందుకు అనుమతి ఇవ్వాలని మిథున్‌రెడ్డి తరపున న్యాయవాదులు మెమో దాఖలు చేశారు. స్థానికంగా ఉండే సాదిక్ హుస్సేన్, సాయి భాస్కర్ శంకర్ పేర్లను జాబితాలో చేర్చారు. తనకు ఇంటి నుంచి రోజుకు రెండుపూటల భోజనం తెచ్చేలా అనుమతి ఇవ్వాలని మిథున్‌రెడ్డి న్యాయాధికారిని కోరారు.

అటుఇటూ మూసేశారు

వైసీపీ శ్రేణులతో కోర్టు కారిడార్ నిండిపోయింది. మద్యం కేసు నిందితులు బుధవారం కోర్టుకు హాజరైనప్పుడు తమ అభిమాన నేతల్ని కలవడానికి నియోజకవర్గాల నుంచి భారీగా కార్యకర్తలు కోర్టు వద్దకు వచ్చారు. న్యాయవాదులు,కోర్టు సిబ్బందికి మాత్రమే అనుమతి ఉండే కారిడార్‌ను కూడావారు ఆక్రమించారు.దీనిపై న్యాయవాదులు అసహనం వ్యక్తం చేశారు.

మీ అందరి సంగతి చూస్తా: చెవిరెడ్డి

"అందరినీ ఒకే వాహనంలో ఎందుకు ఎక్కించడం లేదు. మేము నక్సలైట్లమా? ఎన్‌కౌంటర్ చేయండి. అధికారంలోకి వచ్చాక మీ అందరిసంగతి చూస్తా." అంటూ ఎస్కార్ట్ పోలీసులపై చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చిందులు తొక్కారు. కోర్టులో హాజరుపరిచి బయటకు తీసుకువచ్చాక నిందితులను మళ్లీ జైలుకు తరలించారు. ఈక్రమంలో మిగతా నిందితులున్న వాహనంలో కాకుండా వేరే వాహనం ఎక్కాలని వెంకటేశ్ నాయుడు, చెవిరెడ్డికి పోలీసులు చెప్పారు. దీంతో అక్కడే ఉన్న ఎస్కార్ట్ సిబ్బందిపై రుసురుసలాడారు. చెవిరెడ్డి వ్యాఖ్యలతో ఓ ఇన్‌స్పెక్టర్ మనస్తాపానికి లోనయ్యారని తెలిసింది.

కోదండరాం, అమీర్ ఎమ్మెల్సీ రద్దు

- నియామకాన్ని రద్దు చేస్తూ సుప్రీం కోర్టుతీర్పు





న్యూఢిల్లీ/హైదరాబాద్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గవర్నర్ కోటా ఎమ్మెల్సీలు కోదండరాం, అమీర్ అలీ ఖాన్‌లకు సుప్రీంకోర్టు షాకిచ్చింది. మండలి సభ్యులుగా వారి నియామకాన్ని రద్దు చేసింది. వారిద్దరు ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేయడమే తప్పని పేర్కొంది. హైకోర్టు తీర్పుపై స్టే విధిస్తూ గతంలో తామిచ్చిన మధ్యంతర ఉత్తర్వును సవరించింది. ఎమ్మెల్సీలుగా కోదండరాం, అమీర్ అలీఖాన్‌ల నియామకాన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రావణ్, కుర్రా సత్యనారాయణ వేసిన పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం ఈ సంచలన తీర్పు వెలువరించింది. అయితే వారి పేర్లను ప్రభుత్వం మరోసారి సిఫారసు చేయవచ్చని, వారి నామినేషన్లను స్వీకరించవచ్చని తెలిపింది. ఏ నామినేషన్ వేసినా ఈ అంశంపై తుది తీర్పునకు అనుగుణంగానే ఉంటుందని స్పష్టం చేసింది. తదుపరి విచారణను సెప్టెంబరు 17కు వాయిదా వేసింది. బీఆర్ఎస్ హయాంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా శ్రవణ్‌కుమార్, సత్యనారాయణ పేర్లను ప్రతిపాదిస్తూ మంత్రివర్గం గవర్నర్‌కు సిఫారసు చేయగా.. రాజకీయ నేపథ్యం ఉందని చెబుతూ ఆ ఇద్దరి పేర్లను అప్పటి గవర్నర్ తమిళిసై తిరస్కరించారు. ఆ నిర్ణయాన్ని వారు హైకోర్టులో సవాల్ చేశారు. అయితే కోర్టులో కేసు నడుస్తుండగానే బీఆర్ఎస్ అధికారం కోల్పోయి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైంది. గతేడాది జనవరి 13న కోదండరాం, అమీర్ అలీఖాన్ పేర్లను గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా మంత్రివర్గం సిఫారసు చేసింది. గవర్నర్ ఆమోదం తెలిపారు. దీంతో శ్రావణ్, సత్యనారాయణ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.



ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలంలో నీటి మునిగిన పత్తి చేను



కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం నాదెళ్లవారిపాలెంలో నేలవాలిన అరటి



నంద్యాల జిల్లా రుద్రవరం మండలంలో నీటమునిగిన మొక్కజొన్న పంట



కోనసీమ జిల్లా ముమ్మిడివరం పోలీస్‌స్టేషన్‌లోకి వర్షపునీరు చేరగా సెల్‌ఫోన్ వెలుగులోనే విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సిబ్బంది



కోనసీమ జిల్లా ముమ్మిడివరం తహసీల్దార్ కార్యాలయంలో వర్షపునీటి మధ్యే విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్



పల్నాడు జిల్లా సత్తెనపల్లి కోర్టు ఆవరణలో నిలిచిన వర్షపు నీరు




రాష్ట్రంలో వర్షాల పరిస్థితిని తెలుసుకుంటున్న హోంమంత్రి అనిత



కర్నూలు-గుంటూరు రహదారిలోని దోర్నాల మండలం దొంగలవాగు చప్టాపై ప్రవహిస్తున్న వరద నీరు



నంద్యాల జిల్లా రుద్రవరం మండలం చిలకలూరు సమీపంలో నేలవంతెనపై ప్రవహిస్తున్న వర్షం నీరు



పశ్చిమ గోదావరి జిల్లా తణుకు శివాలయ గర్భగుడిలో వర్షం నీటిలో మునిగిన శివలింగం

బెజవాడ గుంటూరు జలమయం

భారీ వర్షంతో రోడ్లపై మోకాళ్లలోతు నీరు.. కొండవీటి వాగులో కొట్టుకుపోయిన కారు

రాజధాని ప్రాంతాలకు స్తంభించిన రాకపోకలు.. కాజ టోల్‌ప్లాజా వద్ద నీట మునిగిన జాతీయ రహదారి.. గుంటూరు వ్యవసాయ కమిషనరేట్‌లోకి నీరు

తాడేపల్లిలో పలు కాలనీల్లో వరదనీరు.. బాపట్ల, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో పంటల మునక

గుంటూరు, బాపట్ల, విజయవాడ, మచిలీపట్నం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): భారీ వర్షంతో గుంటూరు, విజయవాడ నగరాలు జలమయమయ్యాయి. ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా మంగళవారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. బుధవారం సాయంత్రం కూడా భారీ వర్షం కురిసింది. విజయవాడ నగరం జలదిగ్బంధమైంది. ఎన్టీఆర్ జిల్లాలో వైరా, మున్నేరు, కట్టలేరు, పాలేరు ఉపనదులు ఉధృతంగా ప్రవహించాయి. విజయవాడలో కురిసిన వర్షం అంతా నగరంలోని స్ట్రామ్‌వాటర్ డ్రెయిన్స్, అవుట్‌ఫాల్ డ్రెయిన్‌ల ద్వారా ఈ ప్రధాన కాల్వలలోకి కలుస్తుంది. ప్రధాన కాల్వలలోకి విడుదల చేసిన వరద నీటిని తగ్గించకపోవడంతో విజయవాడలో కురిసిన వర్షం నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయింది. విజయవాడ పాతబస్తీ, కృష్ణలంక, గాంధీనగర్, మొగల్రాజపురం, బెంజి సర్కిల్, పటమట తదితర ప్రాంతాలు నీటమునిగాయి. జాతీయ రహదారులు, ప్రధాన రహదారులపై నీరు నిలిచింది. డ్రెయిన్‌లు, రోడ్లు కనిపించకుండా పూర్తిగా మోకాళ్ల లోతు నీరు నిలిచిపోయింది. మ్యాన్‌హోల్స్, డ్రెయిన్‌లు ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. గుంటూరు జిల్లా అంతటా వరదనీరు పోటెత్తింది. మేజర్ డ్రెయిన్లతో పాటు వాగులు పొంగి నివాస ప్రాంతాలు, పంట పొలాలను ముంచెత్తాయి. మంగళవారం రాత్రి 10 గంటల నుంచి బుధవారం వేకువజామున 4 గంటల వరకు ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో వాగులు ప్రమాదకర స్థాయికి చేరుకొన్నాయి. గుంటూరు నుంచి అమరావతి రాజధానిలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే అమరావతి రోడ్డులో లాం చప్టా వద్ద కొండవీటి వాగు ఉధృతంగా ప్రవహించడంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలు స్తంభించాయి. పెదపరిమి వద్ద కొట్టేళ్ల వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాజధానికి రాకపోకలు నిలిచాయి. కాజ టోల్‌ప్లాజా వద్ద జాతీయ రహదారిపైకి భారీగా వరదనీరు చేరడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగింది. గుంటూరు-తెనాలి, సత్తెనపల్లి-పిడుగురాళ్ల మధ్య రైల్వేట్రాక్ కింద వాగులు ప్రమాదకరంగా ప్రవహిస్తుండటంతో రైల్వే శాఖ కాషన్ ఆర్డర్ జారీ చేసింది. గంటకు 30 కిలోమీటర్ల వేగానికి మించి ఆయా సెక్షన్లలో రైళ్లను ప్రయాణించకుండా చర్యలు చేపట్టింది. గుంటూరు నగరంలోని చుట్టుగుంట వద్ద ఉన్న వ్యవసాయ, మార్కెటింగ్ కమిషనరేట్లలోకి వరద నీరు చేరడంతో ఉద్యోగులు చాలామంది విధులకు హాజరు కాలేకపోయారు. పెదకాకానిలోని నంబూరులో తాగునీటి చెరువు కట్ట తెగిపోవడంతో ఆ గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. తాడేపల్లిలోని పుష్కర కాలనీ, ఎల్ఎల్ కాలనీల్లోకి వరదనీరు చేరడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మేడికొండూరు మండలంలోని విశదల వద్ద కొండవాగు ఉధృతికి ఎన్ఆర్ఐ కళాశాల వద్ద పార్కింగ్ చేసి ఉన్న కారు కొట్టుకుపోయింది. పాలడుగు వద్ద వాగు కూడా రహదారిపై ప్రవహిస్తున్నది. గుంటూరు నగరంలో శంకర్‌విలాస్ ఆర్వోబీని కూల్చివేయడంతో ప్రత్యామ్నాయ మార్గాల్లో వరదనీరు నిలిచిన కారణంగా గంటల తరబడి రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. బుధవారం రాత్రికి ప్రకాశం బ్యారేజీ నుంచి 5 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదిలే అవకాశం ఉన్న నేపథ్యంలో కృష్ణా జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నదీతీరప్రాంతంలోని మండలాల్లోని 62 గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. బుడమేరుకు 10 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారని బుడమేరు ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. కృష్ణాజిల్లా ఉయ్యూరు మండలం ఐనంపూడిలో పిడుగు పడటంతో పశువులచావిడి దగ్ధమై రెండు పశువులు మృతి చెందాయి. ఉంగుటూరు మండలం నందమూరు వద్ద ఆటోపై తాడిచెట్టు విరిగిపడటంతో ఆటోడ్రైవర్‌కు గాయాలయ్యాయి. బాపట్ల జిల్లా చుండూరు మండలంలో 27 సెం.మీల వాన కురిసింది. దాదాపు 25,000 ఎకరాల్లో వరి పైరుకు నష్టం వాటిల్లినట్లు క్షేత్రస్థాయి పరిస్థితులు చెబుతున్నాయి. కొల్లూరు మండల పరిధిలోని లంక గ్రామాల్లోని ఇళ్లల్లోకి వరదనీరు చేరింది. వరద నీరు 7లక్షల క్యూసెక్కులకు చేరుకుంటే లంక గ్రామాల ప్రజలు ముంపుబారిన పడే ప్రమాదముందని అధికారులు అంచనా వేస్తున్నారు. పరిస్థితిని బట్టి ముంపు గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తామని యంత్రాంగం చెబుతోంది.

వర్షాలకు నలుగురు మృతి

- విజయవాడలో మ్యాన్‌హోల్‌లో పడి ఒకరు
- వర్షం నీటిలో పడి మరొకరు, చెట్టును బైక్ ఢీకొని ఇంకొకరు
- నంబూరులో వాగులో కొట్టుకుపోయి బాలుడి మృత్యువాత

విజయవాడ/ పెదకాకాని, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నగరంలో కురిసిన భారీ వర్షానికి విజయవాడ పశ్చిమ నియోజకవర్గం కొత్తపేటలో ఇద్దరు మృతి చెందారు. కొత్తపేట గులాం మొహిద్దీన్ వీధి రోడ్డులో మ్యాన్‌హోల్‌లో పడి 53వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు, మెడికల్ వ్యాపారి తిరువాయిపాటి మధుసూదన్‌రావు (52) మృతి చెందారు. అలాగే, జెండా చెట్టు సమీపంలో వర్షం నీటిలో పడి వించిపేటకు చెందిన షేక్ ముర్తాజ్ (46) చనిపోయారు. వీరిద్దరి మృతికి కార్పొరేషన్ డ్రైనేజీ విభాగం అధికారుల నిర్లక్ష్యమే కారణమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా, లయోల కళాశాల ప్రధానగేటుకు దగ్గర్లో మంగళవారం రాత్రి ఓ భారీ చెట్టు కూలిపోయింది. అటుగా బైక్‌పై వస్తున్న గుణదల దళితవాడకు చెందిన తుల్లూరి మహేష్ బాబు (36) ఆ చెట్టును ఢీకొట్టి అక్కడికక్కడే మరణించారు. అలాగే, గుంటూరు జిల్లా నంబూరు గ్రామానికి చెందిన బాలుడు నేలపాటి భరత్(14) వాగులో కొట్టుకుపోయి మరణించారు. భారీ వర్షాలకు నంబూరు-కాజ ప్రధాన రహదారిపైన వర్షపు నీటి ప్రవాహం పెరిగి వాగు ఉధృతంగా ప్రవహించింది. స్థానిక జడ్పీ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న భరత్ బుధవారం మధ్యాహ్నం వాగును చూసేందుకు రాగా, చెప్పు జారీ నీటిలో కొట్టుకుపోయింది. చెప్పును అందుకునేందుకు ప్రయత్నించిన భరత్ కూడా నీటిలో కొట్టుకుపోయాడు. గమనించిన స్థానికులు నీటిలో దిగి గాలించగా మృతదేహం లభ్యమైంది.

44,657 హెక్టార్లలో పంటలు మునక

భారీ వర్షాల కారణంగా గుంటూరు, బాపట్ల, ఎన్టీఆర్ జిల్లాల్లో 44,657 హెక్టార్లలో పంటలు ముంపుబారిన పడినట్లు వ్యవసాయశాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. మూడు జిల్లాల్లోని 21 మండలాల్లో 161 గ్రామాల్లో 52,924 మంది రైతుల పొలాల్లో నీరు నిలిచినట్లు గుర్తించారు. దీంతో వరి 40,782, పత్తి 3,420, మినుము 332, వేరుశనగ 123 హెక్టార్లలో నీటి ముంపులో ఉన్నట్లు క్షేత్రస్థాయి అధికారులు తేల్చారు. ప్రస్తుతం ఈ పంటలు ఏపుగా పెరిగే దశలో ఉన్నట్లు వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు తెలిపారు.





1 శ్రీశైలం డ్యాం ఏడు గేట్ల నుంచి కిందకు దూకుతున్న నీరు

2 బుధవారం బెజవాడ నిర్మలా కాన్వెంట్ రోడ్డులో వరద నీటిలో వాహనదారుల ఇబ్బందులు

కుంభవృష్టి

(మొదటి పేజీ తరువాయి)

మునిగిపోవడం చూసి రైతుల గుండె చెరువవుతోంది. ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద వచ్చి చేరుతుండగా, పొంగి పొర్లుతున్న వాగులు, డ్రెయిన్లు భయపెడుతున్నాయి. బుడమేరు వాగు మళ్లీ పొంగుతుందంటూ.. వచ్చిన వార్తలతో కృష్ణానది పరిసర ప్రాంతాలు ఉలిక్కిపడ్డాయి. సరిగ్గా ఏడాది క్రితం ఆగస్టులోనే బుడమేరు సృష్టించిన విలయం గుర్తు చేసుకుని బెజవాడ వాసులకు కన్నులపై కునుకు కరువైంది. అయితే, ప్రమాదం లేదని, వదంతులు నమ్మవద్దని అధికారులు వెల్లడించారు. రోడ్లపై మోకాలులోతున నీరు చేరుకున్న వేళ మ్యాన్‌హోల్స్ మృత్యువుగా నోళ్లు తెరిచాయి. విజయవాడలో మ్యాన్‌హోల్‌లో పడి ఒకరు మృత్యువాతపడ్డారు. జాతీయ రహదారిపై కాజా టోల్ ప్లాజా సమీపంలో నంబూరులో వాగులో పడి ఓ బాలుడు గల్లంతయ్యాడు. కొద్దిసేపటికే విగతజీవిగా మారాడు. గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో గురువారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. బాపట్ల జిల్లా చుండూరులో 24 గంటల్లో 27 సెంటీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైంది.

భయపెడుతున్న వాగులు

ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద చేరుతోంది. ఇప్పటి వరకు లక్ష క్యూసెక్కుల వరకు వచ్చిన ఇన్‌ఫ్లో బుధవారం ఒక్కసారిగా పెరిగింది. శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజ్ గేట్లు ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలంలోని గుండ్లకమ్మ ప్రాజెక్టు నిండుకుండలా మారడంతో మూడుగేట్లు ఎత్తి దిగువకు వదులుతున్నారు. నాగులుప్పలపాడు మండలం కొత్తకోట వాగు, ఒంగోలు రూరల్ మండలంలోని ముదిగండి వాగు, దోర్నాల మండలంలోని దొంగల వాగు పొంగడంతో ఆవైపు రాకపోకలు నిలిచిపోయాయి. నంద్యాల జిల్లా చాగలమర్రిలో కుందూనది ఉగ్రరూపం దాల్చింది. చాగలమర్రిలోని ఆనకట్టను దాటి కుందూనది ప్రవహించింది. రాయలసీమలోని కర్నూలు, నంద్యాల జిల్లాల్లోనూ భారీ వర్షాలు పడుతున్నాయి. మంగళవారం అర్ధరాత్రి కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో కుండపోతగా వర్షాలు పడ్డాయి.

పంట కల మునక..

వేల ఎకరాల్లో పంటలు ముంపు బారిన పడ్డాయి. నందికొట్కూరు మండలంలో చెరువుకు గండిపడటంతో వంద ఎకరాల్లో మొక్కజొన్న పంట నీట మునిగింది. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని బుడమేరు, వెలగలేరు, కొండవీటివాగు, పాలవాగు, కొటేళ్లవాగు, ఎద్దువాగు, పీలేరు వాగు, సత్రం వాగు ప్రవాహాల ఉధృతితో ఆయా ప్రాంతాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మరోవైపు కృష్ణానదికి ఎగువ నుంచి వరద వస్తుండటంతో లంక గ్రామాల్లో ఉద్యాన, కూరగాయ పంటలు నీటి ముంపులో ఉన్నాయి. రుద్రవరం మండలంలోని శ్రీరంగాపురంలో భారీ వర్షాలకు ఓ మట్టిమిద్దె కూలి మహిళకు గాయాలయ్యాయి. భారీ వర్షాల నేపథ్యంలో గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో పాఠశాలలకు గురువారం సెలవు ప్రకటించారు.

ఎందుకు ఇంత ముప్పు?

ప్రకాశం బ్యారేజీకి వరద పెరగడంతో ఇరిగేషన్‌శాఖ అధికారులు బందరు, ఏలూరు, రైవస్ కాల్వలకు నీటిని విడుదల చేస్తున్నారు. అయితే, విజయవాడలో కురిసిన వర్షం అంతా స్ట్రామ్‌వాటర్ డ్రెయిన్స్, అవుట్‌ఫాల్ డ్రెయిన్‌ల ద్వారా ఈ ప్రధాన కాల్వలలోకి కలుస్తుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈ కాల్వల్లోకి బ్యారేజీ నీటిని ముందు నుంచీ తగ్గించుకుంటూ రావాలి. కానీ, ఆ పనిని అధికారులు చేయకపోవడంతో నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయింది.

ఎక్కడెక్కడ ఎంతెంత వర్షం..

మంగళవారం రాత్రి, బుధవారం వివిధ ప్రాంతాల్లో నమోదైన వర్షపాతం వివరాలు (సెంటీ మీటర్లలో..)

బాపట్ల జిల్లా చుండూరు	27.0
గుంటూరు జిల్లా చేబ్రోలు	24.0
ఏలూరు జిల్లా నిడమర్రు	20.8
బాపట్ల.. పొన్నూరు	20.3
ప్రకాశం.. మద్దిపాడు	19.2
కృష్ణా..నాగాయలంక	19.1
గుంటూరు.. దుగ్గిరాల	18.9
కోనసీమ.. ముమ్మిడివరం	18.8
ఎన్టీఆర్..నందిగామ	18.4
కృష్ణా జిల్లా చల్లపల్లి	17.7
ఎన్టీఆర్..చందాపురం	17.0
కృష్ణా జిల్లా అవనిగడ్డ	16.7
గుంటూరు.. తుళ్లూరు	16.7
అమరావతి	16.5
గుంటూరు	15.9
గుంటూరు.. పెదకాకాని	15.6
ఎన్టీఆర్..వీరులపాడు	15.5
ఎన్టీఆర్..తొర్రగుడిపాడు	15.2

బంగాళాఖాతంలో అల్పపీడనం

- నేడు తీవ్ర అల్పపీడనంగా బలపడే అవకాశం

విశాఖపట్నం/అమరావతి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనం ప్రభావంతో బుధవారం ఉదయం పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఇది గురువారం నాటికి పశ్చిమ వాయవ్యంగా పయనించి తీవ్ర అల్పపీడనంగా బలపడుతుంది. శుక్రవారం నాటికి వాయుగుండంగా బలపడుతుందని కొన్ని వాతావరణ మోడల్స్ అంచనా వేశాయి. అల్పపీడనం ప్రభావంతో బుధవారం కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడా భారీవర్షాలు కురిశాయి. అల్పపీడనం కోస్తాకు ఆనుకుని(విశాఖపట్నం నుంచి పశ్చిమ గోదావరి జిల్లా వరకు) బంగాళాఖాతంలో కొనసాగుతున్నందున ప్రకాశం, బాపట్ల, పల్నాడు, గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో అతిభారీ, కొన్నిచోట్ల అసాధారణ వర్షాలు, పశ్చిమగోదావరి, ఏల్లూరు, నెల్లూరు, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, తూర్పుగోదావరి, తిరుపతి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో గురువారం అతి భారీవర్షాలు కురిసే అవకాశం ఉంది. కుంభవృష్టిగా వర్షాలు కురిసే అవకాశం ఉన్న బాపట్ల, పల్నాడు, గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో వరదలు రావొచ్చని వాతావరణ శాఖ హెచ్చరించింది.

రైతులకు అందుబాటులో ఉండండి: అచ్చెన్న

అల్పపీడనం నేపథ్యంలో వర్షప్రభావిత ప్రాంత రైతులకు వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండాలని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. భారీ వర్షాలు సంభవిస్తే రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు

రబీకి 23.08 లక్షల టన్నుల ఎరువులు: డిల్లీరావు

వచ్చే రబీ సీజన్‌లో పంటల సాగు అవసరాల కోసం రాష్ట్రానికి 23.08 లక్షల టన్నుల ఎరువుల్ని కేంద్రం కేటాయించినట్లు వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు బుధవారం తెలిపారు. యూరియా 9.38, డీఏపీ 2.20, కాంప్లెక్స్ 9.50, ఎంవోపీ, ఎస్ఎస్‌పీ లక్ష టన్నుల చొప్పున కేటాయించినట్లు చెప్పారు.

శ్రీశైలం కళకళ

ఏడు గేట్లు ఎత్తి నీరు దిగువకు విడుదల

నంద్యాల, విజయవాడ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి భారీగా వరద వచ్చి చేరుతోంది. దీంతో శ్రీశైలం డ్యాం నీటితో కళకళలాడుతోంది. అధికారులు బుధవారం ఏడు క్రస్ట్‌గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 1,89,655 క్యూసెక్కుల నీటిని దిగువన నాగార్జునసాగర్‌కు విడుదల చేశారు. కుడి, ఎడమ గట్టు జల విద్యుత్ ఉత్పాదన నిమిత్తం మరో 65,647 క్యూసెక్కులు విడుదల చేశారు. జూరాల, సుంకేసుల జలాశయాలతో పాటు హంద్రీ నుంచి మొత్తంగా 1,17,600 క్యూసెక్కుల మేర వరద శ్రీశైలం డ్యాంలోకి వస్తోంది. డ్యాం పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా... బుధవారం రాత్రి 9 గంటలకు 882.50 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 201.5822 టీఎంసీలుగా ఉంది.

ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద..

ప్రకాశం బ్యారేజీకి ఎగువ ప్రాంతాల నుంచి 2,96,177 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో 70 గేట్లను పూర్తిస్థాయిలో ఎత్తి 3,97,250 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. అవుట్‌ఫ్లో 3 లక్షల క్యూసెక్కులు దాటడంతో బ్యారేజీ వద్ద ఒకటో నంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. మరోవైపు నాగార్జునసాగర్ నుంచి పులిచింతల ప్రాజెక్టుకు 2.75 లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో తొమ్మిది గేట్లను నాలుగు మీటర్ల మేర ఎత్తి నీటిని దిగువన ప్రకాశం బ్యారేజీకి విడుదల చేస్తున్నారు.

బియ్యం ఎగుమతులకు బ్రేక్



ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండల తహశీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్, సబ్‌ట్రెజరీ సహా వివిధ ప్రభుత్వ కార్యాలయాలు వర్షం నీటితో జలదిగ్బంధంలో ఉన్నాయి. కాకినాడ నగరంలోనూ రహదారులు నీటమునిగాయి. అల్పపీడనం ప్రభావంతో ఉప్పాడ వద్ద సముద్రం అల్లకల్లోలంగా మారింది. భారీ అలలు బీచ్‌రోడ్డును తాకాయి. సముద్రంలోనూ అలల తీవ్రత అధికంగా ఉండడంతో కాకినాడ పోర్టు నుంచి ఆఫ్రికా దేశాలకు బియ్యం ఎగుమతులకు బ్రేక్ పడింది. నాలుగు షిప్పుల్లోకి బియ్యం లోడింగ్ నిలిచిపోయింది. కాకినాడ, తూర్పుగోదావరి కలెక్టరేట్‌లతోపాటు కాకినాడ, రాజమహేంద్రవరం, కొవ్వూరు ఆర్డీవో కార్యాలయాల్లోను కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. గోదావరి లంకల్లోని నివాసితులను అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎండైనా, వానైనా అగచాట్లే!


జ్వరంతో బాధపడుతున్న కుమార్తెను ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు తండ్రి పాట్లు

జోరువానలో చిన్నారిని ఎత్తుకుని నాలుగు కిలోమీటర్ల నడక



చింతపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం అంజలి శనివారం పంచాయతీ తాటిబంద గ్రామానికి చెందిన ఓ గిరిజనుడు అనారోగ్యంతో బాధపడుతున్న కుమార్తెను జోరు వానలో నాలుగు కిలోమీటర్లు నడిచి ఆస్పత్రికి తీసుకెళ్లాడు. గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. తాటిబంద గ్రామానికి చెందిన సిదరి సత్తిబాబు కుమార్తె లక్ష్మి (8) రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. గ్రామానికి అంబులెన్సులు, వాహనాలు వచ్చే పరిస్థితి లేకపోవడంతో బుధవారం మధ్యాహ్నం కుమార్తెను ఎత్తుకుని సత్తిబాబు డౌనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రయాణమయ్యాడు. బాలిక ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వైద్యులు వెంటనే నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి అంబులెన్సులో తరలించారు. చికిత్స అనంతరం బాలిక ఆరోగ్యం నిలకడగా ఉంది.

అప్రమత్తంగా ఉండండి



- ఆకస్మిక వరద ప్రవాహాలను అంచనా వేయండి
- కాలువలు, చెరువుల గట్లను పటిష్ఠం చేయండి
- లోతట్టు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేర్చండి
- జిల్లాల్లో పరిస్థితిని కలెక్టర్లు పర్యవేక్షించాలి
- రైతులకు ఎప్పటికప్పుడు సమాచారమివ్వండి
- అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- మంత్రులు, అధికారులతో అత్యవసర సమీక్ష
- జిల్లాల్లోనూ కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు: హోంమంత్రి

అమరావతి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. రానున్న మూడు రోజులు రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున తగిన చర్యలు తీసుకోవాలన్నారు. బుధవారం ఉండవల్లిలోని క్యాంప్ ఆఫీస్‌లో భారీ వర్షాలపై మంత్రులు, అధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. మంత్రులు అనిత, రామానాయుడు, సీఎస్ విజయానంద్ సహా విపత్తు నిర్వహణ, వ్యవసాయ, జలవనరుల శాఖల ఉన్నతాధికారులు హాజర య్యారు. సీఎం మాట్లాడుతూ.. కలెక్టర్లు కూడా అప్రమత్తంగా ఉంటూ, జిల్లాల్లో వర్షాల పరిస్థితిపై ఎప్పటికప్పుడు రైతులకు తక్షణ సమాచారం అందించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో రోడ్లు, లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీటిని తక్షణం తొలగించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో వాగులు, వంకల నుంచి వచ్చే ఆకస్మిక వరద ప్రవాహాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ దిగువ ప్రాంతాలకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రకాశం బ్యారేజికి దిగువ ప్రాంతాల ప్రజల్ని అప్రమత్తం చేసి, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వర్షాకాలంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కాలువల్లో నీటి ప్రవాహాలు సక్రమంగా ఉండేలా గుర్రపుడెక్క, తూటికాడను తొలగించాలని స్పష్టం చేశారు. అలాగే కాలువలు, చెరువులకు గండ్లు పడకుండా గట్లను పటిష్ఠం చేయాలని అధికారులను ఆదేశించారు. వరద నిర్వహణ పనుల్లో భాగంగా రూ.40 కోట్లతో బుడమేరు-వెలగలేరు యూటీ నిర్మాణాన్ని చేపట్టేందుకు సీఎం అనుమతి మంజూరు చేశారు. కృష్ణా నదిలో గురువారం నాటికి 5 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చే అవకాశం ఉందని అధికారులు సీఎంకు తెలిపారు. కాలువలకు 5 వేల క్యూసెక్కుల మేర విడుదల చేశామని వివరించారు. మరోవైపు ఎగువ నాగార్జునసాగర్, పులిచింతల గేట్లను ఎత్తినట్లు అధికారులు వివరించారు.

అధికారులు సిద్ధంగా ఉండాలి: హోంమంత్రి అనిత

రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని హోంమంత్రి వంగలపూడి అనిత అధికారులకు సూచించారు. వర్షప్రభావ ప్రాంత ప్రజలకు అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. తాడేపల్లిలోని స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ నుంచి వాతావరణ వివరాలను ఆమె పరిశీలించారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయం నుంచి కోస్తా జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాల్లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఆదివారం వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని సూచించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అత్యవసర సహాయం కోసం విపత్తు నిర్వహణ సంస్థలోని కంట్రోల్ రూమ్ టోల్‌ఫ్రీ నంబర్లు 112, 1070, 18004250101లను సంప్రదించాలన్నారు. ప్రకాశం బ్యారేజి వద్ద ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లో 3.44లక్షల క్యూసెక్కుల నుంచి 4.5లక్షల క్యూసెక్కులకు చేరే అవకాశం ఉన్నందున గుంటూరు, బాపట్ల, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు జిల్లాల నదీ పరివాహక, లోతట్టు ప్రాంత ప్రజల్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. వాగులు, కాలువలు, కల్వర్టుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విపత్తుల నిర్వహణ శాఖ స్పెషల్ సీఎస్ జయలక్ష్మి, డైరెక్టర్ ప్రఖర్‌జైన్, ఎస్డీఆర్ఎఫ్ ఐజీ రాజకుమారి, ఎన్డీఆర్ఎఫ్ కమాండెంట్, ఏపీ ఐఎండీ డైరెక్టర్ స్టెల్లా, ఏపీఎస్డీఎంఏ ఈడీ వెంకట దీపక్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా నలుగురు జడ్జీల ప్రమాణ స్వీకారం

- ప్రమాణం చేయించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్



హైకోర్టు అదనపు న్యాయమూర్తులు జస్టిస్ హరినాథ్ నూనెపల్లి, జస్టిస్ కిరణ్మయి మండవ, జస్టిస్ సుమతి జగడం, జస్టిస్ న్యాపతి విజయ్‌లతో శాశ్వత న్యాయమూర్తులుగా ప్రమాణ స్వీకారం చేయిస్తున్న సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

అమరావతి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టులో నలుగురు జడ్జీలు శాశ్వత న్యాయమూర్తులుగా బుధవారం ప్రమాణం చేశారు. హైకోర్టులోని మొదటి కోర్టు హాల్‌లో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ న్యాయమూర్తులు జస్టిస్ నూనెపల్లి హరినాథ్, జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ జగడం సుమతి, జస్టిస్ న్యాపతి విజయ్‌లతో ప్రమాణం చేయించారు. అంతకుముందు శాశ్వత న్యాయమూర్తులుగా వీరి నియామకానికి సంబంధించి రాష్ట్రపతి ద్రౌపదిముర్ము జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వైవీఎస్‌బీజీ పార్థసారధి చదివి వినిపించారు. ఈ నలుగురు అదనపు న్యాయమూర్తులుగా 2023 అక్టోబరు 21న ప్రమాణం చేశారు. వీరి పదవీకాలం అక్టోబరు 20తో ముగుస్తున్న నేపథ్యంలో వీరిని శాశ్వత న్యాయమూర్తులుగా నియమించాలని కోరుతూ సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని కొలీజియం కేంద్రానికి సిఫారసు చేసింది. దీంతో ఈ నలుగురినీ శాశ్వత న్యాయమూర్తులుగా నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఆమోదముద్ర వేశారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, అదనపు ఏజీ సాంబశివ ప్రతాప్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ, అదనపు సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ, ఏపీ బార్ కౌన్సిల్ అధ్యక్షులు ద్వారకానాథ రెడ్డి, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షులు కె.చిదంబరం, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ పార్థసారధి, రిజిస్ట్రార్‌లు, ఏపీ హైకోర్టు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది హాజరయ్యారు.

ప్రోత్సాహకాలివ్వకుంటే ఏ కంపెనీ వస్తుంది?



(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్, బెంగళూరుకు తరలివెళ్తాయని పేర్కొంది. ప్రఖ్యాత కంపెనీలను ఆకర్షించాలంటే ప్రోత్సాహకాలు ఇవ్వడం తప్ప మరోమార్గం లేదని వ్యాఖ్యానించింది. నామమాత్రపు ధరతో భూకేటాయింపును సంకుచిత దృష్టితో చూడకూడదని, తద్వారా వచ్చే ప్రయోజనాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టంచేసింది. ఐటీ సంస్థలు రావడం వల్ల యువతకు ఉద్యోగాలు లభించడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వానికి రెవెన్యూ కూడా పెరుగుతుందని గుర్తు చేసింది. పెట్టుబడులు రాకుంటే ఆంధ్రప్రదేశ్ వ్యవసాయాధారిత రాష్ట్రంగా మిగిలిపోతుందని, ఖాళీ భూములు తప్ప ఇక్కడ ఏమీ ఉండవని పేర్కొంది. ప్రస్తుత ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్).. వివిధ సంస్థలకు భూకేటాయింపులను సవాల్ చేస్తూ వేసిన పిల్స్‌కు జత చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. భూకేటాయింపు విషయంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. విశాఖపట్నంలో మధురవాడ పరిధిలో కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు 22.19 ఎకరాలను ఎకరా 99 పైసలకే కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గత నెల 1న జారీ చేసిన జీవో 21ని సవాల్ చేస్తూ సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ ప్రాపర్టీ అండ్ ఎన్విరాన్మెంటల్ రైట్స్(ఎస్‌పీసీపీఈఆర్) విశాఖ జిల్లా అధ్యక్షురాలు నక్కా నమ్మిగ్రేస్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా.. గ్రేస్ తరఫున న్యాయవాది జడ శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపించారు. విశాఖ నడిబొడ్డున రూ.1,109 కోట్లు విలువ చేసే స్థలాన్ని కాగ్నిజెంట్‌కు 99 పైసలకే సేల్ డీడ్ ద్వారా విక్రయించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. సేల్ డీడ్ ద్వారా భూమిని విక్రయించేందుకు ఏపీఐఐసీ నిబంధనలు అనుమతించవని.. లీజు పద్ధతిలో భూకేటాయింపులు జరపాల్సి ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి వాదనలు వినిపిస్తూ.. నూతన పారిశ్రామిక విధానానికి అనుగుణంగానే భూకేటాయింపులు చేస్తున్నట్లు నివేదించారు. భూకేటాయింపులతో ముడిపడి ఉన్న అన్ని వ్యాజ్యాలపై కౌంటర్ దాఖలు చేస్తామని, అందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. అంగీకరించిన ధర్మాసనం విచారణను వాయిదా వేసింది.

ఇద్దరు జీపీలు, ఓ స్టాండింగ్ కౌన్సిల్ నియామకం

- ఉత్తర్వులు జారీ చేసిన న్యాయశాఖ

అమరావతి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టులో ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించేందుకు న్యాయవాదులు ఎస్.బాలమోహన్ రావు, జీవీఎల్ మూర్తిని ప్రభుత్వ న్యాయవాదులుగా నియమిస్తూ న్యాయశాఖ గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. అలాగే ఏపీ స్టేట్ వక్ఫ్ బోర్డు తరఫున హైకోర్టులో వాదనలు వినిపించేందుకు న్యాయవాది షేక్ కరీముల్లా స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులయ్యారు. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మూడేళ్ల పాటు వీరు ఈ పదవిలో కొనసాగుతారు. వీరి నియామకానికి సంబంధించి న్యాయశాఖ కార్యదర్శి జి.ప్రతిభా దేవి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

రీపోలింగ్‌కు ఆదేశించాలంటూ వైసీపీ జడ్పీటీసీ అభ్యర్థుల పిటిషన్లు

- హైకోర్టులో నేడు విచారణ

అమరావతి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీలకు ఈ నెల 12న జరిగిన ఉప ఎన్నికలో అధికారపార్టీ నేతలు దౌర్జన్యాలకు పాల్పడ్డారని, అక్రమాలు చోటు చేసుకున్న పలు పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర సాయిధ పోలీసు బలగాల భద్రతతో రీపోలింగ్ నిర్వహించేలా రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని (ఎస్ఈసీ)ని ఆదేశించాలని కోరుతూ వైసీపీ జెడ్పీటీసీ అభ్యర్థులు తుమ్మల హేమంత్‌రెడ్డి, ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి హైకోర్టులో అత్యవసరంగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాన్ని లంచ్ మోషన్లుగా విచారణ జరిపేందుకు న్యాయస్థానం అంగీకరించింది. అయితే వ్యాజ్యాలు సరైన సమయానికి బెంచ్ ముందుకు రాకపోవడంతో పిటిషన్లపై బుధవారం విచారణ సాధ్యపడదని న్యాయస్థానం ప్రకటించింది. పిటిషనర్ల తరపున న్యాయవాది వీఆర్ రెడ్డి కొవ్వూరి వాదనలు వినిపిస్తూ.. వ్యాజ్యాలపై అత్యవసరంగా విచారణ జరపకుంటే నిరర్థకం అవుతాయన్నారు. ఈ నెల 12న నిర్వహించిన జెడ్పీటీసీ ఉప ఎన్నికకు సంబంధించి పలు కేంద్రాల్లో రీపోలింగ్ నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి వినతిపత్రం అందజేశామని తెలిపారు. కేవలం రెండు పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ నిర్వహించాలని ఎస్ఈసీ బుధవారం వేకువజామున 3 గంటలకు నిర్ణయం తీసుకుందన్నారు. ఈ నేపథ్యంలో అత్యవసరంగా పిటిషన్లు వేశామన్నారు. న్యాయస్థానం స్పందిస్తూ.. ఈ దశలో తాము జోక్యం చేసుకోలేమని ప్రకటించింది. పిటిషనర్ల తరపు న్యాయవాది వాదనలు కొనసాగిస్తూ.. వ్యాజ్యాల్లో తమ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవాలని కనీసం గురువారం ఉదయం కోర్టు ప్రారంభమైన వెంటనే పిటిషన్లపై విచారణ జరపాలని కోరారు. అందుకు అంగీకరించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ విచారణను గురువారానికి వాయిదా వేశారు.

రాష్ట్రపతి ఉత్తర్వులకు అనుగుణంగానే స్థానికత నిర్ణయం

- హైకోర్టుకు నివేదించిన ఏజీ, ఏకీభవించిన ధర్మాసనం
- సుప్రీంకోర్టులోనే తేల్చుకోవాలని పిటిషనర్లకు సూచన

అమరావతి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకే స్థానికత నిర్ణయిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ బుధవారం హైకోర్టుకు నివేదించారు. ఆ ఉత్తర్వుల ప్రకారం అర్హత పరీక్షకు హాజరయ్యేనాటికి వరుసగా నాలుగేళ్లు రాష్ట్రంలో చదివిన విద్యార్థులనే స్థానిక అభ్యర్థులుగా పరిగణిస్తారని తెలిపారు. స్థానికత విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఆ ఉత్తర్వులకు అనుగుణంగా నడుచుకోవడం తప్ప మరో మార్గం లేదని స్పష్టంచేశారు. ఈ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం స్థానికత అంశాన్ని సుప్రీంకోర్టులోనే తేల్చుకోవాలని పిటిషనర్లకు సూచించింది. ఈ వ్యవహారం పై సవివరంగా గురువారం ఉత్తర్వులు జారీ చేస్తామని పేర్కొంది. కాగా.. నీట్ పరీక్షలో అర్హత సాధించినప్పటికీ, ఇంటర్మీడియట్ తెలంగాణలో చదివామనే కారణంతో వైద్య విద్య ప్రవేశాలకు నిర్వహించే కౌన్సెలింగ్‌లో తమను లోకల్ అభ్యర్థులుగా పరిగణించక పోవడాన్ని సవాల్ చేస్తూ గుంటూరు జిల్లా, ప్రత్తిపాడుకు చెందిన ఎస్‌కె ఖమరుద్దీన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అలాగే శ్రీకాకుళం జిల్లా, కోటబొమ్మాళికి చెందిన సనపల వెంకటరమణ మరో 51మంది మరో పిటిషన్ వేశారు. వీటితో పాటు మరో 20 పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది.

పులివెందులలో 2 చోట్ల రీపోలింగ్ ప్రశాంతం

- కడప స్ట్రాంగ్‌రూంకు బ్యాలెట్ బాక్సుల తరలింపు
- నేడు ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన

పులివెందుల, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలో రెండు పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మంగళవారంనాటి పోలింగ్‌లో అచ్చవెల్లిలో మూడో పోలింగ్ బూత్ వద్ద ఓట్లు వేసేందుకు వస్తున్న వారిపై దాడి జరగడం, అలాగే ఇకొత్తపల్లెలో ఏజెంట్ల విషయమై జరిగిన గొడవల కారణంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ రెండు చోట్ల రీపోలింగ్‌కు ఆదేశించింది. బుధవారం రీపోలింగ్ నిర్వహించారు. దీనిగురించి ఓటర్లకు చాలాసేపటి వరకు తెలియలేదు. దీనికి తోడు ఉదయం నుంచీ వర్షం కురుస్తుండడంతో ఓటింగ్ శాతంపై దాని ప్రభావం పడింది. 3వ పోలింగ్ కేంద్రంలో మొత్తం ఓట్లు 492 . ఇక్కడ మంగళవారం 398 ఓట్లు పోల్ కాగా బుధవారం 337 ఓట్లు పడ్డాయి. 14వ పోలింగ్ కేంద్రంలోని 1,273 ఓట్లకు గాను మంగళవారం 919 ఓట్లు పడ్డాయి. బుధవారం 691 ఓట్లు పోలయ్యాయి. రీపోలింగ్‌ను ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ పరిశీలించారు. టీడీపీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డి ఆయా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటింగ్ సరళిని పరిశీలించారు. విలేకరులతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రజలు తనను గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. రీపోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను అధికారులు ప్రత్యేక వాహనంలో కడప స్ట్రాంగ్ రూంకు తరలించారు.

వైసీపీ వారిపై చర్యలు తీసుకోండి

- రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు టీడీపీ ఫిర్యాదు

అమరావతి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట, పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో వైసీపీ అరాచకానికి పాల్పడిందని టీడీపీ ఆరోపించింది. ఉప ఎన్నికల సందర్భంగా సక్రమంగా విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులపై వైసీపీ నేతలు వ్యక్తిగత దూషణలకు పాల్పడ్డారని, ఈసీ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను టీడీపీ నేతలు కోరారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నిని మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ, ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ నేతలు వర్ల రామయ్య, దేవినేని ఉమ, కుప్పం రాజశేఖర్ కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 31 క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న జగన్ రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబును దుర్భాషలాడటం దారుణమని పంచుమర్తి అనురాధ అన్నారు. అసలైన రాక్షస పాలనకు నిదర్శనం ఐదేళ్ల జగన్ పాలన అని విమర్శించారు. పింఛన్‌ను చంద్రబాబు రూ.4 వేలు చేయడం రాక్షస పాలనా? 67 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేయడం రాక్షస పాలనా అని అనురాధ ప్రశ్నించారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరిగితే జగన్ సహించలేకపోతున్నారని వర్లరామయ్య అన్నారు. వైసీపీ పాలనలో స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్లు వేయడానికి కూడా ప్రత్యర్థులకు అవకాశం ఇవ్వలేదని, అలాంటి పరిస్థితి నుంచి ఏ పార్టీ వారైనా ధైర్యంగా నామినేషన్లు వేసే పరిస్థితికి తీసుకొచ్చామని అన్నారు. దశాబ్దాలుగా ఓటు హక్కు వినియోగించుకోని పులివెందుల, ఒంటిమిట్ట ఓటర్లు స్వేచ్ఛగా, ధైర్యంగా ఓటు వేయడం చంద్రబాబు ప్రజాస్వామ్య పాలనకు నిదర్శనమన్నారు.

నరకానికి పోతావ్..

- ఇవే నీకు చివరి ఎన్నికలు కావచ్చు
- చంద్రబాబుపై జగన్ తిట్లు... శాపనార్థాలు



అమరావతి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉపఎన్నికల్లో పోలీసులు పచ్చచొక్కాలు వేసుకుని డ్యూటీ చేశారంటూ వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ నోరు పారేసుకున్నారు. 'ఇవే నీకు చివరి ఎన్నికలు కావచ్చు. ఈ ముసలి వయసులో రామాకృష్ణా.. అనుకుంటే పుణ్యం అయినా వస్తుంది. ఇలా చేస్తే గనుక నరకానికి పోతా"రంటూ ముఖ్యమంత్రి చంద్రబాబుపై అవాకులు చెవాకులు పేలారు. కేంద్ర బలగాల పర్యవేక్షణలో పులివెందుల, ఒంటిమిట్ట ఉప ఎన్నికలను తిరిగి జరిపించేందుకు సిద్ధమా అంటూ చంద్రబాబుపై పొంతన లేని మాటలు మాట్లాడారు. డీఐజీ వ్యవస్థ మాఫియా ముఠాలా పనిచేస్తుందన్నారు. తాడేపల్లిలోని తన నివాసంలో బుధవారం 'ఎంపిక చేసుకున్న' మీడియాతో జగన్ మాట్లాడారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో అక్రమాలు జరిగిపోయాయంటూ.. కొన్ని ఫొటోలు, వీడియోలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పోలీసు వ్యవస్థ, రాష్ట్ర ఎన్నికల సంఘం, సీఎం చంద్రబాబు, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, మాణిక్కం ఠాకూర్‌లపై ఆయన ఆరోపణలు గుప్పించారు. చంద్రబాబుకు తనకు నచ్చిన పోలీసు అధికారులను ఎంపిక చేసి ఉప ఎన్నికలను జరిపించారని జగన్ ఆరోపించారు. "డీజీపీ కోయ ప్రవీణ్ టీడీపీ మాజీ ఎంపీ అల్లుడు. పోలీసులు దగ్గరుండి రిగ్గింగ్ వేయించారు. పులివెందులలో 15 బూత్‌ల్లో వైసీపీ ఏజెంట్లే లేరు. చంబల్‌లోయ బందిపోట్లను మైమరిపించేలా దౌర్జన్యంగా చంద్రబాబు ఓట్లు వేయించుకున్నారు" అని ఆరోపించారు. చంద్రబాబును ఎవరూ లీడర్ అనరని.. ఫ్రాడ్‌స్టర్ అంటారంటూ అక్కసు వెళ్లగక్కారు.

రాహుల్ నిజాయితీపరుడా?

కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీపై జగన్ తీవ్ర విమర్శలు చేశారు. 'రాహుల్ గాంధీ, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు హాట్‌లైన్‌లో మాట్లాడుకుంటారు. అందువల్లే ఆంధ్రాలో దొంగఓట్లపై రాహుల్ మాట్లాడటం లేదు. రాష్ట్రంలోని కుంభకోణాలపై కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్ నోరెత్తరు. కానీ, నాపై విమర్శలు చేస్తారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ పోరాటంలో తనను చేరమనడానికి అర్థం ఉండాలంటూ ఓ మీడియా ప్రతినిధిపై అసహనం వ్యక్తం చేశారు. దొంగ ఓట్లపై రాష్ట్ర ఎన్నికల సంఘం ముందు వాదనలు వినిపించామన్నారు. దేశంలో ఎక్కడైనా ఓట్లలో మోసం జరిగిందంటే ఏపీలోనే అత్యధికంగా ఉందని జగన్ అన్నారు. కన్నుమూసి తెరిచేలోగా ఏడాదిన్నర అయిపోయిందని, మరో మూడున్నరేళ్లు ఇలాగే కన్నుమూసి తెరిచేలోగా అయిపోతాయన్నారు. 2029 ఎన్నికల్లో చంద్రబాబుకు డిపాజిట్లు రాకుండా పోతాయని శపించారు. ప్రజాస్వామ్యం చేయి జారిపోతే నక్సలిజం పుడుతుందని విశ్లేషించారు. డేంజరస్ సిస్టమ్ వస్తుందన్నారు. కేంద్ర బలగాల ఆధ్వర్యంలో ఎన్నికలు జరపించాలని డిమాండ్ చేశారు.

ఈసీపై అవాకులు

రాష్ట్ర ఎన్నికల సంఘం డమ్మీ పాత్రను పోషిస్తోందని జగన్ అన్నారు. జడ్పీటీసీ ఉప ఎన్నికలను రద్దు చేయాలంటూ కోర్టుకు వెళతామని తెలిపారు. ఈ కక్షలూ కార్పణ్యాలు, దుర్మార్గాలు చంద్రబాబుకు చుట్టుకుంటాయంటూ శాపనార్థాలు పెట్టారు. ఈ మాదిరిగా ఎన్నికలు జరిగినట్లయితే.. ఎన్నికలు జరపడం ఎందుకని జగన్ అసహనం వ్యక్తం చేశారు. "రాష్ట్ర ఎన్నికల సంఘానికి సంపూర్ణ అధికారాలు ఉన్నాయి. కొవిడ్ సమయంలో సగం ఎన్నికలు జరిగిపోయాక.. మిగిలిన ఎన్నికలను ఏడాది పాటు వాయిదా వేసింది. ఈసీకి ఉన్న అధికారం అది. కానీ, రాష్ట్రంలో ఎన్నికల సంఘం తనకున్న సంపూర్ణ అధికారాన్ని వాడటం లేదు" అని వ్యాఖ్యానించారు. పులివెందుల, ఒంటిమిట్టలో ప్రజాస్వామ్యం కనిపించలేదని, వైసీపీ నేతలను పట్టుకుని "కాల్చి పారేస్తా..." అని డీఎస్పీ అనేస్థాయిలో పోలీసుల దౌర్జన్యాలు కొనసాగాయని జగన్ విమర్శించారు.

ప్రజలకు భయం పోయింది.. జగన్‌కు పట్టుకుంది

- వణుకు రేపిన పులివెందుల పోలింగ్
- ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఫైర్



అమరావతి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ప్రజలకు భయం పోయింది... జగన్‌కు భయం పట్టుకుందని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ వ్యాఖ్యానించారు. బుధవారం అమరావతి సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. "పులివెందుల ప్రజలు ధైర్యంగా బయటకు వచ్చి ఓటు వేశారు. దీంతో తాడేపల్లి ప్యాలె్స్‌లో ప్రకంపనాలు మొదలయ్యాయి. జగన్ నిరాశతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఆయనను పార్టీ క్యాడర్ వదిలిపోతోంది. ప్రజలు ఛీ కొడుతున్నారు. పులివెందుల, ఒంటిమిట్ట ఉపఎన్నికల ఫలితాలు కళ్ల ముందు కనిపిస్తుండడంతో ఓటమికి కారణాలు వెతుక్కుంటున్నారు" అని పయ్యావుల పేర్కొన్నారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు 2020లో కడపలో 79 శాతం జడ్పీటీసీలు, 76 శాతం ఎంపీటీసీలు ఏకగ్రీవంగా జరిగాయని గుర్తుచేశారు. "జగన్ సీఎంగా ఉన్నప్పుడు మొదటి మూడేళ్లలో మూడు సార్లు, చివరిలో రెండు సార్లు పాత్రికేయ సమావేశాలు నిర్వహించారు. కానీ ఇప్పుడు ప్రతి రోజూ పాత్రికేయ సమావేశాలు పెడుతూ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్నారు. ఇది దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది" అని ప్రశ్నించారు. జగన్ మొదటిసారిగా రాజ్యాంగం, చట్టాల గురించి మాట్లాడుతుంటే సంతోషంగా ఉందని, అసెంబ్లీకి వస్తే వాటిపై శిక్షణ కూడా పొందవచ్చునని వ్యాఖ్యానించారు. కాగా, దేశంలో ఓట్ల చోరీకి మూలం జగన్ అని, సీఎంగా ఉండగా ఎన్నికల అక్రమాలకు వొడిగట్టారని మండిపడ్డారు. "చంద్రబాబుకు ఇది చివరి ఎన్నికలు అని జగన్ అంటున్నారు. అసలు జగన్ వచ్చే ఎన్నికల్లో పోటీచేస్తారో.. లేదో..? ఎన్నికల బరిలో నిలిచేందుకు ఆయనకు అవకాశం ఉంటుందో లేదో?" అంటూ పయ్యావుల వ్యాఖ్యానించారు.

జగన్ నోరు అదుపులో పెట్టుకో: సోమిరెడ్డి

నెల్లూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పులివెందులలో జడ్పీటీసీ ఎన్నికలకు నామినేషన్ల దాఖలవడం, పోలింగ్ కూడా జరగడంతో స్థానిక ఎమ్మెల్యే జగన్మోహన్‌రెడ్డి ఓర్చుకోలేక ఒళ్లు బలిసి మాట్లాడుతున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. నోరు అదుపులో పెట్టుకోకపోతే జగన్‌రెడ్డి అండ్ బ్యాచ్ ఫలితం అనుభవించకతప్పదని హెచ్చరించారు. బుధవారం నెల్లూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు నరకానికి పోతారంటూ జగన్ శాపనార్థాలు పెట్టడం రాజకీయంగా ఆయన పతనానికి నిదర్శనమన్నారు. జగన్‌తోపాటు ఆయన అనుచరులు కూడా ఒళ్లు బలిసి మాట్లాడుతున్నారని అన్నారు. వారి సంగతి తేల్చే బాధ్యతను లోకేశ్ తీసుకున్నారని తెలిపారు.



బీజేపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

ఎప్పటికైనా జగన్ జైలుకే..!

- ఆయన్ను బీజేపీ కాపాడుతోందనడం అవాస్తవం: మాధవ్

నెల్లూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిని జైలుకు పోనీయకుండా బీజేపీ అడ్డుకుంటుందన్న అసత్య ప్రచారాలు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. జగన్‌పై ఉన్న వివిధ కేసులు ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉన్నాయి. అయితే, ఎప్పటికైనా జగన్ జైలుకు వెళ్లక తప్పదు' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ స్పష్టం చేశారు. బుధవారం ఉదయం నెల్లూరుకు వచ్చిన మాధవ్.. తొలుత వేదాయపాళెం కూడలి వద్ద చాయ్ పే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆత్మకూరు బస్టాండ్ వద్ద పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు. వీఆర్సీ మైదానం నుంచి కస్తూరిబా కళాక్షేత్రం వరకు బీజేపీ శ్రేణులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. కస్తూరిబా కళాక్షేత్రంలో జరిగిన బీజేపీ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో మాధవ్ పాల్గొని ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో రూ.9.75 లక్షల కోట్లు పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రంలో సెమీ కండక్టర్ తయారీ యూనిట్ ఏర్పాటుకు ఆమోదం తెలిపారన్నారు. దేశంలో పనికిమాలిన, పనికారాని నాయకుడు రాహుల్ గాంధీ అని విమర్శించారు.

జగన్‌కు దమ్ముంటే మోదీ, షాపై పోరాడాలి: మాణిక్కం

- ఓడినా జగన్ ఆలోచనా విధానం ఏమాత్రం మారలేదు: చామల

అమరావతి/న్యూఢిల్లీ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపులో 12.5శాతం మేర తేడా వచ్చిందంటున్న వైసీపీ అధ్యక్షుడు జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే గురువారం తాము నిర్వహించే ర్యాలీలో పాల్గొనాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్కం ఠాకూర్ బుధవారం సవాల్ విసిరారు. జగన్‌కు దమ్ముంటే ఈ సవాల్‌ను స్వీకరించాలని డిమాండ్ చేశారు. షర్మిల నేతృత్వంలో విజయవాడలో గురువారం ఓట్ల చోరీపై ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. జగన్‌కు దమ్ముంటే ఓట్ల చోరీకి పాల్పడిన ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాకు వ్యతిరేకంగా పోరాడాలని సవాల్ విసిరారు. "రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ కోసం పోరాటం చేయడం లేదు. ఆయన దేశం, ప్రజాస్వామ్యం కోసం పోరాడుతున్నారు. జగన్‌లా మోదీని చూసి రాహుల్ భయపడరు. చంద్రబాబు- మోదీ, జగన్-అమిత్ షా, పవన్ కలిసి పనిచేస్తున్నారు. వీరంతా ఒక్కటే అనేది సుస్పష్టం. ఈ విషయం ఏపీ ప్రజలకు తెలుసు" అని అన్నారు. కాగా, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినా జగన్ ఆలోచనా విధానం ఏమాత్రం మారలేదని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. జగన్ కూడా రాహుల్ గాంధీకి మద్దతు ఇచ్చి విజయవాడలో జరిగే ధర్నాలో పాల్గొనాల్సిన అవసరం ఉందన్నారు.

జగన్ ఫ్యాక్షనిజానికి ఎన్నికల్లో స్వస్తి పలికాం: మంత్రి కొల్లు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డి ఫ్యాక్షనిజానికి స్వస్తిపలికి పులివెందులలో ప్రజాస్వామ్యయుతంగా ఉపఎన్నికలు నిర్వహించామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. 30 ఏళ్ల తరువాత చాలా మంది తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. దేశంలో అత్యున్నత ఎక్సైజ్ పాలసీ విధానాన్ని ఏపీలో అమలు చేశామన్నారు. వచ్చే నెల నుంచి కొత్త బార్ పాలసీ విధానాన్ని అమలు చేస్తున్నామని వెల్లడించారు. రోడ్డు మీద మద్యం తాగే విధానానికి స్వస్తి పలికేందుకు పర్మిట్ రూమ్‌లకు అనుమతులు ఇస్తున్నామని మంత్రి వెల్లడించారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**, on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal, Guntur, Editor: **N.Rahul Kumar** Phone No: (0863)2512379,2512376 ,
RNI no.APTEL/2003/9781. **Managing Director : Vemuri Radha Krishna**. Founder: K.L.N.Prasad.